సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+12 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 265


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'


**భారత్ బాండ్..**
రిస్క్ వద్దనుకునే వారికి ఇన్వెస్ట్‌మెంట్‌కు సురక్షిత సాధనం
– ప్రాఫిట్‌ప్లస్‌లో


**సెంచరీలతో షాక్ ఇచ్చారు**
హెట్‌మైర్, హోప్ శతకాలు. తొలి వన్డేలో భారత్‌పై విండీస్ గెలుపు.
– స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

# ఆగని పౌరసత్వ ప్రకంపనలు


పౌరసత్వ సవరణ చట్టాన్ని నిరసిస్తూ ఆదివారం ఢిల్లీలో బస్సులకు నిప్పుపెట్టిన ఆందోళనకారులు

- ఢిల్లీలో బస్సులకు నిప్పు
- జామియా వర్సిటీలో పోలీసుల సోదాలు
- గువాహటిలో నాలుగుకు చేరిన మృతులు
- రాజకీయ పార్టీ పెట్టనున్న ఏఏఎస్‌యూ

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. దేశ రాజధానితో పాటు పశ్చిమబెంగాల్, అస్సాంల్లో ఆదివారం ఉధృతంగా నిరసన ప్రదర్శనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ఢిల్లీలో ఆందోళనకారులు బస్సులకు, అగ్నిమాపక వాహనానికి నిప్పుపెట్టారు. గువాహటిలో పోలీసుల కాల్పుల్లో మృతుల సంఖ్య నాలుగుకి చేరింది. లండన్‌లోని భారతీయ హైకమిషన్ కార్యాలయం ఎదుట కొందరు ప్లకార్డులతో నిరసన తెలిపారు.

5 లో

## కాంగ్రెస్ అగ్నికి ఆజ్యం పోస్తోంది


కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు పౌరసత్వ సవరణ చట్టంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, దేశంలో అశాంతిని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు. ఆదివారం జార్ఖండ్‌లోని దుమ్కాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడారు.



## ఉన్నావ్ కేసు.. తీర్పు నేడే..?

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉన్నావ్ అత్యాచారం కేసులో ఢిల్లీ కోర్టు సోమవారం తీర్పు వెలువరించే అవకాశముంది. ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేశారని బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్ ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం నమోదైన ఈ కేసుకు సంబంధించి రహస్య విచారణ సందర్భంగా ఢిల్లీ కోర్టు న్యాయమూర్తి ధర్మేశ్‌శర్మ 16వ తేదీన తీర్పు ఇవ్వనున్నట్లు కథనాలు వెలువడ్డాయి. సీబీఐ వాదనలు పూర్తయిన తర్వాత తీర్పు ఇచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

- వివరాలు 5లో



## నిర్భయ దోషులను.. నేను ఉరి తీస్తా

నిర్భయ కేసులో దోషులను ఉరి తీసేందుకు అనుమతివ్వాలని కోరుతూ షూటర్ వర్తికా సింగ్ తన రక్తంతో రాసిన ఓ లేఖను కేంద్ర ప్రభుత్వానికి పంపారు. 'నా చేతిలో ఉన్న లేఖను హోంమంత్రి అమిత్‌షాకు రక్తంతో రాశా. నిర్భయ దోషులను ఉరి తీసేందుకు అనుమతి ఇవ్వాలని కోరాను. భారత్‌లో మహిళలను దేవతలుగా చూసే సంస్కృతి బలోపేతానికి ఈ అంశం దోహదపడుతుంది. మహిళ కూడా ఉరి తీయగలదన్న విషయాన్ని అత్యాచార దోషులు తెలుసుకోవాలి. ఈ లేఖను రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపాను. ట్వీట్ కూడా చేశా' అని ఆమె తెలిపారు.

- వివరాలు 5లో





## దేశవ్యాప్త ఎన్‌ఆర్‌సీకి త్వరలో బిల్లు?

అస్సాంలో చేపట్టిన ఎన్‌ఆర్‌సీని జాతీయ స్థాయిలో అమలు చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు ఓ చట్టం చేసేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తున్నట్లు అంచనా. దేశవ్యాప్త ఎన్‌ఆర్‌సీ చట్టం అమల్లోకి వస్తే దేశంలో అక్రమంగా ఉంటున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు అవకాశముంటుంది. అక్రమ వలసదారులను వారి స్వదేశాలకు తిప్పి పంపేందుకు కేంద్రానికి అధికారాలు లభిస్తాయి.

- వివరాలు 5లో

# ఫ్యామిలీ ఫార్మర్!

**సాక్షి, హైదరాబాద్:** ఆహారం అంటేనే ఆరోగ్యం. ఆరోగ్యం అంటేనే ఆహారం. కానీ ఇప్పుడు ఆహారం అంటేనే దాదాపు భయపడాల్సిన పరిస్థితి. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల ద్వారా పండిన పంటలు ఒకవైపు.. కల్తీ ఆహార పదార్థాలు మరోవైపు మూకుమ్మడి దాడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సేంద్రియ పంటలు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇందులో కూడా ఏది సేంద్రియం.. ఏది సేంద్రియం కాదనేది తెలుసుకోవడం కాస్త కష్టమే. అందుకే నమ్మకమైన ఫ్యామిలీ ఫార్మర్స్ వచ్చేశారు. ఫ్యామిలీ డాక్టర్ ఎలాగో.. ఫ్యామిలీ ఫార్మర్స్ అలాగన్న మాట. మనకు కావాల్సిన ఆరోగ్యకరమైన, నిజమైన సేంద్రియ పంటలు మన ముంగిళ్లకే తెచ్చి ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పుడు మన రాష్ట్రంలో 'ఫ్యామిలీ ఫార్మర్స్' నయా ట్రెండ్ మొదలైంది. దీంతో ఆదాయంతో పాటు తృప్తి కలుగుతుందని ఈ ఫార్మర్స్ చెబుతున్నారు. రసాయనాల్లేని ఆహారాన్ని తమ వంట గదుల్లో అందుబాటులో ఉంచుకోవాలని కోరుకునే కుటుంబాలకు కొందరు రైతులు 'ఫ్యామిలీ ఫార్మర్ల్లు'గా మారుతున్నారు.



- రాష్ట్రంలో పెరుగుతున్న నయా ట్రెండ్.
- సేంద్రియ పంటలు నేరుగా ఇంటికే..
- ఆరోగ్యానికి ఆరోగ్యం.. రుచికి రుచి!
- అనారోగ్యానికి చెక్ పెట్టేందుకు దోహదం.. రసాయన ఎరువులు, మందులకు దూరం
- నమ్మకంగా ఆహార పదార్థాలు అందజేస్తున్న రైతులు

**నేరుగా ఇళ్లకే సరఫరా..**
పరిశుభ్రమైన, పురుగు మందులు, రసాయన ఎరువుల్లేకుండా పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పండించే ఆహారపదార్థాలపై ఇప్పుడు జనంలో ఆసక్తి పెరిగింది. అలాంటి ఆహారం కోసం ఎదురుచూస్తున్నారు. అలాంటివారి కోసం కొందరు రైతులు సేంద్రియ ఆహారం పండించి ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. ఇప్పుడు హైదరాబాద్ సహా పలు పట్టణాలు, నగరాల్లో సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, వరి, పప్పుల కోసం జనం పరుగులు పెడుతున్నారు. కొందరు పాలు, కూరగాయలు, బియ్యం, పప్పులు, సుగంధ ద్రవ్యాలన్నీ ఇలాగే కొంటున్నారు. కొందరు రైతుల నుంచి కొంటుండగా, మరికొందరు పలు సంస్థల నుంచి కొనుగోలు చేస్తున్నారు.
**నేరుగా అపార్ట్‌మెంట్లకు.. :** రంగారెడ్డి జిల్లా కడ్తల్ గ్రామానికి చెందిన చల్లా పవన్‌రెడ్డి హైదరాబాద్‌లో కొందరు అబ్బాయిలను నియమించుకున్నాడు. వారు నేరుగా అపార్ట్‌మెంట్లకు, ఇళ్లకు వెళ్లి పవన్ పండించే మిగతా 2వ పేజీలో ▶

## ఇక జస్టిస్ ధర్మాధికారిదే నిర్ణయం

- విద్యుత్ ఉద్యోగుల విభజన మధ్యవర్తిత్వం విఫలం
- రిలీవైన 1,157 మందిలో ఏపీకి ఆప్షన్లు ఇచ్చిన 613 మంది ఉద్యోగులు
- రాష్ట్ర ఆఫర్‌ను తిరస్కరించిన ఏపీ విద్యుత్ సంస్థలు
- తుది నిర్ణయం తానే తీసుకుంటానని జస్టిస్ ధర్మాధికారి ఉత్తర్వులు

**సాక్షి, హైదరాబాద్:** విద్యుత్ ఉద్యోగుల విభజన వివాదం పరిష్కారం దిశగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విద్యుత్ సంస్థలతో జస్టిస్ డీఎం ధర్మాధికారి ఏకసభ్య కమిషన్ ఏడాదిగా జరుపుతున్న మధ్యవర్తిత్వం ముగిసింది. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ధర్మాధికారి ఆదివారం రెండో రోజు నిర్వహించిన సమావేశంలో సైతం 2 రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఏపీ స్థానికత కలిగి ఉన్నారన్న కారణంతో తెలంగాణ విద్యుత్ సంస్థలు 2015 జూన్‌లో 1,157 మంది ఉద్యోగులను ఏకపక్షంగా ఏపీకి రిలీవ్ చేయడంతో ఈ వివాదం చెలరేగింది. దీంతో ఉద్యోగుల విభజన కోసం ఉద్యోగులందరి నుంచి ఆప్షన్లు స్వీకరించాలని గతంలో ధర్మాధికారి మార్గదర్శకాలు
మిగతా 2వ పేజీలో ▶

## మన అంకోర్‌వాట్ కూలుతోంది..

- క్రమక్రమంగా ధ్వంసమవుతున్న దేవునిగుట్ట ఆలయం.. దేశంలో ఏకైక కంబోడియా తరహా నిర్మాణం
- మూడేళ్ల క్రితమే వెలుగులోకి.. పునరుద్ధరణకు సిద్ధమైన ఏఎస్ఐ
- ఇప్పటివరకు ఎన్‌ఓసీ ఇవ్వని అధికారులు

- వివరాలు 2లో


ఆదివారం యాదాద్రి జిల్లా బీబీ నగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఫాస్టాగ్ కౌంటర్ల ద్వారా వాహనాలు సాఫీగా వెళ్తుండగా నగదు చెల్లింపు కౌంటర్ల వద్ద బారులు తీరిన వాహనాలు




# ఫాస్టాగ్‌తో సాఫీగా.. నగదుతో రద్దీగా..

- టోల్‌ప్లాజాల్లో అమల్లోకి వచ్చిన ఎలక్ట్రానిక్ టోల్ చెల్లింపు విధానం
- సాఫీగా ముందుకెళ్లిన ఫాస్టాగ్ వాహనదారులు.. ఫాస్టాగ్ లేని వాహనదారులకు మాత్రం తీవ్ర ఇబ్బందులు
- కి.మీ. మేర వాహనాల బారులు
- ఎక్కువ మంది ఫాస్టాగ్‌లు తీసుకోకపోవడంతో సమస్య


**సాక్షి, నెట్‌వర్క్:** టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ తెరదించేందుకు ఉద్దేశించిన 'ఫాస్టాగ్'విధానం ఆదివారం నుంచి అమల్లోకి వచ్చింది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టోల్‌గేట్ల వద్ద ఈ ఫాస్టాగ్ అతికించిన వాహనాలు వేగంగా ముందుకు వెళ్లిపోవడం కనిపించింది. అయితే ప్రతీ వాహనానికి గేటు ఎత్తి పంపాల్సి రావడంతో కాస్త జాప్యం జరిగింది. అయినా అది పెద్ద సమస్యగా మారలేదు. కాకపోతే ఫాస్టాగ్ లేని వాహనదారులు మాత్రం ఎక్కువ సమయం నిరీక్షించాల్సి రావటంతో ప్రధాన జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల సాధారణ గేట్ల వద్ద మాత్రం భారీ క్యూలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల్లోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తొలుత ఈ విధానాన్ని ఈ నెల 1 నుంచే ప్రారంభించాలని భావించారు. కానీ ఎక్కువ మంది ట్యాగ్‌లు పొందనందున 15 రోజుల వరకు
మిగతా 2వ పేజీలో ▶




NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb FRESH CHICKEN
సూచించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్ల రిటైల్ ధర ₹ 66 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 87 కిలో | డ్రస్డ్ స్కిన్‌తో | 158 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 109 కిలో | స్కిన్‌లెస్ | 180 కిలో |

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది




# ఫస్ట్... ఫాస్ట్!



### ఫీజు నిధుల మంజూరులో కొత్త నిబంధన

- ముందుగా దరఖాస్తులు సమర్పించిన కాలేజీలకు ప్రాధాన్యం
- ఈ–పాస్ వెబ్‌సైట్‌లో రైడర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయం
- 2019–20 విద్యా సంవత్సరం నుంచి అమలుకు సంక్షేమ శాఖల చర్యలు.. ఈ నెలాఖరుతో ముగియనున్న ఫీజు, స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువు

**సాక్షి, హైదరాబాద్:** పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో ప్రభుత్వం ఫస్ట్ కమ్ ఫాస్ట్ అనే కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఇప్పటివరకు సీనియర్ విద్యార్థుల ఫీజులను ప్రాధాన్యత క్రమంలో విడుదల చేస్తున్నప్పటికీ అందుబాటులో ఉన్న నిధులు చాలకపోవడంతో కొన్ని కాలేజీలకు నిధుల విడుదలలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు నిధుల మంజూరు విధానంలో సంస్కరణలు చేపట్టింది. ఇకపై ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న విద్యార్థుల అర్జీలను పూర్తిగా పరిశీలించాక సంక్షేమ శాఖలకు ముందుగా సమర్పించే కాలేజీలకు తొలుత నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తికావడంతోపాటు కాలేజీల మధ్య పోటీ కోసం ఈ నిబంధన విధించింది. 2019–20 విద్యా సంవత్సరం నుంచి ఈ నిబంధనను అమలు చేయనుంది.

**వెబ్‌సైట్‌లో మార్పులు...**
ఫస్ట్ కమ్ ఫాస్ట్ విధానం కోసం ఈ–పాస్ వెబ్‌సైట్‌లో ప్రభుత్వం మార్పులు చేపట్టింది. గత వారం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) బృందంతో సంక్షేమ శాఖలు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశాయి. ఇందులో నిబంధనలను ప్రస్తావించిన అధికారులు... ఈ మేరకు వెసులుబాటు కల్పించాలని సీజీజీకి సూచించారు. ప్రస్తుతం ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తులన్నీ ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా నిర్వహిస్తున్నారు. విద్యార్థుల దరఖాస్తులను తొలుత కాలేజీలు పరిశీలించి ఆపై వాటిని సంక్షేమ శాఖకు ఆన్‌లైన్‌లో సమర్పించడంతోపాటు మాన్యువల్ దరఖాస్తులను సంక్షేమ శాఖకు పంపుతున్నాయి. అయితే ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తోందనే ఉద్దేశంతో దరఖాస్తుల పరిశీలనపై కాలేజీ యాజమాన్యాలు శ్రద్ధ చూపట్లేదు. ఈ నేపథ్యంలో కాలేజీల మధ్య పోటీ పెంచడంతోపాటు దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తి చేసేందుకు ఫస్ట్ కమ్ ఫాస్ట్ విధానాన్ని తీసుకొచ్చారు. విద్యార్థుల దరఖాస్తులను ఏ కాలేజీ ముందుగా పంపించిందనే విషయం ఈ–పాస్ వెబ్‌సైట్‌లో కనిపించేలా సీజీజీ రైడర్స్‌ను ఏర్పాటు చేసింది. దీంతో దరఖాస్తులు సమర్పించిన కాలేజీ సమయం క్షణాలతో సహా కనిపిస్తుంది. దీంతో ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే అధికారులు ఆయా కాలేజీలకు ప్రాధాన్యత క్రమంలో నిధులు విడుదల చేస్తారు. ముందుగా ఫైనల్ ఇయర్ విద్యార్థులు... ఆ తర్వాత సీనియారిటీ
మిగతా 2వ పేజీలో ▶

## క్లుప్తంగా...



### తేమ గాలులతో అధిక ఉష్ణోగ్రతలు

**సాధారణం కంటే ఎక్కువగా నమోదు**

**సాక్షి, హైదరాబాద్:** తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తేమ గాలులు వీస్తుండటంతో రాష్ట్రంలో అనేకచోట్ల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. ఉత్తర భారతం నుంచి చలి గాలులు ఇంకా మొదలు కాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గత 24 గంటల్లో రామగుండంలో సాధారణం కంటే 5.7 డిగ్రీలు ఎక్కువగా 20.4 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్‌లో సాధారణం కంటే 5.3 డిగ్రీలు ఎక్కువగా 19.4 డిగ్రీలు, హైదరాబాద్‌లో 4 డిగ్రీలు అధికంగా 19.2 డిగ్రీలు, మెదక్‌లోనూ 4 డిగ్రీలు అధికంగా 17.8 డిగ్రీలు, భద్రాచలంలో 3.1 డిగ్రీలు ఎక్కువగా 20.5 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలావుంటే ఖమ్మంలో పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే 3.1 డిగ్రీలు అధికంగా 31.6 డిగ్రీలు రికార్డయింది. ఆదిలాబాద్‌లో రాత్రి ఉష్ణోగ్రత 19.2 డిగ్రీలు కాగా, పగటి ఉష్ణోగ్రత 33.3 డిగ్రీలుగా నమోదైంది. కాగా, రానున్న మూడు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొని ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు వెల్లడించారు.

### 17 నుంచి సభాపతుల సదస్సు

**సాక్షి, హైదరాబాద్:** అఖిల భారత చట్ట సభల అధ్యక్షులు, సభాపతులు, ఉపాధ్యక్షులు, ఉప సభాపతులు, శాసన మండలి కార్యదర్శుల సదస్సు ఈ నెల 17 నుంచి 20 వరకు ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో జరగనుంది. ఈ సదస్సులో ముందుగా అన్ని రాష్ట్రాల చట్ట సభల కార్యదర్శులు సమావేశమై చట్ట సభల్లో అమర్యాదగా వాడే పదాల తొలగింపుపై ప్రస్తుత నిబంధనలను సమీక్షించడంతో పాటు చట్ట సభలను సామాన్య ప్రజానీకానికి దగ్గర చేయడానికి మార్గాలను అన్వేషించనున్నారని శాసన మండలి కార్యదర్శి వి.నర్సింహాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్–స్పీకర్ల పాత్ర అంశంతో పాటు చట్ట సభల ద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఈ నెల 18న జరగనున్న ప్రిసైడింగ్ అధికారుల సమావేశంలో చర్చించనున్నారు. 19న జరిగే సమావేశంలో దేశంలోని అన్ని రాష్ట్రాల చట్ట సభల్లో ఒకే విధమైన పార్లమెంటరీ నిబంధనలను రూపొందించడం, చట్ట సభలు తరచూ ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు అనే అంశంపై చర్చించనున్నారు.

### 'న్యాయశాఖ' జాతీయ అధ్యక్షుడిగా బి.లక్ష్మారెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** బిహార్‌లో జరిగిన ఆల్ ఇండియా న్యాయశాఖ ఉద్యోగ సంఘాల సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడిగా బి.లక్ష్మారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 29 రాష్ట్రాల సంఘాలు ఆ సమావేశానికి హాజరు కాగా, దేశంలోని 78 శాతం సంఘాలు లక్ష్మారెడ్డికి మద్దతు తెలిపాయి. రంగారెడ్డి జిల్లాలోని కుమ్మెర గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ న్యాయ శాఖ ఉద్యోగుల సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు. 2015 నుంచి జాతీయ న్యాయ శాఖ ఉద్యోగుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలోనూ పాల్గొన్నారు.

### 'టీవీజేఏ'కు కొత్త కార్యవర్గం

**హైదరాబాద్:** రాష్ట్ర వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ (టీవీజేఏ) నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా టీన్యూస్‌లో విధులు నిర్వహిస్తున్న పీ ప్రకాశ్ 261 ఓట్లను సాధించి సమీప అభ్యర్థి శ్రీనివాస్‌పై విజయం సాధించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సాక్షి టీవీలో పని చేస్తున్న వనం నాగరాజు 293 ఓట్లు సాధించి రెండోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రాజ్ న్యూస్‌లో విధులు నిర్వహిస్తున్న జనార్దన్‌రెడ్డి, కోశాధికారిగా 10టీవీలో పని చేస్తున్న భిక్షపతి, జాయింట్ సెక్రటరీగా హెచ్‌ఎంటీవీ కెమెరామెన్ రవికాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీడియో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందని అధ్యక్షుడు ప్రకాశ్ పేర్కొన్నారు.

## ఫస్ట్... ఫాస్ట్!

▶ మొదటి పేజీ తరువాయి

ఆధారంగా చెల్లింపులు చేస్తామని ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకులు పి.కరుణాకర్ 'సాక్షి'కి తెలిపారు.

**ఈ నెల 30 వరకు దరఖాస్తు గడువు..**

2019–20 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఈ నెల 30తో దరఖాస్తు గడువు ముగియనుంది. జనవరి నెలాఖరు వరకు పాత బకాయిల చెల్లింపుల్లో సంక్షేమ శాఖలు తలమునకలయ్యాయి. జనవరి 31 నాటికి 2013–14 నుంచి 2017–18 వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నీ పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు చర్యలు వేగవంతం చేశారు.

# మన అంకోర్‌వాట్ కూలుతోంది..





- క్రమక్రమంగా ధ్వంసమవుతున్న దేవునిగుట్ట ఆలయం
- దేశంలో ఏకైక కంబోడియా తరహా నిర్మాణం
- మూడేళ్ల క్రితమే వెలుగులోకి.. పునరుద్ధరణకు సిద్ధమైన ఏఎస్ఐ
- ఇప్పటివరకు ఎన్‌ఓసీ ఇవ్వని అధికారులు
- పట్టించుకోకపోతే కొద్ది రోజుల్లోనే కుప్పకూలే ప్రమాదం

**సాక్షి, హైదరాబాద్:** అంకోర్‌వాట్ (ఆంగ్‌కోర్‌వాట్)... ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న కంబోడియాలోని అద్భుత హిందూ దేవాలయం. 12వ శతాబ్దంలో నిర్మితమైన ఈ ఆలయాన్ని గతేడాది దాదాపు 26 లక్షల మంది పర్యాటకులు సందర్శించారు. యునెస్కో గుర్తింపు పొందిన ఈ కట్టడాన్ని పునరుద్ధరించటంలో కీలక పాత్ర భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ) దే. మన సాయంతోనే దాన్ని పునరుద్ధరించి ప్రపంచపటంలో ప్రధాన పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా నిలిపారు. అయితే మన దేశంలో అంకోర్‌వాట్ తరహా శైలిలో నిర్మించిన మందిరం ఒక్కటే ఉంది. ఇది చిన్న నిర్మాణమే అయినా, నిర్మాణశైలి మాత్రం అచ్చుగుద్దినట్టు అంకోర్‌వాట్‌దే. ఆ ఒక్క నిర్మాణం మన తెలంగాణలోనే ఉంది. విశేషమేంటంటే.. అంకోర్‌వాట్‌కు ఈ చిన్న నిర్మాణమే స్ఫూర్తి అన్నది చరిత్రకారుల మాట. ఎందుకంటే అంకోర్‌వాట్ కంటే దాదాపు 550 ఏళ్ల క్రితమే దీన్ని నిర్మించారని చెబుతారు. ఆ తరహా నమూనాలో నిర్మించిన దేశంలోనే ఏకైక ఈ చిన్న గుడిని పరిరక్షించటం ఇప్పుడు అదే ఏఎస్ఐకి సాధ్యం కావటం లేదు. ఎందుకంటే స్థానిక యంత్రాంగం ఎన్‌ఓసీ ఇవ్వకపోవటమే. కళ్ల ముందే ఆ అద్భుత నిర్మాణం కూలిపోతున్నా.. గుడ్లప్పగించి చూస్తున్న యంత్రాంగం దాని పరిరక్షణకు ముందుకు రావటం లేదు. స్వచ్ఛందంగా అడుగు ముందుకేసి పూర్తిస్థాయిలో పూర్వ రూపు కల్పిస్తామన్న ఏఎస్ఐకి సహకరించటం లేదు.

**ఇసుక రాళ్లే ఇటుకలుగా....**

చాలా తేలికగా ఉండే ఇసుక రాళ్లను పేర్చి దేవునిగుట్ట గుడిగా మలిచారు. ఆ రాళ్లపై మానవ, జంతు ఆకృతులను తీర్చిదిద్దారు. ఆ ఆకారాలను వరసగా పేరిస్తే పూర్తి రూపమొస్తుంది. అంటే.. ముందుగానే రాళ్లపై శిల్పంలోని భాగాలు చెక్కి పేర్చి పూర్తి ఆకృతినిచ్చారు. ఇది కంబోడియాలో ఉండే నిర్మాణాలశైలి. ఒక గర్భగుడి మాత్రమే నిర్మించారు. ముందు ఎలాంటి మండపాలు లేవు. గర్భాలయం లోపల నిలబడి చూస్తే శిఖరం చివర వరకు కనిపిస్తుంది. ఆలయం వెలుపల, లోపల రాళ్లపై చిత్రాలు కనిపిస్తాయి. దట్టమైన అడవిలో ఉండటం, బయటి ప్రపంచానికి తెలియకపోవటంతో ఇంతకాలం దాన్ని పట్టించుకోలేదు. ఫలితంగా రాళ్లు కదిలిపోయి ఆలయం కూలేదశకు చేరింది. దీన్ని గుర్తించిన తర్వాత మూడేళ్ల క్రితం ఏఎస్ఐ అధికారులు పరిశీలించారు. అది హెరిటేజ్ తెలంగాణ రక్షిత కట్టడం జాబితాలో లేకపోవటంతో పరిరక్షణకు సిద్ధమయ్యారు. వెంటనే స్థానిక గ్రామపంచాయతీ ప్రతినిధులను కలిసి లిఖితపూర్వకంగా విన్నవించారు. దీనికి స్పందించిన నాటి గ్రామ పంచాయతీ ఎన్‌ఓసీ ఇచ్చింది. వెంటనే నాటి భూపాలపల్లి (ప్రస్తుత ములుగు జిల్లా) కలెక్టర్‌కు ఎన్‌ఓసీ కోసం దరఖాస్తు చేసింది. అప్పట్నుంచి అది పెండింగులోనే ఉంది. తరచూ అధికారులు జిల్లా యంత్రాంగాన్ని వాకబు చేస్తున్నా ఫలితముండటం లేదు. ఇటీవలి భారీ వర్షాలకు ఆలయం రాళ్లు బాగా కదిలిపోయాయి. వచ్చే వానాకాలం నాటికి మొత్తం నేలమట్టమయ్యే ప్రమాదం నెలకొంది. ఇక్కడికి తరచూ విదేశీ నిపుణులు అధ్యయనంలో భాగంగా వచ్చి అబ్బురపడుతున్నారు. అంకోర్‌వాట్ తరహాలోనే నిర్మాణం ఉందని తేల్చి చెబుతున్నారు. కానీ దాన్ని పరిరక్షించాలన్న ఆలోచన మాత్రం మన యంత్రాంగానికి రావటం లేదు.

**ము**లుగు జిల్లా కేంద్రానికి కేవలం 20 కిలోమీటర్ల దూరంలో కొత్తూరు గ్రామ శివారులోని దట్టమైన అడవిలో దేవునిగుట్టపై కొలువుదీరింది ఈ ఆలయం. మూడేళ్ల క్రితమే దేవునిగుట్ట ఆలయం బయటి ప్రపంచానికి తెలిసింది. అప్పటివరకు స్థానికులే అక్కడ ఉత్సవాలు నిర్వహించుకునేవారు. దాన్ని ఎవరు నిర్మించారో ఇదమిత్థంగా ధ్రువీకరించేందుకు అక్కడ శాసనాలు లభించలేదు. దాని శైలి ఆధారంగా వాకాటకుల హయాంలో నిర్మితమైనట్టు చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. ఆరో శతాబ్దంలో వాకాట రాజు హరిసేన హయాంలో నిర్మించి ఉంటారని అంచనా. అప్పట్లో మహాయానబుద్ధిజం ప్రభావం ఎక్కువ. ఆలయం దక్షిణం వైపు అజంతాలో ఉండే బోధిసత్వ పద్మపాణి తరహాలో భారీ శిల్పం ఉంటుంది. కానీ అది మహాశివుడి రూపమైన దక్షిణామూర్తి విగ్రహమని, హరిసేన హయాంలోనే హిందూయిజం విస్తరించటం బాగా ఉండేదని కొందరి వాదన. ఆలయంలో ఎలాంటి విగ్రహాలు లేవు.

**ఆరో శతాబ్దంలో నిర్మాణం!**



# ఇక జస్టిస్ ధర్మాధికారిదే నిర్ణయం

▶ మొదటి పేజీ తరువాయి

జారీ చేశారు. రిలీవైన 1,157 మంది ఉద్యోగుల్లో 613 మంది ఏపీకి, 504 తెలంగాణకు ఆప్షన్లు ఇవ్వగా.. మిగిలినవారు ఏ రాష్ట్రానికీ ఆప్షన్లు ఇవ్వలేదు. ఇక ఏపీలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 256 మంది తెలంగాణకు ఆప్షన్లు ఇచ్చారు. ఏపీకి ఆప్షన్లు ఇచ్చిన 613 మందిని ఏపీ విద్యుత్ సంస్థలు తీసుకుంటే, తెలంగాణకు ఆప్షన్లు ఇచ్చిన 256 మందిలో సగం మందిని తీసుకుంటామని తెలంగాణ విద్యుత్ సంస్థలు ఆదివారం జరిగిన సమావేశంలో ఆఫర్ ఇచ్చాయి. దీనిని ఏపీ విద్యుత్ సంస్థలు తిరస్కరించాయి. దీంతో మధ్యవర్తిత్వపు ప్రక్రియను ముగిసిందని, విద్యుత్ ఉద్యోగుల విభజన వివాద పరి ష్కారం విషయంలో తుది నిర్ణయం తీసుకుని సుప్రీంకోర్టుకు నివేదిస్తానని పేర్కొంటూ జస్టిస్ ధర్మాధికారి సమావేశాన్ని ముగించారు. 2018 నవంబర్ 28న సుప్రీంకోర్టు ధర్మాధికారి కమిషన్‌ను ఏర్పాటు చేయగా, ఇప్పటివరకు 12 పర్యాయాలు 2 రాష్ట్రాల అధికారులతో సంప్రదింపులు జరిపింది.

**మెట్టు దిగినా..**

రిలీవైన 1,157 మందిలో తెలంగాణకు ఆప్షన్లు ఇచ్చిన 504 మందితోపాటు ఏపీ నుంచి తెలంగాణకు వచ్చేందుకు ఆప్షన్లు ఇచ్చిన 256లో సగం మంది(128)ని తీసుకోవడానికి తెలంగాణ విద్యుత్ సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలంగాణ విద్యుత్ జేఏసీ నేతలు శివాజీ, అంజయ్యలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి తోడు నాలుగేళ్ల కింద ఏపీ నుంచి 242 మంది తెలంగాణ స్థానికత గల ఉద్యోగులను తెలంగాణ విద్యుత్ సంస్థలు చేర్చుకున్నాయన్నారు. దీంతో మొత్తం 874 మంది ఉద్యోగులను తీసుకునేందుకు తెలంగాణ సంసిద్ధత వ్యక్తం చేయగా, 613 మందిని తీసుకోవడానికి ఏపీ అంగీకరించలేదని ఆరోపించారు. ఈ వివాదం కారణంగా రాష్ట్రంలో ఉద్యోగుల పదోన్నతులు నిలిచిపోవడం, విద్యుత్ సంస్థలపై అనవసర ఆర్థిక భారం పడుతోందని తెలంగాణ విద్యుత్ సంస్థలు ఒక మెట్టు కిందికి దిగినా, ఏపీ విద్యుత్ సంస్థలు మొండికేశాయని విమర్శించారు.

# ఫ్యామిలీ ఫార్మర్!

▶ మొదటి పేజీ తరువాయి

సేంద్రియ ఆహారపదార్థాలను అందజేస్తారు. తన కున్న 17 దేశవాళీ ఆవు పాలు రోజుకు 100 లీటర్ల వరకు ఇస్తాయి. వాటిని అబ్బాయిల ద్వారా విక్రయిస్తారు. టమాట, మిర్చి, వంకాయ, గోరుచిక్కుడు, కొత్తిమీర పండించి వినియోగదారులకు పంపిస్తాడు. 11 ఎకరాల్లో అతను సాగు చేసి వినియోగదారులకు ఇలా పంపుతున్నాడు. నియమించుకున్న ఒక్కో అబ్బాయికి నెలకు రూ.6 వేలు ఇస్తున్నాడు.

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి మరీ..**

వనపర్తి జిల్లా పెబ్బేరుకు చెందిన ప్రవీణ్‌రెడ్డి బెంగళూరు, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశాడు. ఉద్యోగంలో సంతృప్తి చెందలేదు. తన కున్న 18 ఎకరాల్లో సేంద్రియ సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు. వరి, కంది, పెసర, వేరుశనగ తదితర ఆహార పంటలతో పాటు సోర, కాకర, బీర వంటి కూరగాయలను సాగు చేస్తున్నాడు. హైదరాబాద్‌లో 20 ఇళ్లకు నేరుగా బియ్యం, కూరగాయలు సరఫరా చేస్తున్నాడు. కొందరేమో ప్రవీణ్ ఇంటికి వచ్చి కొనుగోలు చేస్తారు. హైదరాబాద్‌లో ఒక దుకాణానికి వేరుశనగ, ఉలవలు పండించి పంపుతారు. మామిడి పండ్లను కూడా సాధారణ పద్ధతిలో మాగబెట్టి అపార్ట్‌మెంట్లకు పంపుతున్నట్లు చెబుతున్నారు.

**రమణారెడ్డి ఇంటికి ప్రజాప్రతినిధులు, ఐఏఎస్‌లు...**

నాగర్‌కర్నూలు జిల్లా తెలకపల్లి మండలం కారువంగ గ్రామానికి చెందిన రమణారెడ్డి 30 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తాడు. తాను పండించే పంటల్లో 80 శాతం ఇంటి నుంచే అమ్ముతాడు. సేంద్రియ పద్ధతిలో పండించిన వరి నుంచి పాలీష్ బియ్యం, దంపుడు బియ్యం, తక్కువ దంపుడు బియ్యం మిల్లులో పట్టిస్తాడు. అలాగే మిర్చి, కంది, పెసర, మినుములు, శనగ, జొన్న, వేరుశనగ, ఆవాలు, ధనియాలు పండిస్తాడు. అన్నీ సేంద్రియ పద్ధతిలో పండించడం వల్ల తన ఇంటికి హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, కర్ణాటక నుంచి జనం క్యూలు కడతారని చెబుతున్నాడు. ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు, కొందరు ఐఏఎస్‌లు



కూడా తన ఇంటికొచ్చి తన పంటలు కొంటారని పేర్కొంటున్నాడు. హైదరాబాద్‌లోని ఒక దుకాణానికి కూడా తాను పండించేవి పంపు తున్నారు. తన వద్ద కొందరు కేన్సర్ రోగులు కూడా వచ్చి కొనుగోలు చేస్తున్నారని ఆయనంటున్నారు. సాధారణ పద్ధతిలో పండించే వాటికి, తాను సేంద్రియ పద్ధతిలో పండించే వాటికి ధరలో కొద్ది తేడానే ఉంటుందని చెబుతున్నాడు. తాను పండించే ఆహార పదార్థాలతో ఆరోగ్యం ఎంతో బాగుంటుందని వినియోగదారులు చెబుతున్నారని రమణారెడ్డి అన్నాడు.

**నాలుగెకరాల్లో పండిస్తున్న రజిత..**

యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామానికి చెందిన రజిత కూడా సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తున్నారు. వరి, టమాట, వంకాయ, మిర్చి, బీరకాయ, గోరు చిక్కుడు, కాకరకాయ వంటివి సీజనల్‌గా పండిస్తున్నారు. తాను పండించే వీటిని ఓ ప్రముఖ సంస్థకు సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు. సమీపంలో ఉన్న ఓ హోటల్‌కు కూడా సరఫరా చేస్తున్నారు. ఆ హోటల్ కూడా సేంద్రియ ఆహార పదార్థాలతో పండించే 'విలేజ్ ఆహారం'పేరుతో ప్రజలకు పెడుతుండటం గమనార్హం.

# 'భగాయత్' బూమ్ బూమ్!

- ఉప్పల్ భగాయత్ ప్లాట్ల వేలంలో మరో రికార్డు
- ఏకంగా రూ.79,900 పలికిన గజం
- రెండోరోజు 41 ప్లాట్ల ద్వారా రూ.135.21 కోట్ల ఆదాయం

**సాక్షి, హైదరాబాద్:** ఉప్పల్ భగాయత్ భూములు రియల్ బూమ్‌ను తలపిస్తున్నాయి. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) అభివృద్ధి చేసిన ఈ లేఅవుట్‌లోని ఓ ప్లాట్ ఆదివారం రికార్డు స్థాయిలో ధర పలికింది. 525 గజాలున్న ఓ ప్లాట్‌ను గజానికి ఏకంగా రూ.79,900 చెల్లించి ఓ బిడ్డర్ దక్కించుకున్నారు. తొలిరోజు శనివారం జరిగిన ఆన్‌లైన్ వేలంలో 166 గజాలున్న ఓ ప్లాట్ గజం ధర రూ.77,000 పలికితే.. రెండో రోజైన ఆదివారం దాన్ని అధిగమించి గజం రూ.2,900 అధికంగా అమ్ముడుపోయింది. భూముల అమ్మకాల ద్వారా హెచ్‌ఎండీఏకు 2 రోజుల్లోనే రూ.290.21 కోట్ల ఆదాయం వచ్చింది. హెచ్‌ఎండీఏ కేంద్ర కార్యాలయంలో కార్యదర్శి రామకిషన్, ఇంజనీరింగ్ విభాగాధిపతి బీఎల్ఎన్ రెడ్డి, ప్లానింగ్ డైరెక్టర్ నరేంద్ర, ఎస్టేట్ ఆఫీసర్ గంగాధర్, సీఏవో శరత్‌చంద్ర తదితరులు ఆదివారం జరిగిన ఆన్‌లైన్ వేలాన్ని పర్యవేక్షించారు.

**రెండోరోజూ.. అదే జోరు..**

తొలిరోజు వేలంలో 52 ప్లాట్లకు రూ.155 కోట్ల ఆదాయం రాగా.. రెండోరోజు 41 ప్లాట్ల ద్వారా రూ.135.21 కోట్ల ఆదాయం సమకూరింది. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు సాగిన తొలి సెషన్‌లో 23 ప్లాట్లకు బిడ్డర్లు పోటీపడ్డారు. రెండు రోడ్లు ఉన్న ప్లాట్ నంబర్ 127 (525 గజాలు) అత్యధికంగా గజానికి రూ.79,900 పలికితే.. అత్యల్పంగా ఓ ప్లాట్‌ను గజం రూ.43,800కు బిడ్డర్ దక్కించుకున్నారు. ఈ సెషన్‌లో మొత్తంగా రూ.51.34 కోట్ల ఆదాయం వచ్చింది. మధ్యాహ్నం నుంచి రాత్రి 10 వరకు జరిగిన రెండో సెషన్‌లో 22 ప్లాట్లకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో 3 ప్లాట్లకు సింగిల్ బిడ్ దాఖలు కాగా.. ఒక ప్లాట్‌కు బిడ్ దాఖలు కాలేదు. దీంతో ఈ నాలుగింటిని మినహాయించి మిగిలిన 18 ప్లాట్లకు గాను రూ.83.87 కోట్ల ఆదాయం సమకూరింది. రెండో సెషన్‌లో అత్యధికంగా గజం ధర రూ.64,000 పలకగా.. అత్యల్పంగా రూ.30,200 ధర పలికింది. కాగా, ఈ ఏడాది ఏప్రిల్ 7, 8 తేదీల్లో జరిగిన ఉప్పల్ భగాయత్ ఫేజ్–1 ఆన్‌లైన్ వేలంలో గజం ధర అత్యధికంగా రూ.73,900 పలికితే, ఈసారి ఆ ధరను మించిపోయింది. హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేసిన ప్లాట్లు కావడంతోనే జనాలు బాగా ఆదరిస్తున్నారని, ఈ లేఅవుట్‌లో ప్లాట్లు తీసుకుంటే వివాదాలు లేకుండా ప్రశాంతంగా ఉండొచ్చనే భావనతో అధిక ధరలు నమోదయ్యాయని హెచ్‌ఎండీఏ అధికారుల అంచనా.

# సాఫీగా.. రద్దీగా..

▶ మొదటి పేజీ తరువాయి

గడువు పొడిగించి ఆదివారం నుంచి ప్రారంభించారు. కానీ, గత రెండు నెలలుగా ఎన్‌హెచ్‌ఏఐ ఈ ట్యాగ్‌ల విషయమై ముమ్మరంగా ప్రచారం చేసినా, ఎక్కువ మంది పట్టించుకోలేదు. అలా ట్యాగ్ లేకుండా జాతీయ రహదారులెక్కిన వాహనదారులకు టోల్‌ప్లాజాలు చుక్కలు చూపించాయి.

**ఫాస్టాగ్ అంటే..**

ఫాస్టాగ్ విధానంలో వాహనం టోల్‌గేటు వద్ద బారులు తీరే అవసరం ఉండదు. కీలకమైన 'ఫాస్టాగ్'పేరుతో ఉండే ట్యాగ్‌లను వాహనాల ముందు అద్దానికి అతికించుకోవాలి. టోల్‌గేట్‌పై ఉండే సెన్సార్లు.. గేటు ముందుకు రాగానే ట్యాగ్‌లోని చిప్ నుంచి కావాల్సిన టోల్ రుసుమును మినహాయించుకుంటాయి. ఆ వెంటనే గేట్ తెరుచుకుంటుంది. ఒక్కో వాహనం నుంచి టోల్ రుసుము మినహాయించుకునేందుకు 6 సెకన్ల సమయం మాత్రమే పడుతుంది. దీంతో వాహనదారుల సమయం ఆదా అవుతుంది.

**మాల్స్‌లో విక్రయం..!**

ప్రస్తుతం బ్యాంకులు, టోల్‌ప్లాజాలు, ఆర్టీసీ కార్యాలయాలు, ఆన్‌లైన్‌లో ఫాస్టాగ్ పొందే వెసులుబాటు ఉంది. ఆదివారం రద్దీ నేపథ్యంలో వాహనదారులు వాటిని కొనేందుకు పోటీపడే అవకాశం ఉందని గుర్తించిన అధికారులు.. ఇక పెద్దపెద్ద షాపింగ్ మాల్స్‌లో కూడా వాటి విక్రయ కేంద్రాలు తెరవాలని భావిస్తున్నారు. కాగా, రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల వద్ద ఫాస్టాగ్ విధానాన్ని జనవరి ఒకటి నుంచి అమల్లోకి తేనున్నారు. హైదరాబాద్–రామగుండం రాజీవ్ రహదారిపై మూడు చోట్ల, అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి ఒక చోట టోల్ ప్లాజాలున్నాయి. ఈ నాలుగు గేట్ల వద్ద జనవరి ఒకటి నుంచి ఫాస్టాగ్ విధానం అమల్లోకి రానుంది.



భువనగిరి జిల్లా గూడూరు టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

**పండుగ సమయాల్లోలా రద్దీ..**

పండుగల సమయంలో టోల్‌ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయినట్లు ఆదివారం కూడా భారీ రద్దీ ఏర్పడింది. తొలుత ఫాస్టాగ్ లేని వాహనాల కోసం ఒకే లైన్ కేటాయించాలని భావించినా.. ఆ తర్వాత 25 శాతం గేట్లు కేటాయించారు. మూడొంతుల గేట్లు ఫాస్టాగ్ వాహనాలకే వదిలారు. ఇదే సమస్యకు కారణమైంది. ఎక్కువ వహనాలకు ట్యాగ్ లేకపోవటం, వాటికి తక్కువ లైన్లు కేటాయించడంతో క్యూ కట్టాల్సి వచ్చింది.

**రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి..**

హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలతో పాటు హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారిలో బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఉదయం నుంచే వాహనాల రద్దీ నెలకొంది. రహదారులకు ఇరువైపులా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. టోల్ దాటేందుకు ఒక్కో వాహనదారుడు గంటకు పైగా నిరీక్షించాల్సి వచ్చింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద రెండు వైపులా కలిపి 16 లైన్లు ఉంటే, ఐదేసి చొప్పున లైన్లు ఫాస్టాగ్ కోసం, మిగతా మూడు చొప్పున ఆరు లైన్లను సాధారణ వాహనాలకు కేటాయించారు. గూడూరు టోల్‌ప్లాజా వద్ద 12 (రెండు వైపులా కలిపి) లైన్లకు గాను ఫాస్టాగ్ కోసం 8, సాధారణ వాహనాలకు 4 కేటాయించారు. మహబూబ్‌నగర్ జాతీయ రహదారిపై శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద వందల సంఖ్యలో వాహనాలు బార్లు తీరాయి.

**రెట్టింపు రుసుము..**

టోల్‌ప్లాజాకు కిలోమీటరు దూరంలో ప్రత్యేక సిబ్బందిని నియమించి ఫాస్టాగ్ ఉన్న వాహనాలను సంబంధిత లైన్లలోకి వెళ్లేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కానీ కొన్ని సాధారణ వాహనాలు కూడా అయోమయంలో ఫాస్టాగ్ లైన్లలోకి ప్రవేశించాయి. ట్యాగ్ లేకుండా ఆ వరుసలోకి వస్తే రెట్టింపు రుసుము చెల్లించాలనే నిబంధనతో పలువురు వాహనదారులు పెనాల్టీ చెల్లించాల్సి వచ్చింది.

**అప్పటికప్పుడే కొనుగోలు..**

ఫాస్టాగ్ లేని వాహనాలు టోల్ వద్ద క్యూలలో నిరీక్షించాల్సిన పరిస్థితి వస్తుందంటూ ఎన్‌హెచ్‌ఏఐ కొద్ది రోజులుగా చేస్తున్న ప్రచారాన్ని చాలామంది పట్టించుకోలేదు. దీని ప్రభావం ఆదివారం స్పష్టంగా కనిపించింది. ఇన్ని రోజులు ఫాస్టాగ్ తీసుకోని వారు వాహనాల లైన్లు చూసి అప్పటికప్పుడు ట్యాగ్‌లు కొనడం కన్పించింది. అన్ని టోల్ ప్లాజాల వద్ద ఆదివారం అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసి మరీ అధికారులు వాటిని విక్రయించారు. సాధారణ రోజుల్లో సగటున రోజుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల ట్యాగ్‌లు అమ్ముడవుతుండగా ఆ సంఖ్య ఆదివారం రెట్టింపైంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో మొత్తం 60 వేల ట్యాగ్‌లు విక్రయమైనట్లు ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయాధికారి కృష్ణప్రసాద్ వెల్లడించారు. నెలరోజుల తర్వాత సాధారణ వాహనాల వరసలను తగ్గిస్తామని స్పష్టం చేశారు.

### వెంకయ్య నాయుడి వ్యాఖ్యలు ఆక్షేపణీయం

**టీపీసీసీ అధికార ప్రతినిధి నిరంజన్**



**సాక్షి, హైదరాబాద్:** స్వతంత్ర భారత్‌కు కాంగ్రెస్ పార్టీ అక్కర్లేదని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించడం ఆక్షేపణీయమని టీపీసీసీ అధికార ప్రతినిధి నిరంజన్ పేర్కొన్నారు. రాజ్యాంగ పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు, ఉల్లేఖనలు సరికావని ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మండిపడ్డారు. గుజరాత్ నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు క్యాంపస్‌లో గ్రామీణ నిర్వహణ సంస్థ 40వ వ్యవస్థాపక దినోత్సవ సమావేశంలో మాట్లాడిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు.. 1947లోనే కాంగ్రెస్ పార్టీని రద్దు చేయాలని మహాత్మా గాంధీ సూచించారని పేర్కొంటూ స్వతంత్ర భారత్‌కు కాంగ్రెస్‌తో ఇక పని లేదనే భావాన్ని వ్యక్తపరచడంతో ఆ పదవి ఔన్నత్యాన్ని దిగజార్చారని తీవ్రంగా మండిపడ్డారు. ఉపరాష్ట్రపతిగా ఉంటూ కూడా భాజపా నాయకుడిలానే ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పట్ల వెటకారంతో, అసహనంతో వ్యాఖ్యలు చేయడం సరికాదని నిరంజన్ అభిప్రాయపడ్డారు.

### విద్యా వలంటీర్ల సంఘం కొత్త కార్యవర్గం ఏర్పాటు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర విద్యా వలంటీర్ల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా జోగినాథ్ యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా కవిత, ప్రధాన కార్యదర్శిగా సత్యేందర్ తదితరులతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.


యాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, దయాకర్‌రావు

# అతిరుద్ర యాగం ప్రారంభం

**హాజరైన మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, దయాకర్‌రావు**

**హన్మకొండ కల్చరల్:** వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి గ్రౌండ్స్‌లో ఆదివారం ఉదయం శతచండీ అతిరుద్ర, సుదర్శన లక్ష్మీనరసింహ యాగం వైభవంగా ప్రారంభమయింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, యాగ నిర్వాహకులు తాటిపల్లి శ్రీనివాస్‌గుప్తా–రోజారాణి దంపతులు, వేయిస్తంభాల దేవాలయం ప్రధానార్చకుడు, యాగ పర్యవేక్షకుడు గంగు ఉపేంద్రశర్మ పాల్గొన్నారు. శృంగేరి వేదపండితులు ఇంజి నర్సింహశర్మ, వ్యాసోజుల గోపీకృష్ణశర్మతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 250 మంది వేద పండితులు యాగం నిర్వహించారు.

**సమ్మక్క జాతరకు జాతీయహోదా..**

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ సమ్మక్క–సారలమ్మ జాతరకు జాతీయ స్థాయి హోదా రావడానికి రాష్ట్ర ఎంపీలు ఇప్పటికే కేంద్రానికి నివేదించారని అన్నారు. ఇక గుర్తింపు బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని చెప్పారు. యాగాన్ని నిర్వహించిన శ్రీనివాస్‌ను అభినందించారు.

# ఏడాదిలో...2లక్షల ఎకరాలకు నీరు

- కాళేశ్వరంలోని ప్యాకేజీ–21 పనుల పూర్తికి ప్రభుత్వం నిర్ణయం
- నేడు ప్రాజెక్టు పరిధిలో పర్యటించనున్న సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్

సాక్షి, హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించి చేపట్టిన ప్యాకేజీ–21లోని పైప్‌లైన్ వ్యవస్థ నిర్మాణ పనుల వేగిరంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రాజెక్టులోని కీలకమైన పనులన్నీ ముగింపు దశకు వస్తుండటం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నీటి లభ్యత పెంచిన నేపథ్యంలో ఈ పైప్‌లైన్ పనులను వేగిరం చేసి ఏడాదిలో పూర్తి చేయాలనే సంకల్పంతో ఉంది. ఇలా కనీసంగా 2లక్షల ఎకరాల మేర సాగునీరు వృద్ధిలోకి వచ్చే అవకాశాలు ఉన్న నేపథ్యంలో పనులను సత్వరమే పూర్తి చేసే లక్ష్యంగా ఇంజనీర్లకు మార్గదర్శనం చేసేందుకు సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్ సోమవారం ప్యాకేజీ–21 పరిధిలో పర్యటించనున్నారు.

**భూసేకరణతో పనిలేకుండా..**
**భూగర్భంలో పైపులైన్లు**

ఎస్సారెస్పీ ప్రాజెక్టు ఫోర్‌షోర్ నుంచి నీటిని తీసుకుంటూ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలతో పాటు కోరుట్ల ప్రాంతాలకు నీరిచ్చేలా కాళేశ్వరంలో ప్యాకేజీ–20, 21, 21(ఎ) పనులు చేపట్టారు. ప్యాకేజీ–20లో ఎస్సారెస్పీ ఫోర్ షోర్ నుంచి అప్రోచ్ చానల్, 17.81 కిలోమీటర్ల టన్నెల్, 30మెగావాట్ల సామర్థ్యంతో ఉన్న 3 మోటార్లతో పంప్‌హౌస్ నిర్మాణ పనులు చేయాల్సి ఉంది. రూ.892కోట్లతో చేపట్టిన ఈ పనులు 80శాతం వరకు పూర్తయ్యాయి. ఇక్కడి నుంచి మాసాని చెరువులోకి నీటిని ఎత్తిపోసి అక్కడి నుంచి రెండు పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోసి, పైప్‌లైన్ వ్యవస్థద్వారా 2లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేలా పనులు చేపట్టారు. సాధారణంగా కాల్వల నిర్మాణం చేపడితే భూసేకరణ 7వేల నుంచి 8వేల ఎకరాలు చేయాల్సి ఉంటుంది. అదే పైప్‌లైన్ వ్యవస్థ అయితే భూమిలో ఒకటిన్నర మీటర్ల కింద భూగర్భాన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తారు. తద్వారా పైన యథావిధిగా వ్యవసాయం చేసుకోవచ్చు. భూసేకరణ తప్పుతుంది. ఇక కాల్వల ద్వారా నీటి వృథా దాదాపు 30శాతం వరకు ఉండగా... పైప్‌లైన్‌తో వృథా అతి తక్కువ. దీంతో పాటు పైప్‌లైన్‌తో చివరి ఆయకట్టు వరకు నీటిని అందించవచ్చు. నిర్ణీత ఆయకట్టులో రెండో పంటకు సైతం నీరు అందించవచ్చనే అంచనాతో ఈ పనులు చేపట్టారు. ఇందులో ప్యాకేజీ–21 పనులను రూ.610 కోట్లతో చేపట్టగా, 30శాతం పూర్తయింది. టన్నెళ్ల నిర్మాణం, కాల్వల పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇక ప్యాకేజీ–21(ఎ) కీలకం కాగా దీన్ని రూ.2,623కోట్లతో చేపట్టారు. ఇందులో 3.5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌నిర్మించాల్సి ఉంది. ఈ పనులు ఇప్పుడిప్పుడే పుంజుకున్నాయి. భూసేకరణ సమస్య తీవ్రంగా ఉండటంతో కొంత ఆటంకం ఎదురౌతోంది. ఇక రెండు పంప్‌హౌస్‌ల నిర్మాణం చేసి, 10 నుంచి 8మెగావాట్ల సామర్థ్యం గల మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు వేగంగా చేయాల్సి ఉండగా, ఇక భూగర్భ పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయి. మొత్తంగా 90కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పూర్తి చేయాల్సి ఉండగా, ఇందులో కొంత పని పూర్తయింది. ఈ పనులన్నింటినీ వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టింది. చిన్నచిన్న అవాంతరాలు, భూసేకరణ సమస్యలు ఉండటంతో వాటిని పరిష్కరించేందుకు స్మితా సబర్వాల్ సోమవారం ప్రాజెక్టు పరిధిలో పర్యటించనున్నారు.

## కన్నెపల్లిలో స్పైరల్ కేసింగ్ పనులు ముమ్మరం

**కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి కన్నెపల్లి పంప్‌హౌస్‌లో సీఎం కేసీఆర్ ఆదేశాలతో నీటిలభ్యతను బట్టి మరో టీఎంసీని అదనంగా ఎత్తిపోయడానికి సరిపడా మోటార్లు బిగించడానికి ముమ్మరంగా పనులు సాగుతున్నాయి. పనులు త్వరగా పూర్తి చేయడానికి ఇంజనీర్లు రాత్రి పగలు కృషి చేస్తున్నారు. ఇప్పటికే రోజుకు రెండు టీఎంసీల నీటిని తరలించడానికి కన్నెపల్లి పంపుహౌస్‌లో 11 మోటార్లు బిగించి వెట్, డ్రై రన్‌లు పూర్తి చేశారు. ప్రస్తుతం నీటి తరలింపు ప్రక్రియ కొనసాగుతోంది.


అదనపు టీఎంసీ కోసం మోటార్లు బిగించడానికి జరుగుతున్న పనులు

మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజీలో 85 గేట్లు మూసివేసి బ్యాక్‌వాటర్‌ను అక్కడి మోటార్లతో ఎత్తిపోస్తూ గ్రావిటీ కాల్వద్వారా అన్నారంలోని సరస్వతీ బ్యారేజీని నింపుతున్నారు. కాగా, మరో టీఎంసీని తరలించడానికి అదనంగా ఆరు మోటార్లు బిగించడానికి పనులు సాగుతున్నాయి. ఇందులో స్పైరల్ కేసింగ్ పనులు మూడు మోటార్లకు పూర్తికాగా, మరో మూడు మోటార్ల పనులు జరుగుతున్నాయి. మొత్తం ఆరు మోటార్లకు 12 కిలోమీటర్ల వరకు పైపులైన్ నిర్మించాల్సి ఉండగా.. 9 కిలోమీటర్ల మేర పైపులైన్ పూర్తయింది. కాగా, అదనపు టీఎంసీ తరలింపునకు ఆస్ట్రియా, ఫిన్‌లాండ్ దేశాల నుంచి ఆరు మోటార్లను తీసుకు వస్తున్నారు.

# చెరువుల్లో 265 టీఎంసీల నీళ్లు

- మిషన్ కాకతీయ ద్వారా 46 వేల చెరువులను అభివృద్ధి చేశాం
- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు
- పిట్టవాలిన చెట్టు పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి


పిట్టవాలిన చెట్టు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు తదితరులు

**తుంగతుర్తి:** మిషన్ కాకతీయ పథకం కింద రాష్ట్రంలో 46 వేల చెరువులు అభివృద్ధి చెందాయని, వీటి ద్వారా 265 టీఎంసీల నీళ్లను ఒడిసి పట్టామని ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామంలో సీనియర్ జర్నలిస్టు, రచయిత వర్ధెల్లి వెంకటేశ్వర్లు రచించిన 'పిట్టవాలిన చెట్టు' పుస్తకాన్ని ఆదివారం విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి, దుబ్బాక ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, సోలిపేట రామలింగారెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికతో కలిసి ఆవిష్కరించారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులకు పిట్టవాలిన చెట్టు పుస్తకం అద్దం పడుతుందన్నారు. మిషన్ కాకతీయ ద్వారా జరిగిన అభివృద్ధి, గత, ప్రస్తుత పరిస్థితులను ఈ పుస్తకంలో కళ్లకు కట్టినట్లు వివరించారని కొనియాడారు. చెరువుల అభివృద్ధి పూర్తయిందని, ప్రస్తుతం చిట్టచివరి ఎకరాకు నీళ్లందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వం వ్యవసాయం దండగంటే సీఎం కేసీఆర్ పండుగలా చేసి చూపించారని పేర్కొన్నారు.

**కరువనేదే ఉండదు..**

రాష్ట్రంలో రాబోయే రోజుల్లో ఇక కరువనేదే ఉండదని హరీశ్‌రావు పేర్కొన్నారు. పాలమూరు జిల్లాలో బతుకుదెరువు కోసం వలసలు వెళ్లిన ప్రజలు నేడు తిరిగి సొంతూళ్లకు వచ్చారని తెలిపారు. సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ పథకాన్ని రాష్ట్రంలో మొదట ప్రవేశపెట్టి తాంబాలంలా ఉన్న చెరువులను పూడికతీతతో గంగాళంలా మార్చారని కొనియాడారు. టీఆర్‌ఎస్ సర్కార్‌తో పల్లె జీవితంలో ఎంతో మార్పు వచ్చిందన్నారు.

**కేసీఆర్ సీఎం కాకుంటే..**
**కాళేశ్వరం జలాలు వచ్చేవికావు: జగదీశ్‌రెడ్డి**


కేసీఆర్ సీఎం కాకపోతే మరో వెయ్యి జన్మలెత్తినా కాళేశ్వరం జలాలు వచ్చేవి కావని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ ఇంజనీర్ అవతారమెత్తి భగీరథుడిగా మారారని పేర్కొన్నారు. ఇంజనీర్లకు అర్థంకాని రీతిలో ప్రాజెక్టులు నిర్మాణం జరిపించి ప్రతి ఎకరాకు నీళ్లు అందేలా చేశారన్నారు. చెరువుల పునరుద్ధరణపై కళ్లకు కట్టినట్లు పిట్టవాలిన చెట్టు పుస్తకంలో రాసిన రచయిత వర్ధెల్లి వెంకటేశ్వర్లును అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు గోరెటి వెంకన్న, తెంజు రాష్ట్ర అధ్యక్షుడు ఇస్మాయిల్, పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోజ, జేసీ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

## కేసీఆర్ సారూ..
# మమ్మల్ని ఆదుకోండి

- సౌదీలో చిక్కుకున్న జగిత్యాలకు చెందిన ఏడుగురు యువకులు
- యజమాని చేతిలో చిత్రహింసలు
- ఆదుకోవాలని విన్నపం

జగిత్యాలక్రైం

'నమస్తే కేసీఆర్ సారూ.. కేటీఆర్ సారూ..! మేము సౌదీలో చిత్రహింసలకు గురవుతున్నాం. మా కంపెనీ యజమాని రోజూ రాత్రి వచ్చి కొడుతుండు. చంపుతానని బెదిరిస్తుండు. ఈ చిత్రహింసలు భరించలేకపోతున్నం. ఈరోజు రాత్రే ఇక్కడి నుంచి బయటకు వెళ్లిపోవాలనుకుంటున్నం. మీరే మాయందు దయతలచి ఇండియాకు వచ్చేలా చూడుండ్రి సారూ..' అంటూ జగిత్యాల జిల్లాకు చెందిన ఏడుగురు యువకులు సోషల్ మీడియాలో ఆదివారం ఓ వీడియోను పోస్టు చేశారు. ఈ వీడియో వైరల్ అవడంతో బాధిత కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. రెండేళ్ల క్రితం వీరు సౌదీ అరేబియాకు ఉపాధి కోసం వెళ్లారు. అంబారీపేటకు చెందిన గోనెల వెంకట్‌రెడ్డి, ఆదె మహేశ్, ఆనగండ నడిపి అంజన్న, అంతర్గాంకు చెందిన భూపెల్లి రంజిత్, లక్ష్మీపూర్‌కు చెందిన నక్క వేణు, జిల్లాకు చెందిన మరో ఇద్దరు యువకులు అక్కడ చిక్కుకున్నారు. కంపెనీ యజమాని చేతిలో చిత్రహింసలు పడుతున్నామని రోదిస్తూ తెలిపారు. తమను ఎలాగైనా ఆదుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను కోరారు. కొద్దికాలంగా కంపెనీ యజమాని మధ్యాహ్నం వేళ పనిచేయించుకొని, రాత్రి వచ్చి కొడుతున్నాడని తెలిపారు. పోలీసులను తీసుకొచ్చి బలవంతంగా సంతకాలు చేయించుకున్నాడని, అనారోగ్యానికి గురైనా ఆస్పత్రులకు వెళ్లనీయడం లేదని పేర్కొన్నారు. ఇక చిత్రహింసలు భరించలేకపోతున్నామని.. కంపెనీ నుంచి బయటకు పారిపోతున్నామని తెలిపారు. తమను సొంతూర్లకు చేర్చేలా చూడాలని విన్నవించారు.


వీడియోలో వేడుకుంటున్న యువకులు

## క్లుప్తంగా...

### రాష్ట్రంలో కాంగ్రెస్ స్క్రాప్‌లా తయారైంది

**నిజామాబాద్ ఎంపీ అర్వింద్**



**సుభాష్‌నగర్ (నిజామాబాద్‌అర్బన్):** రాష్ట్రంలో, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ స్క్రాప్‌లా తయారైందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ విమర్శించారు. భరతమాతను మూడు ముక్కలు చేసి పాపాన్ని ఆ పార్టీ మూటగట్టుకుందని ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, పసుపు పంటకు మద్దతు ధర కల్పించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాల్సిందిగా సీఎం కేసీఆర్‌కు లేఖ రాస్తానని చెప్పారు. ఏపీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పసుపు రైతులకు మద్దతు ధర ప్రకటించి పుణ్యం కట్టుకున్నారని అభినందించారు. పౌరసత్వ బిల్లుతో దేశంలోని మైనారిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా ఓటేసి టీఆర్‌ఎస్, కాంగ్రెస్ చిల్లర రాజకీయాలకు పాల్పడ్డాయని ఆరోపించారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ వంటి దేశాల్లో మైనారిటీలైన హిందువులు ఊచకోతకు గురవుతున్నారని, శరణార్థులుగా మారిన వారి కోసం ఈ చట్టాన్ని తెచ్చామని చెప్పారు.

### గుండెపోటుతో విద్యార్థి మృతి

**రేగోడ్ (మెదక్)/సంగారెడ్డి మున్సిపాలిటీ:** పోలీసు ఉద్యోగంలో చేరాలనుకున్న ఓ గిరిజన విద్యార్థి గుండెపోటుతో దుర్మరణం పాలైన ఘటన సంగారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా రేగోడ్ మండలం పెద్దతండాకు చెందిన రంజానాయక్, చాందీబాయి దంపతుల రెండో కుమారుడు మహిపాల్ (20) సంగారెడ్డిలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుకుంటూ కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగం రెండు మార్కులతో చేజారిపోయింది. ఇదిలా ఉంటే ఎప్పటిలాగే ఆదివారం ఉదయం సంగారెడ్డిలో రన్నింగ్ చేస్తుండగా గుండెపోటు వచ్చింది. 108 అంబులెన్స్ వచ్చేసరికే మహిపాల్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కుమారుడి మరణ వార్త వినగానే కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

### ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** సీనియర్లు ఇబ్బంది పెట్టడంతో మనస్తాపానికి గురై ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం రాళ్లచెరువు తండాకు చెందిన సంతోష్‌నాయక్ మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ కాలేజీలో చదువుతున్నాడు. తరచూ సీనియర్లు ఇబ్బందులకు గురి చేయడంతో ఈ నెల 14న స్వగ్రామానికి వెళ్లి ఇంట్లోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన తల్లిదండ్రులు తిమ్మాజిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు.

### పత్తి రైతుల సమన్వయ కమిటీ ఏర్పాటు

**వరంగల్:** రాష్ట్రంలోని పత్తి రైతుల సమస్యలపై పోరాటం చేసి వారికి మద్దతు ధరలను పెంచేందుకు ప్రణాళికలను రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు పత్తి రైతుల రాష్ట్ర కన్వీనింగ్ (సమన్వయ) కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ తెలిపారు. రాష్ట్ర కమిటీ కన్వీనర్‌గా కట్టా గాంధీ, కోకన్వీనర్‌గా పెద్దారపు రమేష్, సభ్యులుగా మూడ్ శోభన్, సంపత్‌రావు, గఫూర్ పాషా, జియావుద్దీన్, రవి, రామలింగేశ్వర్‌రావు, కడిపికొండ రాంరెడ్డి, సీతారాంరెడ్డి, చల్లా నర్సింహరెడ్డిలను నియమించినట్లు పేర్కొన్నారు.





డబుల్ బెడ్రూం ఇంటిలో లబ్ధిదారులతో మంత్రులు


### అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు

**మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**

**స్టేషన్‌ఘన్‌పూర్:** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేలా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. పేదల కళ్లలో ఆనందబాష్పాలు చూడటమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని, అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.18 వేల కోట్లతో 2 లక్షల 83 వేల డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశారని, ఇప్పటికే లక్షా 30 వేల ఇళ్ల నిర్మాణం పూర్తికాగా రూ.7,700 కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు అవుతాయని, ఎవ్వరూ నిరాశపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఆర్‌డీఓ ఎల్.రమేశ్ పాల్గొన్నారు.

### పీఆర్ ఇంజనీరింగ్ సంఘం ఎన్నిక

**హన్మకొండ:** తెలంగాణ పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోషియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికైంది. హన్మకొండలో శనివారం రాత్రి రాష్ట్ర సర్వసభ్య సమావేశం అనంతరం రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించారు. పోలింగ్ అనంతరం అర్ధరాత్రి ఫలితాలు ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డి.సూర్యప్రకాశ్, ఉపాధ్యక్షులుగా జి.నరేంద్రప్రసాద్, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డి.వెంకట్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా ఎ.శ్రీదేవి, వి.సుధీర్‌కుమార్, టెక్నికల్ సెక్రటరీగా కె.విద్యాసాగర్, జోనల్ సెక్రటరీలుగా కె.ప్రకాశ్, ఎం.బి.రేణుక, కోశాధికారిగా కె.రాజశేఖర్ ఎన్నికయ్యారు.



## క్లుప్తంగా...

### 'రాజ్యాంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోంది'



సాక్షి, హైదరాబాద్: మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగిన సీపీఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ సంస్థలైన ఆర్‌బీఐ, సీబీఐలాంటి సంస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారం కోసం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. పౌరసత్వ సవరణ బిల్లుతో ఈశాన్య రాష్ట్రాలతో పాటు త్రిపుర, బెంగాల్‌లో ఉద్యమాలు ఎగిసిపడుతున్నాయన్నారు. ఈ నెల 19న పౌరసత్వ సవరణ బిల్లుకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం నియంత పాలనను సాగిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మండిపడ్డారు.

### ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య**



హైదరాబాద్: ప్రైవేటు రంగ పరిశ్రమలు, కంపెనీలు, కార్పొరేట్ సంస్థల ఉద్యోగాల నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభా నిష్పత్తిలో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బీసీ భవన్‌లో బీసీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు ఉండేలా పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. 1992 తర్వాత ప్రవేశపెట్టిన నూతన సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో మొత్తం కంపెనీలు, ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలు ప్రైవేటు రంగంలోకి వచ్చాయన్నారు. 90 శాతం ఉద్యోగాలు ప్రైవేట్ రంగంలో ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ తగ్గిపోయిందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగ రంగంలో బలహీనవర్గాల వాటా దక్కాలంటే రిజర్వేషన్లను ప్రవేశపెట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కాగా, ఈ సమావేశంలో తెలంగాణ బీసీ ట్రేడ్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. బీసీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా బ్రహ్మయ్య, సిటీ కమిటీ అధ్యక్షుడిగా వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొడ్డుపల్లి తిలక్ ఎన్నికయ్యారు. సమావేశంలో గుజ్జ కృష్ణ, రాంకోటి, బర్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్పీఐ జాతీయ అధ్యక్షుడిగా రాజేంద్ర

హైదరాబాద్: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) జాతీయ అధ్యక్షుడిగా ఎస్.రాజేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేందర్ గవాయ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేశ్ బాబులతో కలిసి రాజేంద్ర మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను దేశవ్యాప్తంగా మరింత అభివృద్ధి చేసే దిశగా కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దళితులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. త్వరలోనే కేసీఆర్‌ను కలిసి దళితుల డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీఐ జాతీయ కార్యదర్శి ఎన్.శాంతలక్ష్మి, టి.పద్మారావు, పి.గోవింద్‌రాజ్ పాల్గొన్నారు.

### చదువుతోనే బడుగుల జీవితాల్లో మార్పు: జాజుల



హైదరాబాద్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు చదువు అనే ఆయుధాన్ని చేతబట్టి అపరజ్ఞానాన్ని పెంపొందించుకొని పోటీ ప్రపంచంలో విశ్వవిజేతలుగా నిలవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆకాంక్షించారు. చదువుతోనే బడుగు వర్గాల జీవితాల్లో మార్పు సాధ్యమన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే 129వ వర్ధంతిని పురస్కరించుకొని గత నెల 27 నుంచి చేపట్టిన 'బీసీ విద్యార్థుల మేలుకొలుపు యాత్ర' ఆదివారం హైదరాబాద్‌లోని అడిక్‌మెట్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అడిక్‌మెట్‌లో ఉన్న బీసీ కళాశాల వసతి గృహ ప్రాంగణంలో జరిగిన బీసీ విద్యార్థుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జాజుల మాట్లాడుతూ.. ఎందరో మహనీయుల త్యాగాలతో కుల, మత, ప్రాంత, లింగ వివక్ష లేకుండా చదువుకునే హక్కు వచ్చిందన్నారు. ఈ హక్కును ఉపయోగించుకొని బడుగు వర్గాల విద్యార్థులు తమ లక్ష్యాలను ఛేదించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, కేంద్ర కమిటీ అధ్యక్షుడు తాటికొండ విక్రంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీలకు పవర్ షాక్!

- గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.700 కోట్లు
- తప్పనిసరిగా చెల్లించేలా పీఆర్ యాక్ట్‌లో పొందుపరిచిన ప్రభుత్వం
- ఏకకాల పరిష్కార పద్ధతిలో విద్యుత్ సంస్థలకు చెల్లించాలని ఆదేశం
- చిన్న గ్రామాలకు భారంకానున్న పాత బకాయిలు



సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీలకు కరెంట్ షాక్ తగిలింది. పాత బకాయిలు గుదిబండగా మారడంతో స్థానిక సంస్థల ఖజానాకు భారీ చిల్లు పడనుంది. ఏళ్ల తరబడి చెల్లించని బిల్లుల చిట్టాను వెలికితీసిన విద్యుత్ సంస్థలు.. గ్రామాల వారీగా జాబితాను పంచాయతీరాజ్‌శాఖకు అందజేశాయి. ఇందులో ఒక్కో పంచాయతీకి సగటున రూ.లక్షల్లో బిల్లులు రావడంతో పాలకవర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. పాత బకాయిలు తప్పనిసరిగా చెల్లించాలని సీఎం కేసీఆర్ స్పష్టంచేయడంతో ఈ మేరకు పెండింగ్ బిల్లుల వ్యవహారానికి ముగింపు పలకాలని పీఆర్ శాఖ నిర్ణయించింది.

**భారీగా పెండింగ్..**

రాష్ట్రవ్యాప్తంగా 12,571 గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ.700.68 కోట్ల మేర విద్యుత్ బకాయిలున్నాయి. ఇందులో రూ.280 కోట్ల మేర సర్‌చార్జీలే ఉండటం గమనార్హం. వీటిని వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పద్ధతిలో చెల్లించే వెసులుబాటు కల్పించే అంశాన్ని పరిశీలించాలని ట్రాన్స్‌కోను పంచాయతీరాజ్ శాఖ అభ్యర్థించింది. వినియోగ చార్జీలను తగ్గించలేమని, బిల్లులు కట్టకపోవడంతో మోపిన అపరాధ రుసుం(సర్‌చార్జీ)ను తగ్గించే అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తామని ఆ సంస్థ స్పష్టం చేసింది. ఏ శాఖ నుంచైనా కచ్చితంగా వసూలు చేయాలని సీఎం స్పష్టం చేయడం.. స్థానిక సంస్థలు కరెంట్ బిల్లుల క్లియర్‌కు మొదటి ప్రాధాన్యతనివ్వాలని కొత్త పంచాయతీరాజ్ చట్టంలో పొందుపరచడం పంచాయతీరాజ్ శాఖను ఇరకాటంలో పడేసింది. నిధుల కటకటతో కొట్టుమిట్టాడిన పంచాయతీలు.. పేరుకుపోయిన బిల్లులే కాదు.. నెలవారీ బిల్లులు కూడా చెల్లించకుండా వాయిదా వేస్తూ వచ్చాయి. దీంతో మొత్తం తడిసి మోపెడయ్యాయి.

**కట్ చేయలేక.. కాసులు రాక..**

విద్యుద్దీపాలు, తాగునీటి అవసరాలకు స్థానిక సంస్థలు విద్యుత్‌ను వినియోగిస్తున్నాయి. వీటిని అత్యవసర సర్వీసులుగా గుర్తించినందున కరెంట్ సరఫరాను నిలిపివేయడం ట్రాన్స్‌కోకు ప్రతిబంధకంగా మారింది. అయితే ప్రభుత్వ శాఖల నుంచి భారీ మొత్తంలో రావాల్సిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో సంస్థకు ఆర్థికంగా కష్టంగా మారిందని సీఎం దృష్టికి విద్యుత్ శాఖ తీసుకెళ్లింది. దీంతో విద్యుత్ సంస్థలను కాపాడుకోవాలంటే ఏ శాఖ అయినా తప్పకుండా కరెంట్ చార్జీలు చెల్లించాల్సిందేనని తేల్చిచెప్పడంతో స్థానిక సంస్థలకు మినహాయింపు లేకుండాపోయింది. తాజాగా గ్రామ సీమల అభివృద్ధికి ప్రతినెలా రాష్ట్ర ప్రభుత్వం రూ.339 కోట్లు విడుదల చేస్తోంది. ఈ నిధుల నుంచి కరెంట్ చార్జీలు చెల్లించాలని సూచిస్తూ పీఆర్ కమిషనర్ రఘునందన్‌రావు డీపీవోలను ఆదేశించారు.

| | ఆగస్టు వరకు | సెప్టెంబర్ | అక్టోబర్ | నవంబర్ | మొత్తం |
|---|---|---|---|---|---|
| వినియోగం రుసుం | 396.77 | 5.76 | 10.95 | 7.15 | 420.63 |
| అపరాధ రుసుం | 263.29 | 4.58 | 6.09 | 6.09 | 280.05 |

గ్రామ పంచాయతీల విద్యుత్ బకాయిలు (రూ.కోట్లలో)

**బకాయిల భారం కష్టమే**

కాగా పెండింగ్ కరెంట్ బిల్లులను స్థానిక పంచాయతీలు చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేయడంతో చిన్న పంచాయతీలు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డాయి. ఇప్పటికే మల్టీ పర్పస్ వర్కర్, ట్రాక్టర్, ట్రాలీ కొనుగోలు, 30 రోజుల పల్లె ప్రణాళికలో భాగంగా చేసిన పనులకు నిధుల్లేక తల్లడిల్లుతున్న తరుణంలో ఈ భారాన్ని ఎలా మోయాలనే సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి.

**కొత్త మీటర్ల అమరికకు రూ.1,600**

కొత్త గ్రామ పంచాయతీల్లో విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు సర్వీస్ చార్జీ, ఇతరత్రా అవసరాలకు వన్‌టైమ్ కింద రూ.1,600 వినియోగించుకునే వెసులుబాటును ప్రభుత్వం స్పష్టం చేసింది. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 4 వేల కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. వీటికి సంబంధించిన విద్యుత్ సరఫరా, నిర్వహణ బాధ్యతలు విడిపోయినందున దానికి తగ్గట్టుగా నూతన జీపీల్లోనే కరెంట్ మీటర్ ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# ఆ ప్లీడర్లు మాకొద్దు!

- టీపీపీలు వద్దే వద్దంటున్న పోలీసులు
- నేతల సిఫారసు లేఖలతో సెషన్స్ కోర్టుల్లో పాగా
- ప్రతిభ లేకపోవడంతో కీలక కేసుల్లో ఓటమి
- రాష్ట్రంలో 200లకు పైగా ప్లీడర్ పోస్టులు ఖాళీ
- 'దిశ'కేసుతో మరోసారి వెలుగులోకి లాయర్ల కొరత



సాక్షి, హైదరాబాద్: అతనొక చెట్టుకింద ప్లీడరు.. ఎలాగైనా టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (టీపీపీ) అవ్వాలనుకున్నాడు. తెలిసిన నేతను పట్టుకుని ఏకంగా డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో టీపీపీగా పాగా వేశాడు. న్యాయశాస్త్రంపై పెద్దగా పట్టులేకపోవడం, అనుభవం కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో వచ్చిన కేసుల్లో చాలావరకు ఓడిపోతున్నాడు. అందులో కీలకమైన కేసులూ ఉండటం గమనార్హం. తామెంతో కష్టపడి కేసు దర్యాప్తు చేసినా.. వాటిని నిరూపించలేక కోర్టులో చేతులెత్తేస్తున్న ఇలాంటి టీపీపీల వల్ల పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పుడున్న టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లలో అధిక శాతం మంది ఇలాంటివారే ఉండటం గమనార్హం. కొందరు మాత్రమే కేసులను ప్రభావవంతంగా వాదించగలుగుతున్నారు. 'దిశ'లాంటి సంచలన కేసులు నమోదైతే.. అక్కడున్న టెన్యూర్ ప్లీడర్లు తమకొద్దని ఉన్నతాధికారులకు దర్యాప్తు అధికారులు స్పష్టం చేస్తుండటంతో వేరే ప్రాంతం నుంచి సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను పిలిపించాల్సి వస్తోంది.

**ఎలా వస్తున్నారు..?**

రాష్ట్రంలో దాదాపు 500లకుపైగా వివిధ రకాల కోర్టులు ఉన్నాయి. ఇందులో దాదాపుగా 200కిపైగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలాకాలంగా ఈ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయట్లేదు. దీంతో కేసులు వాదించేందుకు వీలుగా తాత్కాలికంగా ఈ పోస్టులను టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆయా కోర్టులు భర్తీ చేసుకుంటున్నాయి. ఇందుకోసం స్థానిక కోర్టు న్యాయమూర్తి తన కోర్టులో పనిచేస్తున్న ప్రతిభావంతులైన ప్రైవేటు లాయర్లలో నలుగురైదుగురి పేర్లను జిల్లా కలెక్టరుకు సిఫారసు చేస్తారు. వీరిలో ఒకరిని కలెక్టర్ ఎంపిక చేసి, ప్రభుత్వానికి పంపుతారు. ప్రభుత్వం ఆమోదించగానే.. సదరు వ్యక్తి టీపీపీగా ప్రాక్టీసు చేయొచ్చు. కానీ, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోతోంది. రాజకీయ నేతల జోక్యంతో కొందరు ప్లీడర్లు నేరుగా టీపీపీలుగా నియామక పత్రాలు తెచ్చుకుని నేరుగా జిల్లా కోర్టుల్లో పాగా వేస్తున్నారు. అంతవరకు బానే ఉంది. కానీ, కీలకమైన కేసుల్లో నిందితులు సుప్రీం, హైకోర్టులో వాదించే సీనియర్ లాయర్లను తెచ్చుకున్నప్పుడు వారిని ఎదుర్కోలేకపోతున్నారు. ఆంగ్ల పరిజ్ఞానం, అనుభవం అంతంత మాత్రంగానే ఉండటంతో వారి ముందు నిలబడలేకపోతున్నారు. ఫలితంగా కీలకమైన కేసులు ఓడిపోతున్నారు. చాలాచోట్ల లాయర్ సామర్థ్యం మీద కేసులు గెలవడం పరిపాటి. ఇక్కడ కూడా టీపీపీ బలహీనతలు తెలుసుకున్న కొందరు ఎలాగైనా కేసు గెలవాలని సీనియర్లను రంగంలోకి దించుతున్నారు.

**అదే ప్రభుత్వ లాయర్లయితే..**

సాధారణంగా ప్లీడర్ పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నుంచి నోటిఫికేషన్ వెలువడుతుంది. టీఎస్‌పీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి శిక్షణ ఇచ్చి, వివిధ కోర్టుల్లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియమిస్తుంది. వీరు ప్రభుత్వానికి జవాబుదారీగా ఉంటారు. ఒక కేసు ఓడిపోతే, అందుకు జవాబుదారీతనం వహిస్తూ.. సరైన కారణాలు తెలపాల్సి ఉంటుంది. అవసరమైతే విచారణ, క్రమశిక్షణ చర్యలు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. పూర్తి క్రమశిక్షణతో కేసులు సాగుతుంటాయి. అదే టీపీపీలు నెలానెలా రూ.40వేల వేతనం తీసుకుంటున్నా సరే.. వీరు కేసులు ఓడిపోతే ఎలాంటి చర్యలు ఉండవు. వీరెవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. మూడేళ్ల పాటు నిరాటంకంగా పదవిలో కొనసాగొచ్చు. ఈ క్రమంలో పోలీసులు, రాజకీయ నేతలతో కలిగే పరిచయాల వల్ల వీరికే కలిసొస్తుంటుంది.

**పోక్సో కోర్టుల్లోనూ పైరవీలు..**

చిన్నారులపై లైంగిక వేధింపుల కేసులను వేగవంతంగా విచారణ చేసేందుకు ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన 9 పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లోనూ లాయర్ల కొరత ఉంది. దీంతో ఆయా కోర్టుల్లోకి ఇన్‌చార్జి లాయర్లుగా వెళ్లేందుకు టెన్యూర్ ప్లీడర్లు పైరవీలు మొదలుపెట్టారు. సెషన్స్ కోర్టుల్లోనే సరైన ప్రతిభ చూపని వీరు పోక్సో కోర్టుల్లో ఇన్‌చార్జి లాయర్లుగా వెళ్లేందుకు తహతహలాడుతుండటం గమనార్హం. దీంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ప్రభుత్వం ఖాళీగా ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పలువురు సీనియర్ పోలీసు అధికారులు, న్యాయనిపుణులు సూచిస్తున్నారు.

# పౌరసత్వ బిల్లుతో అనిశ్చితి

**సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్**



హైదరాబాద్: దేశ విభజన దిశగా బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ బిల్లును తీసుకువచ్చిందని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఆరోపించారు. ఈ బిల్లు వల్ల దేశంలో అనిశ్చితి వాతావరణం నెలకొందని మండిపడ్డారు. సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభలు ఆదివారం మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తపన్‌సేన్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం సమాజాన్ని, దేశాన్ని విభజించే దిశగా అడుగులు వేస్తోందని విమర్శించారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు సహా పలు విషయాల్లో ఒంటెత్తు పోకడలకు పోయి దేశాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్మిక చట్టాలను క్రోడీకరించి యజమాని దయాదాక్షిణ్యాలపై కార్మికులు ఆధారపడే విధంగా తయారుచేశారని మండిపడ్డారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన కార్మిక ఉద్యమానికి, కార్మికులకు సమ్మె చేసే హక్కు లేదనే విధంగా చట్టాలను మారుస్తున్నారని విమర్శించారు. కార్మిక వర్గం అంతా వర్గ పోరాటాన్ని పునఃనిర్మించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ప్రజల్లో చైతన్యం పెంచడమే సీఐటీయూ ప్రధాన కర్తవ్యమని చెప్పారు. దీనిలో భాగంగా జనవరి 8న దేశ సార్వత్రిక సమ్మెను చేపట్టిందని చెప్పారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. దేశ వృద్ధి రేటు ఆరున్నరేళ్లలో అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయిందని, 45 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిందన్నారు. పాలకవర్గాల ఎత్తుగడలను తిప్పికొట్టేలా కార్మికులను చైతన్యపర్చే బాధ్యతను కార్మిక సంఘాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ యాదవ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంకె.ఘోష్, తెలంగాణ రిటైర్డ్ పెన్షనర్స్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సమాజంలో పీఆర్వోల పాత్ర కీలకం

**పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ముగింపు సభలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

హైదరాబాద్: సమాజంలో ప్రజా సంబంధాల అధికారుల (పీఆర్వో) పాత్ర కీలకమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మూడ్రోజులుగా బేగంపేటలో ఓ ప్రైవేట్ హోటల్‌లో 'పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా'(పీఆర్ఎస్ఐ) ఆధ్వర్యంలో జరిగిన సదస్సు ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ..కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ అన్ని రంగాల్లో పురోగమిస్తోందన్నారు. రాష్ట్రంలోని నూతన పారిశ్రామిక విధానం ప్రపంచంలోనే ఉత్తమ విధానంగా ప్రశంసలు పొందిందన్నారు. యువత, విద్య, ఆరోగ్యం తదితర రంగాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమాల కింద శాశ్వత కార్యక్రమాలను చేపట్టాలని ఆయన కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు అజిత్‌పాఠక్ మాట్లాడుతూ.. జాతీయ సదస్సును విజయవంతంగా నిర్వహించిన హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధులను అభినందించారు. తదుపరి సదస్సును శ్రీలంకలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నివేదితా మెనర్జీ మాట్లాడుతూ.. ప్రజా సంబంధాలు సంస్థలకు అత్యంత కీలకమన్నారు. జ్ఞానాన్ని పరస్పరం మార్పిడి చేసుకునేందుకు ఇలాంటి సదస్సులు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. పీఆర్ఎస్ఐ జాతీయ మాజీ అధ్యక్షుడు సమీర్ గోస్వామి మాట్లాడుతూ మూడ్రోజుల సదస్సులో పీఆర్వోలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీపై పూర్తి అవగాహన ఏర్పడిందన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మంత్రి చేతులమీదుగా అవార్డులు**

ఈ సందర్భంగా పీఆర్ఎస్ఐ చాప్టర్ అవార్డులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఉత్తమ చాప్టర్ చైర్మన్ అవార్డును హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ పి.వేణుగోపాల్‌రెడ్డి, జైపూర్ చాప్టర్ చైర్మన్ రవిశంకర్ శర్మలు అందుకున్నారు. బెస్ట్ ఎమర్జింగ్ చాప్టర్‌గా తిరుపతి చాప్టర్ జాతీయ అవార్డు పొందింది. ఉత్తమ కార్యక్రమాలు నిర్వహించిన కోల్‌కతా, గువాహటి, భోపాల్, అహ్మదాబాద్ చాప్టర్‌లకు అవార్డులు దక్కాయి. ఉత్తమ కోశాధికారి అవార్డును చెన్నైకు చెందిన వి.కాళిదాస్ పొందగా.. ఉత్తమ కార్యదర్శి అవార్డును డెహ్రాడూన్‌కు చెందిన అనిల్‌కుమార్ స్వీకరించారు. అధిక సంఖ్యలో ప్రతినిధులను నమోదు చేసిన చాప్టర్‌గా వైజాగ్ చాప్టర్ ప్రత్యేక అవార్డు పొందింది. కార్యక్రమంలో హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ పి.వేణుగోపాల్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షుడు యూఎస్‌శర్మ, నరేంద్ర మెహతా, ఎంఎస్ మజుందార్, ఉత్తరాఖండ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర దోభాల్ తదితరులు పాల్గొన్నారు.

# చికెన్.. డౌన్

**భారీగా తగ్గిన ధరలు ● కిలో రూ.150–180.. లైవ్ రూ.85**



సాక్షి, హైదరాబాద్: ఆదివారం వచ్చిందంటే చికెన్ ప్రియులకు కోడి కూర వండందే ముద్ద దిగదు. చికెన్ బిర్యానీ, చికెన్ కర్రీ ఉంటే చాలు లొట్టలేసుకుని రెండు ముద్దలు ఎక్కువగా ఆరగించేస్తారు. కానీ చలితీవ్రతతో పాటు అయ్యప్ప భక్తుల సీజన్‌కావడంతో హైదరాబాద్ జనం చికెన్ వైపు ఆసక్తి చూపడం లేదు. ఇటు డిమాండ్ కంటే కోళ్ల ఉత్పత్తి ఎక్కువ కావడం కూడా చికెన్ ధరలు పడిపోవడానికి ప్రధాన కారణం. గత వారం రోజుల్లో ఈ ఏడాదిలో అతి తక్కువ ధరలు నమోదయ్యాయి. లైవ్ చికెన్ హోల్‌సేల్ ధర కిలో రూ.82 నుంచి రూ. 92 మధ్య ఉంది. చికెన్ ధర కూడా విపరీతంగా తగ్గింది. కిలో చికెన్ రూ. 150 నుంచి రూ.180 వరకు పలుకుతోంది. ఉత్పత్తికి సరిపడా అమ్మకాలు లేకపోవడంతో ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

**డిమాండ్ తక్కువ సరఫరా ఎక్కువ**

సాధారణ రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల నుంచి 5 లక్షల కిలోల వరకు చికెన్ విక్రయాలు జరుగుతాయి. ఇక నగర వ్యాప్తంగా లక్ష కిలోలకు అటు, ఇటుగానే విక్రయాలు సాగుతున్నాయి. ఇతర రోజులతో పోల్చితే వినియోగం సగానికి సగం తగ్గింది. పలు కోళ్ల ఫారం వ్యాపారులు ప్లానింగ్ చేసుకోని కోళ్లను పెంచుతారు. అయితే కోళ్ల విక్రయాల్లో దాదాపు 30 శాతం తగ్గడంతో ధరలు తగ్గుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. శ్రావణ మాసం ముగియడంతో పాటు అయ్యప్ప దీక్షలు ప్రారంభ, చలి తీవ్రత నేపథ్యంలో ఈ నెల మొదటివారం నుంచే చికెన్ వినియోగం తగ్గింది. నగరంలో ఇతర రోజులతో పోల్చితే వినియోగం సగానికి సగం తగ్గింది. మాములు రోజుల్లో 80 కిలోల వ్యాపారం జరిగితే గత వారంలో 30 కిలోలు కూడా విక్రయించడం కష్టంగా మారిందని ఓ హోల్‌సేల్ వ్యాపారి చెప్పారు. ఆదివారం ఎప్పుడైనా కనీసం 150 కిలోలకు తగ్గకుండా విక్రయిస్తానని అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదని నాంపల్లికి చెందిన ఓ వ్యాపారి వెల్లడించారు.

### చలో ఢిల్లీ సక్సెస్: చెన్నయ్య



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన మహాధర్నా, నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. మింట్ కాంపౌండ్‌లోని అంబేడ్కర్ స్ఫూర్తిభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కాలం చెల్లిన డిమాండ్ అని, ఎస్సీలను వర్గీకరించొద్దని కోరుతూ కేంద్రమంత్రులు, ఎస్సీ కమిషన్ జాతీయ చైర్మన్‌ను కలసి వినతిపత్రం సమర్పించామని చెప్పారు.

# ఆ ఇంజనీరింగ్ కాలేజీలకు గుర్తింపు వచ్చేనా?

- భవన నిర్మాణ అనుమతులు లేకుండానే కొనసాగుతున్న 238 కాలేజీలు
- అనుమతి పత్రాలు ఉంటేనే గుర్తింపు ఇస్తామని రెండేళ్ల కిందటే పేర్కొన్న ఏఐసీటీఈ
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ రాయడంతో అప్పట్లో గుర్తింపు మంజూరు
- గత నెలతోనే ముగిసిన రెండేళ్ల గడువు.. దీంతో మళ్లీ ఏఐసీటీఈ నోటీసులు
- వచ్చే ఏడాదికి అనుమతులపై కాలేజీ యాజమాన్యాల్లో ఆందోళన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 238 ఇంజనీరింగ్ కాలేజీలకు మళ్లీ కష్టకాలం వచ్చింది. వచ్చే విద్యా సంవత్సరంలో (2020–21) వాటికి గుర్తింపు వస్తుందో.. లేదోనన్న..? ఆందోళన మొదలైంది. రాష్ట్రంలోని ఆయా కాలేజీలకు భవన నిర్మాణాలకు అనుమతులు లేకపోయినా భవనాలను నిర్మించి కొనసాగిస్తున్నాయి. ఈ అంశంపై రెండేళ్ల కిందట (2017 నవంబర్‌లో) అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ)కి ఫిర్యాదులు అందాయి. దీంతో ఆ యాజమాన్యాలకు ఏఐసీటీఈ నోటీసులు జారీ చేసింది. యాజమాన్యాలు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. అనుమతి పత్రాలు ఇస్తేనే 2018–19 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు చేపట్టేందుకు గుర్తింపు ఇస్తామని స్పష్టం చేసింది. చివరకు ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ఏఐసీటీఈ ఆ కాలేజీలకు మినహాయింపును ఇచ్చింది. రెండేళ్లలో అనుమతులు తెచ్చుకోవాలని స్పష్టం చేసింది. అయినా యాజమాన్యాలు ఇప్పటికీ అనుమతులు తీసుకోలేదు.

**ముగిసిన గడువు.. మళ్లీ నోటీసులు..**

గతంలో యాజమాన్యాలు తమకు మినహాయింపు ఇవ్వాలని కోరినా ఏఐసీటీఈ నిరాకరించడం, దానివల్ల రాష్ట్రంలో 238 కాలేజీల్లో ప్రవేశాలు ఆగిపోతే మంచిది కాదన్న ఉద్దేశంతో ప్రభుత్వమే రంగంలోకి దిగింది. ఏఐసీటీఈకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ రాయడంతో రెండేళ్లపాటు



మినహాయింపు ఇచ్చింది. ఆ కాలేజీలకు ఇచ్చిన గడువు గత నెలతోనే ముగిసిపోవడంతో ఏఐసీటీఈ మళ్లీ నోటీసులు జారీ చేసింది. దీంతో 2020–21 విద్యా సంవత్సరంలో తమ కాలేజీల్లో ప్రవేశాలు చేపట్టేందుకు ఏఐసీటీఈ గుర్తింపు ఇస్తుందా? లేదా? అన్న ఆందోళనలో పడ్డాయి. గతంలోనే తాము అడిగితే మినహాయింపును ఏఐసీటీఈ నిరాకరించిన నేపథ్యంలో ఈసారి తమ విజ్ఞప్తిని పట్టించుకుంటుందో లేదోనన్న ఆందోళనతో మళ్లీ ప్రభుత్వాన్ని కలసి విజ్ఞప్తి చేసేందుకు సిద్ధం అయ్యాయి. అయితే ఇప్పటికే ఒకసారి గడువు ఇచ్చినందునా ఇప్పుడు మళ్లీ ప్రభుత్వం రెండోసారి అడిగితే ఏఐసీటీఈ ఇస్తుందా? లేదా? అన్న ఆందోళన కూడా యాజమాన్యాల్లో నెలకొంది.

**లేఖ రాసినా.. నో స్పందన..**

ఆ 238 కాలేజీల స్థలాలు, భవనాలు, ఇతర అనుమతుల పత్రాలను తనిఖీ చేసి అక్టోబర్‌లోపు నివేదిక అందించాలని ఏఐసీటీఈ గత ఏప్రిల్‌లోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అది ఆ బాధ్యతను రాష్ట్ర ఉన్నత విద్యామండలికి అప్పగించింది. ఇంతవరకు కనీసం వాటిని తనిఖీ చేయలేదు. చివరకు ఆ బాధ్యతను జేఎన్టీయూకు ఉన్నత విద్యామండలి అప్పగించింది. దీంతో సంబంధిత అనుమతి పత్రాలను అందజేయాలని యాజమాన్యాలకు జేఎన్టీయూ లేఖలు రాసినా స్పందించలేదు. ఈ క్రమంలో ఏఐసీటీఈ మళ్లీ నోటీసులు జారీ చేయడంతో యాజమాన్యాల్లో ఆందోళన మొదలైంది.

**హెచ్‌ఎండీఏలోనే అధికం..**

అనుమతులు లేకుండా కొనసాగుతున్న కాలేజీల్లో ఎక్కువ శాతం హెచ్‌ఎండీఏ పరిధిలోనే ఉన్నాయి. వాటిల్లోనూ 111 జీవో పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో 42 కాలేజీలు ఉన్నాయి. 238 కాలేజీల్లో కొన్ని కాలేజీలు గ్రామ పంచాయతీ అనుమతితో బహుళ అంతస్తుల భవనాలను నిర్మించాయి. కొన్ని కాలేజీలు ల్యాండ్ కన్వర్షన్ చేసుకోకుండానే వ్యవసాయ భూముల్లో నిర్మాణాలు చేశాయి. మరికొన్ని కాలేజీలకు హెచ్‌ఎండీఏ అనుమతులు లేవు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి భవన నిర్మాణ అనుమతులు తీసుకోని కాలేజీలూ ఉన్నాయి. అంతేకాదు 111 జీవో పరిధిలోని ప్రాంతాల్లో, ల్యాండ్ సీలింగ్ పరిధిలో ఉన్న భూముల్లో, అటవీ భూముల్లో నిర్మాణాలు చేపట్టాయి. ఇప్పుడు వాటన్నింటికి సమస్య మళ్లీ ముందుకొచ్చింది. రెండేళ్ల గడువు ఇచ్చినా యాజమన్యాలు సరిదిద్దుకోలేదు.

# ‘ఉన్నావ్’ తీర్పు నేడే?



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉన్నావ్ అత్యాచారం కేసులో ఢిల్లీ కోర్టు సోమవారం తీర్పు వెలువరించే అవకాశముంది. ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేశారని బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్ ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం నమోదైన ఈ కేసుకు సంబంధించి రహస్య విచారణ సందర్భంగా ఢిల్లీ కోర్టు న్యాయమూర్తి ధర్మేశ్ శర్మ 16వ తేదీన తీర్పు ఇవ్వనున్నట్లు కథనాలు వెలువడ్డాయి. సీబీఐ వాదనలు పూర్తయిన తర్వాత తీర్పు ఇచ్చే అవకాశముందని భావిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 5వ తేదీ నుంచి న్యాయమూర్తి ధర్మేశ్ శర్మ ఈ కేసుపై రోజువారీ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు చొరవతో ఈ కేసు లక్నో నుంచి ఢిల్లీ కోర్టుకు బదిలీ అయింది.

2017లో బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ ఓ బాలికను కిడ్నాప్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించి శశిసింగ్ అనే వ్యక్తిపై అభియోగాలు నమోదయ్యాయి కూడా. రెండేళ్ల తర్వాత ఈ ఏడాది ఆగస్టు 9న ఎమ్మెల్యేపై కూడా అభియోగాలు నమోదు కాగా బీజేపీ ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించింది. నేరపూరిత కుట్ర (120బీ), కిడ్నాప్ (363), పెళ్లికి బలవంత పెట్టడం (366), అత్యాచారం (376) తదితర అంశాలతోపాటు లైంగిక వేధింపుల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే చట్టం(పోక్సో) కింద ఆ ఇద్దరిపైనా కేసులు నమోదయ్యాయి. అభియోగాల నమోదుకు సుమారు పది రోజుల ముందు అత్యాచార బాధితురాలు ఓ కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ట్రాక్టర్ ఢీకొనడంతో బాధితురాలి సన్నిహిత బంధువులు ఈ ప్రమాదంలో మరణించారు. బాధితురాలి తండ్రిపై ఉత్తరప్రదేశ్‌లో ఓ హత్య కేసు, అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నందుకు కేసు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆగస్టు ఒకటిన ఈ కేసును ఢిల్లీ కోర్టుకు బదిలీ చేసింది. విచారణ మొత్తం 45 రోజుల్లో పూర్తి చేయాలని అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ఆదేశాలు జారీ చేశారు.

## నిర్భయ దోషులను నేను ఉరి తీస్తా

### హోంమంత్రికి షూటర్ వర్తికా సింగ్ రక్తంతో లేఖ



**లక్నో:** నిర్భయ కేసులో దోషులను ఉరి తీసేందుకు తనకు అనుమతి ఇవ్వాలని కోరుతూ షూటర్ వర్తికా సింగ్ తన రక్తంతో రాసిన లేఖను కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. ‘నా చేతిలో ఉన్న లేఖ హోంమంత్రి అమిత్‌షాకు రాశా. నా రక్తంతో రాసిన ఈ లేఖను రిజిస్టర్డ్ పోస్టులో ఆయనకు పంపా. నిర్భయ దోషులను ఉరి తీసేందుకు అనుమతి ఇవ్వాలని కోరా. భారత్‌లో మహిళలను దేవతలుగా చూసే సంస్కృతి బలోపేతానికి ఈ అంశం దోహదపడుతుంది. ఈ సందేశం ప్రపంచం మొత్తానికి వెళ్లాలి. అలాగే మహిళ కూడా ఉరి తీయగలదన్న విషయాన్ని అత్యాచార దోషులు తెలుసుకోవాలి. ట్వీట్ కూడా చేశా’అని తెలిపారు. మహిళా సైనికులు, మహిళా నటులు, ఎంపీలు, సంస్థలు తనకు మద్దతు తెలపాలన్నారు. మరోవైపు నిర్భయ దోషులను తాము ఉరి తీస్తామంటూ తీహార్ జైలు అధికారులకు దేశంలోని పలు ప్రాంతాల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి. నిర్భయ కేసు దోషి ఒకరు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించనుంది.

# నేర నిరూపణ 32 శాతమే!

- అత్యాచార ఘటనల్లో క్షేత్రస్థాయిలో లోపిస్తున్న శాస్త్రీయ విచారణ
- చార్జిషీటు దాఖలులోనూ అలసత్వం..



**న్యూఢిల్లీ:** సరిగ్గా ఏడేళ్ల క్రితం దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున జరిగిన అత్యంత పాశవికమైన నిర్భయ ఘటన ఇప్పటికీ దేశ ప్రజల గుండెల్లో పచ్చి పుండులాగే ఉంది. దేశంలో ఎన్నో నిర్భయ లాంటి సంఘటనలు జరుగుతున్నా.. నిందితులపై నేర నిరూపణ మాత్రం జరగట్లేదు. నిర్భయ ఘటన తర్వాత మహిళలపై అత్యాచారాలకు సంబంధించి కఠినమైన చట్టాలు తీసుకొచ్చినా నిందితులకు మాత్రం శిక్షలు అమలు కావట్లేదు. దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనల్లో 32.2 శాతం మాత్రమే నేర నిరూపణ జరుగుతోందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో–2017 డేటా ప్రకారం తెలుస్తోంది. 2017లో దేశవ్యాప్తంగా మొత్తం 1,46,201 కేసుల్లో విచారణ చేపట్టగా, కేవలం 5,822 కేసుల్లోనే నేర నిరూపణ జరిగింది. అత్యాచార ఘటనలు పెరుగుతున్నా.. చార్జిషీటు దాఖలు రేటు మాత్రం తగ్గుతోంది. అంతేకాకుండా కోర్టు వరకు చాలా కేసులు వెళ్లకపోవడం మరింత ఆందోళన చెందాల్సిన విషయం. చార్జిషీటు దాఖలు రేటు 2013లో 95.4 శాతం ఉండగా, 2017 వచ్చేసరికి 86.6 శాతానికి తగ్గింది. ఒడిశా మాజీ డీజీపీ బీబీ మహంతీ.. ఓ విదేశీ పర్యాటకురాలిని అత్యాచారం చేసిన కేసులో డిఫెన్స్ లాయర్ శిల్పి జైన్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్న పోలీసు అధికారుల్లో నైపుణ్యత పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ‘చార్జి షీటు దాఖలు చేసే విషయంలో సబ్‌ఇన్‌స్పెక్టర్‌దే కీలక పాత్ర. అంటే ఆ చార్జిషీటు విషయం ఎంత శాస్త్రీయంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు’అని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఈ కేసులను చేపట్టే న్యాయవాదుల పరిస్థితి ఇలాగే ఉందని చెప్పారు. విచారణ సరిగ్గా జరపకపోవడం, కోర్టులో కేసులు నిలవకపోవడం వల్లే నేర నిరూపణ శాతం చాలా తక్కువగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## క్లుప్తంగా...

### ఎమ్మెల్యే పదవికి రాజీనామా యోచనలో సిద్ధూ !



**సాక్షి బెంగళూరు:** ఇటీవలే సీఎల్పీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన మాజీ సీఎం సిద్ధరామయ్య త్వరలో శాసనసభ్యత్వానికి రాజీనామా చేస్తారనే ఊహాగానాలు కాంగ్రెస్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. గుండె వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిద్ధరామయ్య.. ఎమ్మెల్యే పదవికి సైతం రాజీనామా చేయాలనుకుంటున్నట్లు తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు సమాచారం. ఆస్పత్రిలో తనను కలిసేందుకు వచ్చిన నేతలంతా సీఎల్పీ పదవికి చేసిన రాజీనామాను ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేశారు. అయితే, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు సిద్ధరామయ్య తెలిపినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయన ఆదివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు.

### శబరిమల ఆదాయం రూ. 104 కోట్లు



**శబరిమల:** శబరిమల అయ్యప్ప ఆలయం ఆర్జన విషయంలో దూసుకెళ్తోంది. ఏడాదిలో రెండు నెలలే (సంవత్సర మండలం– మకరవిలక్కు) తెరిచి ఉంచే ఈ ఆలయంలో నవంబర్ 17 నుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అప్పటి నుంచి గత 28 రోజుల్లో శబరిమలకు వచ్చిన ఆదాయం రూ. 104.72 కోట్లని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) ఆదివారం తెలిపింది. గతేడాది ఇదే సీజన్‌లో ఈ సమయానికి ఆదాయం రూ. 64.16 కోట్లని టీడీబీ అధికారి ఎన్.వాసు చెప్పారు.

### రాహుల్‌ని కొట్టండి

**సావర్కర్ మనవడు రంజిత్**

**ముంబై:** హిందుత్వ యోధుడు వీడీ సావర్కర్‌ను అవమానించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ప్రజల మధ్య నిల్చోబెట్టి కొట్టాలని సావర్కర్ మనవడు రంజిత్ సావర్కర్ మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రేను కోరారు. ఎవరైనా సావర్కర్‌ను అవమానిస్తే పబ్లిక్‌లో కొట్టాలని గతంలో ఉద్ధవ్ ఠాక్రే పిలుపునిచ్చిన విషయాన్ని రంజిత్ గుర్తు చేశారు. రంజిత్ సావర్కర్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ‘మా తాత బ్రిటిష్ వారికి క్షమాపణ చెప్పారని రాహుల్ పదేపదే అంటున్నారు. అది నిజం కాదు. జైలు నుంచి విడుదల అయ్యేందుకు బ్రిటిష్ వారు పెట్టిన నిబంధనలకు ఆయన అంగీకరించారు. అంతేకానీ క్షమాపణ చెప్పలేదు’ అని వివరణ ఇచ్చారు.

**‘పౌరసత్వం’ సావర్కర్‌కు భిన్నం: శివసేన**

బీజేపీ తీసుకొచ్చిన పౌరసత్వ చట్టం హిందూవాద నాయకుడైన వీర్ సావర్కర్ ఆలోచనలకు భిన్నమైనదని మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. మహిళలకు రక్షణ లేకపోవడం, నిరుద్యోగం, వ్యవసాయ సమస్యలను కప్పిపుచ్చేందుకు బీజేపీ ‘పౌరసత్వ’ వాదనను తెరపైకి తెచ్చిందని అన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ఒకే దేశం ఉండాలని సావర్కర్ ఆకాంక్షించారని, ఇప్పుడు ఆయన ఆలోచనలకు తూట్లు పొడిచేలా ఇతర దేశాల మైనారిటీలను భారత్‌లోకి బీజేపీ ఆహ్వానిస్తోందని అన్నారు.

### ఫలితం లేకుండానే ముగిసిన ‘కాప్’

**మాడ్రిడ్:** దాదాపు 200 దేశాల నుంచి హాజరైన ప్రతినిధులతో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో అట్టహాసంగా ప్రారంభమైన ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు సీఓపీ25 ఎలాంటి ఫలితం తేలకుండానే ముగిసింది. ఈనెల 2నుంచి 13 వరకూ జరగాల్సిన సమావేశాల్లో ఫలితం తేలకపోవడంతో ఆదివారం వరకూ పొడిగించారు. అయినప్పటికీ కర్బన ఉద్గారాల తగ్గింపుపై 2015 పారిస్ ఒప్పందం చేసిన సూచనలను అమలు చేసే దిశగా అడుగులు పడలేదు. వచ్చే ఏడాది స్కాట్లాండ్ (గ్లాస్గో)లో జరగనున్న సీఓపీ26 సదస్సులో వాటిని చర్చించాలని నిర్ణయించారు. ఈ సదస్సులో పలు అంశాలు చర్చకు వచ్చినప్పటికీ ఎటువంటి అంగీకారం కుదరలేదు.

# ఆగని ‘పౌరసత్వ’ ప్రకంపనలు

- ఢిల్లీలో బస్సులకు నిప్పు; జామియా వర్సిటీలో పోలీసుల సోదాలు
- గువాహటిలో నాలుగుకు చేరిన మృతులు
- రాజకీయ పార్టీ పెట్టనున్న ఏఏఎస్‌యూ



పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా గువాహటిలో కళాకారులు నిర్వహించిన సంగీత కార్యక్రమానికి భారీగా హాజరైన నిరసనకారులు

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. దేశ రాజధానితో పాటు పశ్చిమబెంగాల్, అస్సాంల్లో ఆదివారం ఉధృతంగా నిరసన ప్రదర్శనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ఢిల్లీలో ఆందోళనకారులు బస్సులకు, అగ్నిమాపక వాహనానికి నిప్పుపెట్టారు. గువాహటిలో పోలీసుల కాల్పుల్లో మృతుల సంఖ్య నాలుగుకి చేరింది. లండన్‌లోని భారతీయ హైకమిషన్ కార్యాలయం ఎదుట కొందరు ప్లకార్డులతో నిరసన తెలిపారు. కాగా, సొంతంగా రాజకీయ పార్టీ పెట్టాలని యోచిస్తున్నట్లు ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ వెల్లడించింది. మరోవైపు, పౌరసత్వ సవరణ చట్టంపై అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. ‘ముస్లింల హక్కులకు భంగం కలిగే ఒక్క అంశం కూడా చట్టంలో లేదు’ అని పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర స్పష్టం చేశారు.

**రాజధానిలో..**

ఆగ్నేయ ఢిల్లీలోని జామియా మిలియా వర్సిటీ దగ్గరలో ఆందోళనకారులు పలు బస్సులను తగలబెట్టారు. మంటలను ఆర్పేందుకు వస్తున్న అగ్నిమాపక వాహనాలను కూడా ధ్వంసం చేశారు. పోలీసుల లాఠీ చార్జిలో పలువురు విద్యార్థులు, ఆందోళనకారులకు గాయాలయ్యాయి. ఒక పోలీసుకు, ఇద్దరు అగ్నిమాపక సిబ్బందికి గాయాలయ్యాయి. కాగా, తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామని విద్యార్థి సంస్థ ఎన్ఎస్‌యూఐ తెలిపింది. కొన్ని సంఘ వ్యతిరేక శక్తులు ఉద్యమంలో చేరి హింసకు పాల్పడుతున్నాయని జామియా మిలియా వర్సిటీ విద్యార్థులు ఆరోపించారు. వర్సిటీలో ఉంటూ విద్యార్థులను రెచ్చగొడ్తున్న విద్యార్థేతరులను అదుపులోకి తీసుకునేందుకు ఆదివారం పోలీసులు జామియా మిలియా వర్సిటీలో సోదాలు జరిపారు.

**బెంగాల్‌లో..** :పశ్చిమబెంగాల్‌లోని నాడియా, బీర్భూమ్, నార్త్ 24 పరగణ, హౌరా జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ఆందోళనకారులు రహదారులపై టైర్లు, కట్టెలను తగలబెట్టారు. ముర్షిదాబాద్, మాల్డా, నార్త్ 24 పరగణ, హౌరా జిల్లాల్లో ఇంటర్నెట్‌ను అధికారులు నిలిపేశారు. అస్సాంలోని గువాహటిలో పోలీసు కాల్పుల్లో చనిపోయిన ఆందోళనకారుల సంఖ్య ఆదివారానికి నాలుగుకి చేరింది. ఆందోళనల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ మాత్రం ఐదుగురు చనిపోయారని, పలువురి పరిస్థితి సీరియస్‌గా ఉందని తెలిపింది. బుధవారం నుంచి తమ ఆసుపత్రిలో బుల్లెట్ గాయాలతో 29 మంది చేరారని గువాహటి మెడికల్ కాలేజీ తెలిపింది. లండన్‌లోని భారతీయ హై కమిషన్ ముందు కొందరు అస్సాం వాసులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంప్రదాయ అస్సామీ వస్త్రధారణలో పిల్లలతో పాటు వచ్చిన యువత ఈ కార్యక్రమంలో పాల్గొంది. వీరితోపాటు కాంగ్రెస్ పార్టీ యూకే శాఖ కూడా నిరసన ప్రదర్శన చేపట్టింది.

**పార్టీ పెడతాం: ఏఏఎస్‌యూ**

పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళనల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్(ఏఏఎస్‌యూ) సొంతంగా రాజకీయ పార్టీని ప్రారంభించాలని యోచిస్తోంది. శిల్పి సమాజ్‌తో కలిసి పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు ఏఏఎస్‌యూ సంకేతాలిచ్చింది.

### సుప్రీంకోర్టుకు ఏజీపీ

పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకునేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని అధికార బీజేపీ భాగస్వామ్య పక్షమైన అస్సాం గణపరిషద్ (ఏజీపీ) నిర్ణయించిందని ఏజీపీ నేత దీపక్ దాస్ తెలిపారు. అస్సాం ప్రజల సెంటిమెంట్‌ను ఏజీపీ గౌరవిస్తుందని ఈ చట్టం తమ ఉనికిని, అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తుందని భావిస్తున్నారని ఆయన చెప్పారు. మరోవైపు ఈ చట్టాన్ని ఏజీపీ ఎప్పుడూ సమర్థించలేదని మంత్రి ప్రఫుల్ల కుమార్ మహంత స్పష్టం చేశారు.

# ఐటీబీపీకి పెళ్లిళ్ల వెబ్‌సైట్

**ఇప్పటికే 150 మంది నమోదు**

**న్యూఢిల్లీ:** ఇండో టిబెటన్ సరిహద్దు దళం (ఐటీబీపీ)లో పనిచేస్తున్న బ్రహ్మచారుల కోసం ఐటీబీపీ ఒక పెళ్లిళ్ల వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. ఐటీబీపీలో పనిచేసే సిబ్బందికి సరిపడే జీవిత భాగస్వామిని వెతికిపెట్టేందుకే ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు ఐటీబీపీ వర్గాలు తెలిపాయి. ఐటీబీపీలో ప్రస్తుతం 25 వేల మంది అవివాహిత పురుష, వేయి మంది అవివాహిత మహిళా సిబ్బంది పనిచేస్తున్నారని వెల్లడించాయి. వీరు సరిహద్దులోని మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తుండటం వల్ల జీవిత భాగస్వామిని వెతకడం వారి కుటుంబాలకు కష్టంగా మారుతోందని ఓ అధికారి అభిప్రాయపడ్డారు. దళంలో ప్రస్తుతం 333 జంటలు (భార్యాభర్తలు) పనిచేస్తున్నాయి. ఐటీబీపీలో పనిచేసే చాలా మంది సంస్థలోనే పనిచేసే భాగస్వామి కావాలని కోరుకుంటున్నారని, క్లిష్ట పరిస్థితుల్లో వారు పనిచేస్తున్న రీత్యా భాగస్వామితో కలసి పనిచేస్తే కాస్త ఉపశమనంగా ఉంటుందని అనుకుంటున్నారని తెలిపారు. ఈ వెబ్‌సైట్‌లో అవివాహిత లేదా భాగస్వామిని కోల్పోయి ఒంటరిగా ఉంటున్న, విడాకులు తీసుకున్న సైనికులు నమోదు చేసుకోవచ్చునితెలిపారు. ఇప్పటివరకు ఈ వెబ్‌సైట్‌లో 150 మంది నమోదు చేసుకున్నారు. సాయుధ బలగాల్లోని మొత్తం 10 లక్షల మందిలో 2.5 లక్షల మంది అవివాహితులు.

# కాంగ్రెస్ అగ్నికి ఆజ్యం పోస్తోంది

- ‘పౌరసత్వ’ ఆందోళనలకు పరోక్ష సహకారం
- జార్ఖండ్ ప్రచారంలో ప్రధాని మోదీ



**దుమ్కా (జార్ఖండ్):** కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు పౌరసత్వ(సవరణ) చట్టంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, దేశంలో అశాంతిని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు. ఆదివారం జార్ఖండ్‌లోని దుమ్కాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడారు. అగ్నికి ఆజ్యం పోస్తున్న వారిని వారి దుస్తుల ఆధారంగానే గుర్తించవచ్చునని పార్టీ, సామాజిక వర్గాల పేర్లు నేరుగా ప్రస్తావించకుండా మోదీ పరోక్షంగా వ్యాఖ్యానించారు. ‘ఆస్తులకు నిప్పు పెడుతున్న వారిని టీవీల్లో చూడవచ్చు. ధరించిన దుస్తుల ఆధారంగానే వారిని గుర్తుపట్టవచ్చు’అని ఆయన అన్నారు. పౌరసత్వ(సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈశాన్య రాష్ట్రాలతోపాటు బెంగాల్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలన్నింటికీ ప్రతిపక్షాలు వ్యూహాత్మక సహకారం అందిస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. అయితే, కాంగ్రెస్ కుట్రలకు ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ప్రభావితం కాలేదని అన్నారు. లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయం ముందు కొందరు ప్రదర్శన నిర్వహించడంపై ఆయన.. ‘దేశం పరువు తీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. పాకిస్తాన్ ఏళ్లుగా చేస్తున్న పనిని ఇప్పుడు కాంగ్రెస్ మొదటిసారిగా చేపట్టింది’ అని ఆరోపించారు. పార్లమెంట్‌లో ఎంపీలు సంతాలీ తదితర ప్రాంతీయ భాషల్లో మాట్లాడేందుకు అవకాశం కల్పించిన ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడుకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభలో సంతాలీ భాష తర్జుమాకు కూడా వీలు కల్పించారన్నారు.



# అపస్మారక స్థితిలోకి స్వాతి మలివాల్

**న్యూఢిల్లీ:** రేప్ దోషులకు నేరం చేసిన ఆరు నెలల్లోగా కఠిన శిక్ష అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేస్తున్న ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ అనారోగ్యానికి గురయ్యారు. కొన్ని రోజులుగా దీక్ష చేస్తున్న ఆమె ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం ఉదయం అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీంతో ఇక్కడి ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. శనివారం రాత్రి ఆమె ఆరోగ్యం క్షీణించడంతో డాక్టర్లు ఆస్పత్రిలో చేర్పించాలని సూచించినప్పటికీ, ఆమె అందుకు నిరాకరించారు. అపస్మారక స్థితిలోకి చేరుకోగానే ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డుకు తరలించారని, స్పృహలోకి రాగానే డాక్టర్లు సెలైన్లు ఎక్కించడాన్ని స్వాతి నిరాకరించారని కమిషన్ సభ్యుడొకరు తెలిపారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఇక్కడి రాజ్‌ఘాట్‌లోని సమతా స్థల్ వద్ద స్వాతి పది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే.



జమ్మూకశ్మీర్ రోజు రోజుకూ మంచు మయమవుతోంది. జమ్మూ నుంచి 115 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాట్నిటాప్ హిల్ రిసార్ట్ వద్ద ఆదివారం కార్లు ఇలా మంచులో కూరుకుపోయాయి.

# దేశవ్యాప్త ఎన్ఆర్‌సీకి త్వరలో బిల్లు?

**అక్రమ వలసదారులే లక్ష్యంగా.. • చట్టం చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు**

**పౌరసత్వ చట్ట సవరణ బిల్లు కాస్తా పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోద ముద్రతో చట్టమైంది మొదలు.. దేశవ్యాప్త ఎన్ఆర్‌సీపై ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే ఈ అంశంపై తన వైఖరిని స్పష్టం చేయగా, ప్రతిపక్షాలు సైతం ఈ అంశంపై పోరుకు సన్నద్ధమవుతున్నాయి.**

**- న్యూఢిల్లీ**

## ఎన్ఆర్‌సీ అంటే..?



జాతీయ స్థాయిలో అర్హులైన పౌరులదరితో కూడిన జాబితాను నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్.. క్లుప్తంగా ఎన్ఆర్‌సీ అంటారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అక్రమ వలసదారుల ఏరివేత కోసం ఇటీవలే ఈ ఎన్ఆర్‌సీ ప్రక్రియను ఈశాన్య రాష్ట్రం అస్సాంలో పూర్తి చేశారు కూడా. ప్రత్యేక జాతులపై ప్రభావం పడరాదన్న ఉద్దేశంతో ఈ ప్రక్రియను అస్సాంలో చేపట్టారు. అయితే అక్కడ ఎన్ఆర్‌సీ పూర్తయినప్పటి నుంచి జాతీయ స్థాయిలో అమలుకు డిమాండ్లు పెరుగుతున్నాయి. హోం మంత్రి అమిత్ షాతో పాటు బీజేపీ అగ్రనేతలు పలువురు ఇందుకు బహిరంగంగానే మద్దతిచ్చారు. ఈ మేరకు జాతీయ స్థాయిలో ఓ చట్టం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నట్లు అంచనా. దేశవ్యాప్త ఎన్ఆర్‌సీ చట్టం అమల్లోకి వస్తే.. ప్రభుత్వం ఈ దేశంలో అక్రమంగా నివాసం ఉంటున్న వారిని గుర్తించడంతోపాటు అదుపులోకి తీసుకునేందుకు అవకాశముంటుంది. వారిని స్వదేశాలకు తిప్పి పంపేందుకూ అధికారాలు లభిస్తాయి.

## నష్టం ఎవరికి?

ప్రస్తుతానికి ఎన్ఆర్‌సీ చట్టం అనేది ఓ ప్రతిపాదన మాత్రమే. అమల్లోకి వస్తే అక్రమ వలసదారులే లక్ష్యంగా మారతారు. అయితే అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన హిందువులు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, జైన్, పార్శీలకు పెద్దగా ఇబ్బంది లేకపోవచ్చు. మతపరమైన హింసను స్వదేశాల్లో ఎదుర్కొన్నందుకే ఇక్కడకు వచ్చామని వారు చెప్పుకుంటే సరిపోతుంది. ఇంకోలా చెప్పాలంటే ఎన్ఆర్‌సీ దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తే పైన చెప్పుకున్న మూడు దేశాలు మినహా మిగిలిన ఏ దేశపు అక్రమ వలసదారు కూడా ఇక్కడ ఉండేందుకు అవకాశం ఉండదు. అంతేకాకుండా.. ఈ దేశాల నుంచి వచ్చిన ముస్లింలూ చిక్కుల్లో పడతారు. ఎందుకంటే వీరు పౌరసత్వ చట్ట సవరణ నిబంధనల్లో లేరు కాబట్టి. దీంతో వీరందరినీ అదుపులోకి తీసుకుని డిటెన్షన్ కేంద్రాలకు తరలించాల్సి వస్తుంది. అస్సాంలో ఇప్పటికే గుర్తించిన 19 లక్షల మంది అక్రమ వలసదారులను ఇలాగే డిటెన్షన్ కేంద్రాల్లోనే ఉంచారు. దేశవ్యాప్తంగా అక్రమ వలసదారులను ఇలా డిటెన్షన్ కేంద్రాలకు తరలించిన తరువాత విదేశీ వ్యవహారాల శాఖ ఆయా దేశాలకు సమాచారం ఇస్తుంది. ఆయా దేశాలు అంగీకరిస్తే వారిని తిప్పి పంపుతారు. దేశవ్యాప్త ఎన్ఆర్‌సీకి కట్టుబడి ఉన్నామని అమిత్ షా ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో రానున్న పార్లమెంటు సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లు ప్రవేశపెడతారా? అన్నది ఇప్పుడు అందరిలోనూ చర్చనీయాంశం అవుతోంది.

**ఎన్ఆర్‌సీపై ప్రశాంత్ కిషోర్ భగ్గు!**

అక్రమ వలసదారులను గుర్తించేందుకు దేశవ్యాప్తంగా ఎన్ఆర్‌సీ నిర్వహిస్తామన్న అధికార బీజేపీ ప్రకటనలపై ఎన్నికల వ్యూహకర్త, జేడీయూ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ భగ్గుమంటున్నారు. ఈ చర్య పెద్దనోట్ల రద్దు మాదిరిగానే పేదలు, దిగువ తరగతి వారికి తీవ్ర నష్టం చేయనుందని ఆయన ట్వీట్ చేశారు.


# రైతును కోటీశ్వరుణ్ని చేసిన ఉల్లి



**బెంగళూరు:** దేశమంతటా సామాన్యులు ఉల్లిని కొనలేని పరిస్థితుల్లో ఇబ్బంది పడుతుండగా కర్ణాటకకు చెందిన ఓ రైతు మాత్రం ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు. ఉల్లికి ఏర్పడిన భారీ డిమాండ్ కర్ణాటకకు చెందిన రైతు మల్లికార్జున (42)ను కోటీశ్వరుణ్ని చేసింది. పంట వేయడం కోసం తీసుకున్న అప్పు చెల్లించడమేగాక భూమి కొనుగోలుకు, ఇల్లు కట్టుకోవడానికి కూడా సిద్ధమయ్యారు. చిత్రదుర్గ జిల్లాలోని దొడ్డసిద్ధవ్వనహళ్లికి చెందిన ఆయన తనకున్న 10 ఎకరాలతో పాటు మరో 10 ఎకరాలను లీజుకు తీసుకొని ఉల్లి సాగు చేశారు. దీనికి రూ. 15 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. దాదాపు రూ. 5 నుంచి 10 లక్షల లాభం వస్తుందని అంచనా వేశారు. అయితే నవంబర్ నుంచి అమాంతంగా పెరిగిన ఉల్లి ధరలు ఆయనకు భారీ లాభం వచ్చేలా చేశాయి. దాదాపు 240 టన్నుల ఉల్లిని ఆయన అమ్మారు. ఉల్లి ధర కిలో రూ. 200 దాకా వెళ్లడంతో రాత్రికిరాత్రే ఆయన కోటీశ్వరుడు అయ్యారు. అయితే దీని కోసం బాగా శ్రమించాల్సి వచ్చిందని, 50 మంది పనివారిని పెట్టి పంట పండించామని చెప్పారు. ఉల్లి డిమాండ్ పెరిగినపుడు దొంగల బారిన పడకుండా కుటుంబమంతా కాపలాగా ఉన్నామని చెప్పారు. అక్టోబర్‌లో ధరలు అంతంత మాత్రంగా ఉన్నప్పుడు భయపడ్డామని చెప్పారు. అయితే తర్వాత క్వింటాల్ ఉల్లి ధర రూ. 7 వేల నుంచి 12 వేలకు పెరగడంతో పరిస్థితులు మారిపోయాయని చెప్పారు.

# సాక్షి సాహిత్యం

నల్లగొండ | సోమవారం
డిసెంబర్ | 16 | 2019
sakshisahityam@gmail.com

### గ్రహం అనుగ్రహం


శ్రీవికారినామ సంవత్సరం. దక్షిణాయనం, హేమంత ఋతువు. మార్గశిర మాసం. తిథి బ.చవితి ఉ.6.54 వరకు, తదుపరి పంచమి తె.4.55 వరకు (తెల్లవారితే మంగళవారం). నక్షత్రం ఆశ్లేష తె.4.35 వరకు (తెల్లవారితే మంగళవారం). వర్జ్యం సా.5.55 నుంచి 7.26 వరకు. దుర్ముహూర్తం ప.12.15 నుంచి 1.01 వరకు, తదుపరి ప.2.29 నుంచి 3.11 వరకు. అమృత ఘడియలు రా.3.01 నుంచి 4.32 వరకు.

**సూర్యోదయం:** 6.26 **సూర్యాస్తమయం:** 5.24
**రాహుకాలం:** ఉ.7.30 నుంచి 9.00 వరకు.
**యమగండం:** ఉ.10.30 నుంచి 12.00 వరకు

### నమాజ్ వేళలు

**ఫజర్:** 5.21
**జొహర్:** 12.11
**అసర్:** 4.08
**మగ్రీబ్:** 5.44
**ఇషా:** 7.02

### ఈవారం పుస్తకాలు




**అమెరికా తెలుగు కథానిక 14**
సంపాదకులు: వంగూరి చిట్టెన్ రాజు, శాయి రాచకొండ; పేజీలు: 320; వెల: 200

**చైతన్యం** (కథలు)
రచన: సోమ సుధేష్ణ; పేజీలు: 232; వెల: 100

**అమెరికులాసా కథలూ కమామీషులూ**




రచన: వంగూరి చిట్టెన్‌రాజు; పేజీలు: 152; వెల: 100
మూడింటి ప్రతులకు: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (హ్యూస్టన్); ప్రతులకు: వంశీ రామరాజు ఫోన్: 9849023852.
మెయిల్: vangurifoundation@gmail.com



**స్త్రీవాద వివాదాలు**
సంకలనం: ఎస్.సూర్యప్రకాశ్; పేజీలు: 170; వెల: 150

**దళితవాద వివాదాలు**
సంకలనం: ఎస్.విజయభాస్కర్; పేజీలు: 310; వెల: 260
రెండింటి సంపాదకుడు: డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ



**నవలాలోకం (3)**
రచన: ముక్తవరం పార్థసారథి; పేజీలు: 188; వెల: 150

**రష్యా విప్లవం భారత స్వాతంత్య్ర సంగ్రామం**
రూపకర్త: సురవరం సుధాకరరెడ్డి; సంపాదకులు: జయమెహతా; అనువాదం: వి.రాంనర్సింహారావు; పేజీలు: 196; వెల: 160
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, జి.ఎస్.ఐ. పోస్టు, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-2422448

### బ్లాగో ప్రపంచం

సభలో పద్య పఠనానికి
వెడుతున్నట్టున్నారు!
టమాటాలు అయితే వద్దు..
కుళ్లిపోయిన ఉల్లిగడ్డ ఒకటి వచ్చిపడ్డా
మరిచిపోకుండా పట్టుకురండి.



# కాలంలో కరిగిన ప్రేమకథ

**కథాసారం**

బస్సు జుజుమురా దగ్గర ఆగినప్పుడు ఆ అమ్మాయిని చూశాను. నవంబర్ చలి దుర్మార్గుడి పగలాగ పట్టుకుని వదలకుండా ఉంది. శంభల్‌పూర్ నుంచీ భువనేశ్వర్ ప్రయాణం. ''ఈ రాత్రి వద్దు భాయ్. రెఢాకోల్ అడవిలో చలి తట్టుకోలేవు'' అన్నాడు సాహూ. ''రేపు ఉదయం భువనేశ్వర్‌లో పని ఉందం''టూ బస్సు ఎక్కేశాను.

ముతక శంభల్‌పూర్ చీరలో చుట్టిన రబ్బరు బొమ్మలాగా ఉంది ఆమె. ఒరియా అమ్మాయేమో అనుకున్నాను. నన్ను తికమక పెట్టింది ఒకటే– ఆమె సిగలో కెంపులాంటి గులాబీ పువ్వు. ఇక్కడ అమ్మాయిలు పువ్వులు పెట్టుకోరు. శరీరంలో కనిపించని ఏ అందాన్నయినా భర్తీ చేయగలిగిన అందమైన కళ్లు. నా ముందు సీట్లో కూర్చుంది. పక్కన ఎవరూ లేరు. ముసలి పండా కారా కిళ్లీ చారలో చొంగ కలిసి వంటి మీదకి కారుతుండగా చలిని జయించి నిద్రపోతున్నాడు. ఆంధ్రదేశంలో చలికాలానికి ఉపయోగించే ఏ దుప్పటీ ఈ చలికి ఆగడం లేదు.

ఉన్నట్టుండి బస్సు కుదుపుతో ఆగింది. ఒరియా భాష ఒక్కసారి నిద్రలేచింది. అతి త్వరగా మాట్లాడుతారు. మాటల్లో కంచు గొంతు వెదికి తెచ్చుకుంటారు. డ్రైవరు ఏదో చెబుతున్నాడు. కొన్ని నిద్రముఖాల్లో కోపం తెలుస్తోంది. ప్రయాణికులంతా దిగారు. నా ముందున్న అమ్మాయి ఊదారంగు శాలువా వదిలించి దగ్గరగా లాక్కుని లేచింది. నేనూ లేచాను.

''జుజుమురా'' అన్న నల్లటి అక్షరాలు బస్సు లైట్ల వెలుగులో కనిపిస్తున్నాయి. చిన్న గ్రామం. డ్రైవరు ఏం చెపుతున్నాడో తెలుసుకోవాలనిపించింది. ఒక రాయిమీద కూర్చుంది అమ్మాయి. ఇంగ్లిష్ అర్థమవుతుందేమో, అడిగాను. ''డ్రైవరు ఏం చెపుతున్నాడో చెప్పగలరా?''

''ఇంజిన్ చెడిందట. క్షణంలో బాగు చేస్తానంటున్నాడు'' తెలుగులో వచ్చింది సమాధానం. ''నాకు తెలుగు ఎలా వచ్చునా అని ఆశ్చర్యపోతున్నారా?''

''అది ఒకటి. నేను తెలుగువాడినని ఎలా అర్థం చేసుకున్నారా అని.''

''పాన్ వేసుకుంటే ఇక్కడ వాళ్లు గంటల కొద్దీ బుగ్గన ఉంచుకుంటారు. మీరేమో కిటికీ దగ్గర కూర్చున్నారు. అయిదు నిమిషాల్లో పూర్తి చేసేస్తున్నారు.''

''కానీ నేను తెలుగువాడినని ఎలా అర్థం చేసుకున్నారో చెప్పలేదు''

''మీ చేతుల్లో తెలుగు ఉత్తరం ఉంది. మీరు కట్టుకున్న పంచె పొందూరు ఖద్దరు.'' క్షణం నిర్ఘాంతపోయాను. ''మీరేం చేస్తారు?'' అంది.

''టెక్స్‌టైల్ మిల్ ఏజెంటుని. ప్రతి సీజన్‌లోనూ వచ్చి ధర్మవరం చీరలకు ఆర్డర్స్ తీసుకుంటాను. తిరిగి వెళ్లి సరుకు పంపే ఏర్పాటు చేస్తాను. అమ్మకంలో రెండు పర్సెంట్ కమీషన్ ఇస్తారు. అందులో ఒక పర్సెంట్ జర్దాకిళ్లీలు నమిలి ఒరిస్సాకే చెల్లించి వెళ్లిపోతాను.''

గలగలమని నవ్వింది. నిద్రపోతున్న జుజుమురాలో కాస్త చైతన్యం వచ్చినట్టనిపించింది.



**నాకు తెలుగు ఎలా వచ్చునా అని ఆశ్చర్యపోతున్నారా?" "అది ఒకటి. నేను తెలుగువాడినని ఎలా అర్థం చేసుకున్నారా అని."**

''ఎలా ఉంది ఒరిస్సా మీకు?''

''ఇక్కడికి వస్తూ పోతూండడం 14 నెలల అలవాటు. దిగులుగా, తీరుబాటుగా, ఒంటరిగా, భయంగా ఉంది. తెలుగు భాష వినిపిస్తే ఆప్తబంధువుని చూసినట్టు ఫీలవుతాను.''

''అయితే మీకో ఆప్తబంధువు దొరికినట్టే.''

ఆమె చొరవకి ఆశ్చర్యం కలిగినా, ఆనందంగానే ఉంది. ప్రయాణికులంతా మా వేపు దొంగ చూపులు చూసి నవ్వుకున్నారు.

''మీ పేరు?''

''మీరా''

బస్సు రిపేరు అయిందని అరుస్తున్నాడు కండక్టరు. లేచి చీరె సవరించుకుంది. నేను లేవడానికి చెయ్యి అందించింది. జారిపోయిన నా కండువాని తనే భుజం మీద వేసింది. బస్సులో ఇదివరకే కూర్చున్న సీటులోకి కునుకుతున్నాను. నా పక్కన కూర్చున్న పండా ఏదో అన్నాడు. మీరా నవ్వుతోంది. ''ఆయనేమంటున్నాడో తెలుసా? మీరిద్దరూ భార్యాభర్తలు కదా, రెండు సీట్లెందుకు? మీరు నా పక్కన కూర్చుంటే, ఆయన పడుకుంటాడట.''

నా ముఖం ఎరుపెక్కింది. ''మనం భార్యాభర్తలం కానక్కరలేదు కానీ నా పక్కన కూర్చోండి. పాపం, పడుకుంటాడు'' అంది. నా భార్య అయ్యే అర్హతలు మీరాకి లేవా? జీవితం పట్ల ఆమెకున్న పాటి కలలు కూడా నాకు లేవు. ''ఊరు పేరు తెలీని అమ్మాయి నా భార్య అంటాడా ఈ ఫూల్'' అని కోపం వచ్చింది మీకు. అవునా?''

''మీకెలా తెలుసు?''

''నేను బీఏ సైకాలజీ స్టూడెంటుని.''

ఆ అమ్మాయి అంత చదువుకున్నదని ఊహించలేదు. మనలో లేని గుణాన్ని ఇంకొకరిలో చూడడాన్ని ఆకర్షణ అంటారనుకుంటాను. మీరా నన్ను ఆకర్షించింది. క్రమంగా పెళ్లి చేసుకోవాలన్న ఆలోచనకి మనస్సు ఒదిగిపోయింది. ''నేను పూరీ వెడుతున్నాను. ఈ పండా ఆశీర్వాదం ఫలించాలని జగన్నాథుడికి చెప్పుకుంటాను'' అన్నాను.

ఇప్పుడామె ముఖంలో ఆశ్చర్యం.

''అమ్మ లేదు. నాన్న లేడు. పెళ్లి నా జీవితంలో కలకాలం నిలవడానికి చేసే స్నేహం లాంటిది. మీరు మంచి స్నేహితులు కాగలరని ఈ చిన్న వ్యవధిలోనే అనిపించింది.''

అంత పెద్ద కళ్లలో కదిలిన నీటితెరని ఆ మసక వెలుగు దాచలేకపోయింది. ఆమె చెయ్యి నా చేతిని బలంగా పట్టుకుంది. నేను వణుకుతున్నానని అప్పుడర్థమయింది– నేను తీసుకున్న నిర్ణయానికి గానీ చలికి గానీ. ''అదేమిటి వణుకుతున్నారు? ఈ శాలువా కప్పుకోండి.''

ఇప్పుడు ఆమె శరీరం నాకు తగులుతోంది. సన్నటి నడుం వెచ్చగా నా కుడిచేతికి ఆనుకుంది. ఎంతసేపు గడిచిందో తెలియలేదు.

''రెఢాఖోల్ వచ్చాం. కాస్త టీ తాగరూ?'' చుట్టూ చూశాను. బస్సంతా ఖాళీ. ఆమె ఒళ్లో తల పెట్టుకున్నానని అర్థమై, సిగ్గుపడిపోయాను. ఇద్దరం దిగాం.

''భర్త అపస్మారంలో ఉపయోగపడడానికి భార్యకి ఎంత అదృష్టం.''

''ప్రతి స్త్రీ పుట్టుక నుంచీ వైవాహిక జీవితానికి సిద్ధపడుతుందనుకుంటాను. భార్య పాత్రని ఎంత సులువుగా స్వీకరిస్తున్నారు మీరు?''

చిన్న కుర్రాడు రొట్టెలు చేస్తున్నాడు. కాల్చడానికి పెనం ఏమీ లేదు. నేలకి సమంగా ఒక కుండని పాతేశారు. మూడు రొట్టెలు కొన్నాను. పప్పు సెగలు కక్కుతోంది.

ఆకలి చల్లార్చుకుని బస్సు ఎక్కాం. భయంకరమైన రోడ్డు. విడాకులు ఇచ్చుకుందామని నిశ్చయం చేసుకున్న భార్యాభర్తల్ని బస్సులో కూర్చోపెడితే ఆ రోడ్డు వాళ్లని అనుగుల్ చేరే లోపల ఏకం చేస్తుంది. ప్రతి పది నిమిషాలకీ నా చేతుల్లో ఉంటోంది మీరా. బస్సులో దీపాలన్నీ ఆర్పేశారు. మా పెళ్లి, తర్వాతి జీవితాన్ని గురించి 30 మైళ్లు చర్చించుకున్నాం. నేను కంపెనీ తరపున బరంపురంలో ఉండిపోయేట్టు ఏర్పాటు చేసుకుంటాను. నా క్యాంపులన్నీ ఇద్దరం కలిసే తిరుగుతాం. ముగ్గురు పిల్లలు. ఇద్దరబ్బాయిలు, ఒకమ్మాయి. ఇద్దరమ్మాయిలు, అబ్బాయి అయినా ఫరవాలేదు. ముగ్గురూ అమ్మాయిలే పుడితే?

అనుగుల్ వచ్చేసింది. దూరంగా ఉన్న టీ దుకాణం వేపుకి మళ్లించింది మీరా. ''ఇష్, ఇటు'' అంది. నా భుజం మీద పడిన ఆమె వేళ్లు వణుకుతున్నాయి. ''ముద్దు పెట్టుకోరూ!'' అంది. దిమ్మరపోయాను. నా చేతులు స్వాధీనం తప్పాయి. మంచులాంటి గాలి మా మధ్య వేడెక్కింది. కాసేపటికి ఆమె ఏడుస్తోందని తెలుసుకున్నాను. ఊపిరి సలపని ఆనందానికి పరాకాష్ట దుఃఖమేమో!

డ్రైవరు మా కోసమే హారను మోగిస్తున్నాడు. అనుగుల్ వచ్చిన డ్రైవరు గుర్రు తీస్తున్నాడు. కొత్త డ్రైవరు నడుపుతున్నాడు. అతి సులువుగా నా కౌగిట్లో ఒదిగిపోయిన ఈ మీరా నా జీవితంలో వహించనున్న పాత్రకి అర్హురాలేనా?

ఢెంకనాల్ దాటి కుంతలీ. ఇంకాసేపట్లో తెల్లవారుతుంది. ''నేను కటకంలో దిగాలి'' అంది. కటకం దగ్గరవుతుందనగానే ఆమె కంఠంలో దిగులు. ''వస్తే రానీ నాతో భువనేశ్వర్ వస్తున్నావు నువ్వు''. అదే మొదటిసారి నువ్వు అనడం– ఆశ్చర్యపోయింది. ''నిన్ను దిగనివ్వను.'' నా వేపు జాలిగా చూసింది. ''నా మీద అప్పుడే అంత హక్కును పెంచుకున్నారా?'' అంది.

''రాత్రంతా ఆలోచనల్తో రెచ్చగొట్టి ఇప్పుడు హఠాత్తుగా మాయమవుతావా?'' మీరా మాట్లాడలేదు. దిగే ప్రయాణికులంతా హడావుడిలో పడ్డారు. ''ఇక్కడ అరగంట పైగా ఆగుతుంది. అలా నడుద్దాం పదండి'' అంది. ''నాకూ మిమ్మల్ని వదిలి పోవాలని లేదు. చిన్నతనంలో చెట్టపట్టాలేసుకు నడిచే భార్యాభర్తల్ని చూస్తూ ఇలాగా నా రోజులూ గడవాలనుకునేదాన్ని. ఇద్దరం భవిష్యత్తును గురించి కలలు కన్నాం. నా జీవితానికి ఈ ఒక్క రాత్రి చాలు''.

''కానీ మీరా! ఈ ఒక్క రాత్రి ఏం ఖర్మ. మన మధ్య ఇలాంటి ఎన్నో రాత్రులు ఉంటాయి. జీవితమంతా నేను నీతో ఉంటాను.''

''ఉండే మనస్సు మీకుంది. కానీ ఉంచుకునే అదృష్టం నాకు లేదు. నాకు లంగ్ కేన్సర్.''

మున్సిపాలిటీ దీపాలు గుప్పుమని ఆరిపోయాయి. నా గొంతు పెగలలేదు. ''కానీ మీరా! మీరా! ఇది ఘోరం.''

''నేనిక్కడే ఆగిపోతాను. నీ ఆపరేషను అయ్యే వరకు ఉంటాను.''

''వద్దు. వీల్లేదు. మీరు వెళ్లాలి. ఇప్పుడే, ఈ బస్సులోనే.''

ఇద్దరం కళ్లనీళ్లు కారుస్తూనే ఉన్నాం.

డ్రైవరు హారన్ మోగిస్తున్నాడు.

• • •

ఈసారి భువనేశ్వర్ వచ్చినప్పుడు కటకంలో ఆగి మీరా చెప్పినట్టే వాకబు చేశాను. డిసెంబర్‌లో మేం అనుకున్నట్టు పెళ్లయితే జరగలేదు కానీ క్రిస్టమస్ రెండు రోజులుండగా మీరా కన్ను మూసింది.

శంభల్‌పూర్ బస్సులో ప్రయాణం చేస్తూ జుజుమురా వచ్చినప్పుడు ఒక్కసారి గుర్తు చెయ్యమని కండక్టరుతో చెప్పాను. కళ్లిప్పేసరికి బస్సు ఇంకా నడుస్తోంది. కండక్టర్‌ని అడిగాను. జుజుమురా వెళ్లిపోయిందన్నాడు.

ఒక అపూర్వమైన అనుభవాన్ని మీరా రూపంలో ప్రసాదించి నా దారి నుంచి సవినయంగా తప్పుకుంది జుజుమురా. •

గొల్లపూడి మారుతీరావు 'జుజుమురా'కు సంక్షిప్త రూపం ఇది. కాలదోషం పట్టనిదే మంచికథ అయితే గనక ఈ కథ ఆ ప్రమాణానికి నిలబడదు. ఇలాంటి ఎన్నో ప్రేమకథలు మనం వినివుండటమే దానికి కారణం. ఒక విషయం మళ్లీ మళ్లీ వాడకంలోకి రావడం వల్ల దాని గొప్పతనం కోల్పోతుంది. ఈ కథ కూడా అదే కోవలోనిది. కానీ గుర్తుంచుకోవాల్సింది, అలాంటి ఎన్నో ప్రేమకథలు సినిమాలుగా రాకముందు 1971లో రాసిందిది. ఆ కారణం వల్లే ఇది ఆ కాలపు ఎందరో పాఠకుల్ని ఆకర్షించింది. సినిమా నటుడు, సినిమా, నాటక, రేడియో రచయిత, పాత్రికేయుడు, కాలమిస్టు, టీవీ ప్రయోక్త అయిన గొల్లపూడి చివరివరకూ 'జీవన కాలమ్' రాస్తూనే వున్నారు. అమ్మ కడుపు చల్లగా ఆయన ఆత్మకథ. సాయంకాలమైంది ఆయన నవల.



గొల్లపూడి మారుతిరావు
14 ఏప్రిల్ 1939
12 డిసెంబర్ 2019


• కొత్త బంగారం

# పుట్టుక వెక్కిరించినప్పుడు

డెబొరా జియాంగ్ స్టయన్ రాసిన, 'ప్రిసన్ బేబీ: ఎ మెమోయిర్'లో, పన్నెండేళ్ళ డెబొరా– అమెరికా, సియాటెల్‌లో ఉండే యూదులైన ఇంగ్లిష్ ప్రొఫెసర్ల జంట దత్తత తీసుకున్న పిల్ల. నవలికకి కథకురాలు డెబొరాయే. ఆమె దత్తు తల్లిదండ్రులు తెల్లవారు. ఆమె చామన ఛాయతో, బహుళజాతి రూపురేఖలున్నది. డెబొరా తన గతం గురించి ప్రశ్నించినప్పుడల్లా, తల్లిదండ్రులు సమాధానం ఇవ్వకుండా దాటవేసేవారు. ఆమె ఆరవ తరగతి చదువుతున్నప్పుడు, ఒకరోజు వారి పడగ్గదిలోకి వెళ్తుంది. 'డెబొరా జనన ధృవీకరణ పత్రాన్ని మార్చేయండి. తను వర్జీనియా జైల్లో ఉన్న, హెరాయిన్ వ్యసనానికి లోనైన తల్లికి పుట్టిందని తెలియకూడదు. సియాటెల్‌లోనే పుట్టిందని రాయండి. ఆమె మా హృదయాల్లో పుట్టిన పిల్లే కదా! తనకు నిజం తెలిస్తే, తల్లి గురించీ, తను రెండు మూడేళ్ళున్న పెంపుడిళ్ళ గురించీ ప్రశ్నిస్తుంది' అంటూ, దత్తు తల్లి తన లాయరుకు రాసిన ఉత్తరం కంటబడుతుంది.

'నా తల్లిదండ్రుల పడగ్గదిలో టేబుల్ అరలో ఉన్న ఆ కాగితాన్ని చదివి, వెనక్కి తోసేశాను. అద్దంలో నన్ను నేను చూసుకున్నప్పుడు, నా శరీరం అతిబరువుగా అనిపించింది' అంటారు రచయిత్రి.

ఆమె తనను తాను ద్వేషించుకుంటుంది. 'జైల్లో ఉన్నవారిని ప్రేమించేదెవరు?' అని ప్రశ్నించుకుంటుంది. ప్రతీ అవసరాన్నీ ప్రేమతో తీర్చే పెంపుడు తల్లి గానీ, తనకు రెండు సంవత్సరాల ముందట, తల్లిదండ్రులు దత్తత తీసుకున్న అన్న తెల్లరంగు జోనాథన్ తనను ముద్దుగా చూసుకుంటాడని గానీ గుర్తు రాదు. పైగా, ఊచల వెనకున్న జీవసంబంధి అయిన తల్లిని కలుసుకోవాలన్న కోరిక హెచ్చవుతుంది.



ప్రిసన్ బేబీ
ఎ మెమోయిర్



డెబొరా జియాంగ్ స్టయన్

'1960ల వరకూ, వెయ్యి తెల్ల కుటుంబాలు కూడా నల్ల పిల్లలను దత్తు తీసుకోలేదని దత్తత పరిశోధన సర్వేక్షణలు సూచిస్తాయి. నా మార్గదర్శక తల్లిదండ్రులు నన్ను దత్తత తీసుకుని, ఆ పరిమితులను దాటారు. నా పంచదార పాకపు రంగు, బొత్తాం ముక్కు, బాదం ఆకారపు కళ్ళ గురించి అడిగినప్పుడల్లా– తను నన్ను ప్రేమిస్తోందనీ, నేను కుటుంబంలో భాగమే అనే చెప్పేది అమ్మ. నేనిప్పుడు, దేనికీ భాగం అనుకోవడం లేదని చెప్పాలంటే భయం వేసేది' అంటారు.

ఆ సంఘటన తరువాత, రక్తంలో హెరాయిన్నుండి పుట్టి, తొలి ఏడాది ఖైదులో ఆ వాతావరణంలోనే గడిపిన డెబొరా– తన సొంత తల్లిని అనుకరిస్తూ, సులభంగానే మాదక ద్రవ్యాలకు అలవాటుపడతారు. 19 ఏళ్ళొచ్చేటప్పటికి వాటిని సరఫరా కూడా చేసేవారు. దత్తు తల్లిదండ్రులతో సాన్నిహిత్యం కోల్పోతారు.

'మాదక ద్రవ్యాలు సామాజిక వినోదం, మద్యం కేవలం పానీయం కావు నాకు. అవి నాకు మత్తు కలిగించే మాసికలా, మందులా అయి స్వస్థపరిచి– స్వేచ్ఛ కలిగించాయి. ఎడ్రినలిన్ వేగం మిగతా ప్రతీదాన్నీ ముంచేసేది.'

డెబొరా తన 30లకు చేరినప్పుడు, వ్యసనం వదిలిపెట్టడానికి అవసరమైన సహాయాన్ని పొందారు. పెంపుడు కుటుంబంతో తిరిగి సంబంధం పెంపొందించుకుని, తన జీవితపు ఉనికితో రాజీపడ్డారు. తను పుట్టిన జైలుకెళ్ళి– అక్కడ సహాయం అందించడం, ఉపన్యాసాలివ్వడం మొదలుపెట్టారు. అప్పటికి ఆమె సొంత తల్లి మరణించి ఉంటారు. పుస్తకపు చివర్న, తన కూతుళ్ళ గురించి ప్రస్తావిస్తారు రచయిత్రి. అయితే, పెళ్ళి గురించి గానీ, పిల్లలెప్పుడు పుట్టారో అన్న వివరాలు గానీ ఇవ్వరు.

2012లో– జైళ్ళలో ఉండే స్త్రీలకు అక్షరాస్యత తను అందించే, 'అన్‌ప్రిజన్ ప్రాజెక్ట్' ప్రారంభించారు డెబొరా. 'వారు జైలు నుండి బయట పడి, తిరిగి వెనక్కి వచ్చే అగత్యం లేకుండా, విజయవంతమైన జీవితం గడిపేందుకు– ఏదో ఒక ప్రావీణ్యత నేర్పే పనిది'. ఇప్పుడు పేరు పొందిన వక్తయిన యీ రచయిత్రి, తన ఉపన్యాసాలను అమెరికా జైళ్ళ సంస్కరణ, పట్టుదల, రెండవ అవకాశాలు, ఆశకుండే శక్తిపైన కేంద్రీకరిస్తారు.

176 పేజీలుండి, నిజాయితీగా రాసినదనిపించే, స్ఫూర్తినిచ్చే ఈ ఆశ్చర్యకరమైన సంస్మరణను బీకన్ ప్రెస్ 2014లో ప్రచురించింది.

◆ కృష్ణ వేణి

• ప్రతిధ్వనించే పుస్తకం

# మంచి కథను గుర్తించనీయని ఉద్దేశ భ్రమ

అనుశీలనం, నవలాశిల్పం, కథాశిల్పం, విమర్శాశిల్పం లాంటి పుస్తకాలతో తెలుగు సాహిత్య విమర్శకు, ముఖ్యంగా కథాసాహిత్యానికి మంచి భూమికను ఏర్పరిచారు వల్లంపాటి వెంకటసుబ్బయ్య. 1995లో వచ్చిన ఆయన కథాశిల్పంకు 1999లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. ఆ పుస్తకంలో మంచి కథను అంచనా గట్టడానికి భావజాలం అడ్డుకాకూడదనీ, ఉద్దేశం మంచిదైనంత మాత్రాన రచన మంచిదైపోదనీ ఇలా వ్యాఖ్యానించారు:



వల్లంపాటి వెంకటసుబ్బయ్య

తటస్థ చరిత్రలాగే తటస్థ సాహిత్యం కూడా ఉండదు. చరిత్రను చదవటానికి ముందుగా చరిత్రకారుణ్ణి చదవాలని ఇ.హెచ్.కార్ సూచించాడు. అలాగే సాహిత్యం చదవటానికి ముందు దాన్ని సృష్టించిన సాహిత్యకారుణ్ణి చదవటం మంచిది. సాహిత్యం నుంచి భావజాలాన్నీ– మరీ ముఖ్యంగా రచయిత భావజాలాన్నీ– దూరం చేసి పరిశీలించటం మంచిపద్ధతి కాదు. కానీ రచయిత భావజాలానికీ, ఉద్దేశానికీ అతి ప్రాముఖ్యత ఇచ్చి, రచన విలువను నిర్ణయించటం కూడా తప్పు పద్ధతే. అంటే ''రచయిత ఈ ఉద్దేశంతో రాశాడు, ఉద్దేశం గొప్పది, కాబట్టి రచన గూడా గొప్పది,'' అన్న సమీకరణం పొరపాటు. దీన్ని నవ విమర్శకులు ''ఉద్దేశ భ్రమ'' (ఇంటెన్షనల్ ఫాలసీ) అన్నారు. రచయిత ఉద్దేశం ఎంత గొప్పదైనా కావచ్చు. అది రచనలో కళాత్మకంగా వ్యక్తం కానంతవరకూ దానికి విలువ లేదు. కథావస్తువు గమ్యమే ఉద్దేశం. ఉద్దేశాన్ని కళగా మార్చే పరుసవేది శిల్పం లేదా రూపం. ఈనాడు తెలుగు సాహిత్య విమర్శలో ''ఉద్దేశ భ్రమ'' చాలా ప్రముఖంగా కనిపిస్తుంది. అందుచేత విమర్శకుడు ఆ భ్రమలో పడకుండా ఉండాలంటే కథాక్రమం, కథాంశం, ఉద్దేశం కళగా మారే క్రమాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

• మీకు తెలుసా?



'కవిత్వం ఒక స్వప్నక్రియ. కవిత్వం ఒక రహస్య క్రీడ. అంతా ఒక 'చిత్కళ'. నేను వ్రాసిన పద్యాలన్నీ చిత్తుప్రతులే. ఎప్పుడో రాసిన పద్యాన్ని గూర్చి ఇప్పటికీ ఆలోచిస్తూవుంటాను. అవసరమైతే మార్పులు కూడా' అన్న కవి అజంతా అసలు పేరు పెనుమర్తి విశ్వనాథ శాస్త్రి. తన జీవితకాలంలో సుమారు 40 కవితలు మాత్రమే రాసిన ఆయన కవితాసంపుటి 'స్వప్నలిపి'. దీనికి 1997లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది.

• కవిత

# గోష్ఠి



ప్రతి సాయంత్రమూ మనం
ఆ టేబుల్ చుట్టూ చేరతాం
మీరందరూ ఏదేదో మాట్లాడుతూ ఉంటారు
టేబుల్ మీదా టేబుల్ చుట్టూ
శబ్దాలు
వడగళ్లలాగా టపటపా రాలుతూ ఉంటాయి
అర్థ శూన్యమైన ఆ శబ్దాలను చూస్తూ
కూచుంటాను
మనల్ని మనం ధ్వంసం చేసుకుని
మనల్ని మనం తిరిగి కలుసుకోవడానికి కదా
మన గోష్ఠి?
బుసబుసమని పొంగే ద్రవాలూ
గాజు గ్లాసులు వొకదాన్నొకటి తాకినప్పుడు
ఎప్పటిదో
ఆదిమ సంగీతంలోని ఒక చిన్ని స్వరం కదిలినట్టు
గుండెను తట్టే సంగీతమూ
కానీ
నన్ను నేను కోల్పోయిందెక్కడ?
నన్ను నేను తిరిగి కలుసుకున్నదెక్కడ?

మిత్రులారా
కాసేపు మౌనంగా కూచుందాం
నిశ్శబ్దమే
నిస్సందేహంగా ఏకాంత మౌన సంభాషణే
మనల్ని మనకు పరిచయం చేస్తుంది.

◆ పవని ఆర్.భానుమూర్తి

### రారండోయ్

- ధనికొండ హనుమంతరావు శతజయంతి వేడుకలు, మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 16న రోజంతా జరగనున్నాయి. ధనికొండ పుస్తకాల ఆవిష్కరణ జరగనుంది. ఆవిష్కర్త: కె.శ్రీనివాస్.
- నరేష్‌కుమార్ సూఫీ కవిత్వ సంపుటి 'నిశ్శబ్ద' పరిచయ సభ డిసెంబర్ 17న సా. 6 గం.కు రవీంద్రభారతి మినీ హాల్‌లో జరగనుంది. అధ్యక్షత: విజయ్ కుమార్ కోడూరి.
- అఫ్సర్ 40 ఏళ్ల సమగ్ర కవిత్వం 'అప్పటినుంచి ఇప్పటి దాకా' ఆవిష్కరణ సభ డిసెంబర్ 20న సా. 5 గంటలకు సాలార్‌జంగ్ మ్యూజియం లెక్చర్ హాల్‌లో జరగనుంది. ప్రచురణ: చిత్రలేఖ పబ్లికేషన్స్.
- నామిని సుబ్రమణ్యం నాయుడు సంపాదకత్వం వహించిన 'ఒక ఆలోచన, ఒక అవలోకన' పుస్తకాన్ని భూమన కరుణాకరరెడ్డి డిసెంబర్ 20న సాయంత్రం 5 గంటలకు తిరుపతిలో ఆవిష్కరిస్తారు. ప్రచురణ: వరదరాజ నగర్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ. నిర్వహణ: మానవ వికాస వేదిక.
- చరిత్ర ఆధారిత కాల్పనిక సాహిత్యంపై సాయి పాపినేని రచనల నేపథ్యంలో చర్చ డిసెంబర్ 21న మధ్యాహ్నం 3 గంటలకు హుస్సేన్ సాగర్లో, తెలంగాణ టూరిజం వారి బోటులో జరగనుంది. సుధాకర్ ఉణుదుర్తి, మహమ్మద్ ఖదీర్‌బాబు, జ్యోతి పి. వక్తలు. సమన్వయం: నరేశ్ నున్నా. రిజిస్ట్రేషన్ కొరకు: 9845034442
- రివాజు: తెలంగాణ కథ–2018 ఆవిష్కరణ డిసెంబర్ 22న ఉదయం 10:30కు హన్మకొండలోని రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో జరగనుంది. సంపాదకులు: సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్. ఆవిష్కర్త: బన్న అయిలయ్య. నిర్వహణ: సృజన లోకం, సింగిడి.
- శివే గారి 'కరిగిపోవే కన్నీటి చుక్క' ఆవిష్కరణ డిసెంబర్ 22న హైదరాబాద్, చింతల్ సిద్దార్థ పాఠశాలలో ప్రముఖుల చేతులమీదుగా జరగనుంది.
- సింగమనేని నారాయణ పేరుతో ఏర్పాటు చేసిన సాహిత్య పురస్కారానికి జనవరి 2018 నుండి డిసెంబరు 2019 వరకు ప్రచురించిన కథల సంపుటులను ఆహ్వానిస్తున్నారు. పురస్కార నగదు పదహారు వేలు. సంపుటాల మూడు ప్రతుల్ని జనవరి 15 లోగా పంపాల్సిన చిరునామా: అధ్యక్షులు, ఏరువాక సాహిత్య సాంస్కృతిక సంస్థ, 7-1-507, ఎన్జీవో కాలనీ, బద్వేల్–516227. వైఎస్ఆర్ కడప. ఫోన్: 7013736729
- నాలుగవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో విజయవాడలోని పిబి సిద్ధార్థ కళాశాలలో జరగనున్నాయి. కృష్ణా జిల్లా రచయితల సంఘం సహకారంతో 'ప్రపంచ తెలుగు రచయితల సంఘం 2019' ఈ సభలను నిర్వహిస్తోంది. గౌరవాధ్యక్షులు: మండలి బుద్ధప్రసాద్. తెలుగుకు సంబంధించిన పలు అంశాలు చర్చకు రానున్నాయి. వివరాలకు: prapanchatelugu.com వెబ్‌సైట్ చూడొచ్చు. కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచందు ఫోన్: 9440172642
- డా.పసునూరి రవీందర్ సాహిత్య విమర్శ సంపుటాలు ఇమ్మతి, గ్లోబలైజేషన్ ఆవిష్కరణ సభ ఈ నెల 21న రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్ నందు జరుగును. ఆవిష్కర్త: డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, నిర్వహణ: సింగిడి.


మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం ॥ 16-12-2019

**అతి చిన్నవయసులోనే నృత్య వేదికలను ఘల్లుమనిపించిన సుధాచంద్రన్.. తన అడుగుల కరతాళ ప్రతిధ్వనులను పూర్తిగా వినకుండానే పదహారేళ్ల వయసులో కాలును పోగొట్టుకున్నారు. పోయింది కాలే కానీ, ఆమె నిబ్బరం కాదు. ఒంటికాలి మీదే దీక్ష పట్టారు. నాట్యతపస్విని అయ్యారు. అనేక విజయ శిఖరాలను అధిరోహించారు. నర్తకిగా, నటిగా, సమాజ సేవకురాలిగా ఎన్నో పాత్రలు పోషించారు. ఇప్పుడు మళ్లీ మరొకసారి తెలుగులో చిన్ని తెర మీదకు వచ్చారు. ఈ సందర్భంగా తనను కలిసిన సాక్షితో ఆత్మీయంగా ముచ్చటించారు.**

# స్ఫూర్తిసుధ


సుధాచంద్రన్

గంగానది జీవధార. ఎంత ప్రశాంతంగా ఉంటుందో ఉగ్రరూపం దాలిస్తే అంత భయానకంగా ఉంటుంది. అందుకేనేమో ఈ దేశంలో స్త్రీని గంగానదితో పోలుస్తారు. కల్మషమైన లోకాన్ని స్వచ్ఛంగా మార్చే శక్తి స్త్రీకే ఉంది. అందుకే కావచ్చు సుధ తరచు 'గంగ' కాన్సెప్ట్‌తో నృత్య రూపకాలు ప్రదర్శిస్తుంటారు. ఈ ముప్పై ఏళ్లుగా నృత్యంతో పాటు ఆమె హిందీ, మలయాళం, తమిళం, కన్నడ సినీ, టీవీ రంగాలలో పని చేస్తున్నారు. ''ఇప్పుడిక 'నెంబర్ వన్ కోడలు' గా మీ వీక్షణకు నోచుకుంటున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది'' అంటూ తన జీవిత ప్రవాహంలోని మలుపుల తలపుల్లోకి వెళ్లిపోయారు సుధ.

### కూతురే పుట్టాలని..!

అమ్మానాన్నలకు ఒక్కతే కూతుర్ని. నాన్న చంద్రన్‌ది కేరళ అయినా ఉద్యోగరీత్యా ముంబైలో స్థిరపడ్డారు. అమ్మ తంగం గృహిణి. శాస్త్రీయ సంగీతకారిణి. కొన్నాళ్లు క్లాసికల్ డ్యాన్సర్ సుధా దొరైవాన్ దగ్గర స్టెనోగ్రాఫర్‌గా వర్క్ చేసింది. కూతురు పుడితే సుధ అని పేరు పెట్టుకోవాలని, డ్యాన్సర్‌ని చేయాలని కలలు కంది. అందుకే నాకు మూడేళ్ల వయసు నుంచే భరతనాట్యం నేర్పించింది. పదహారేళ్ల వయసు వచ్చేటప్పటికే నేను చిన్న చిన్న నృత్య ప్రదర్శనలు ఇవ్వగలిగానంటే అది అమ్మ ప్రయత్నము, పట్టుదలే.

ఓ రోజు కారులో ఇంటికి వస్తుంటే జరిగిన ప్రమాదంలో కుడికాలును పోగొట్టుకున్నాను. ప్రపంచం ఒక్కసారిగా చీకటైపోయింది. నాకిక భవిష్యత్తే లేదనిపించింది. ఆ సమయంలో.. ''నువ్వు నిలబడాలి.. నువ్వు డ్యాన్స్ చేయాలి.. '' అంటూ అమ్మానాన్న ఇచ్చిన మనోబలం సామాన్యమైనది కాదు. నాన్న దిన, వార పత్రికలు తెచ్చి ఇచ్చి, వాటిల్లోని ఇన్‌స్పైరింగ్ స్టోరీలను చదవమనేవారు. టీవీలో వచ్చే ప్రతీ సమాచారాన్ని తెలుసుకోమనేవారు. ఏ చిన్న సమాచారం ఎవరు అడిగినా చెప్పేలా నన్ను తీర్చి దిద్దారు. ఇప్పటికీ నాకు చదివే అలవాటు పోలేదు. అమ్మ కూడా దిగులు పడటం మానేసి ధైర్యం తెచ్చుకొని నన్ను నిలబెట్టింది. కృత్రిమ కాలుతో రెండేళ్ల సాధన. రాత్రి–పగలు తేడా లేదు. డ్యాన్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడు విపరీతమైన నొప్పి, ఇన్ఫెక్షన్లతో నరకం చూశాను. తర్వాత రెండేళ్లకు ఓ రోజు కృత్రిమ కాలుతో మొదటిసారి స్టేజి మీద మూడుగంటల సేపు నిర్విరామ ప్రదర్శన ఇచ్చాను. హాల్లో వెయ్యిమంది లేచి నిల్చొని తమ చప్పట్ల హోరుతో నాకు అభినందనలు తెలియజేశారు. ఆ సమయంలో మాటల్లో చెప్పలేనంత ఉద్విగ్నతకు లోనయ్యాను. ఉప్పెనలా ముంచేసిన కష్టంలోంచి ఒక్కసారిగా బయట పడినట్లయింది.

### చిన్న వయసులోనే!

- సుధ పందొమ్మిదేళ్ల వయసులో 'మయూరి' సినిమా ద్వారా నాట్యమయూరిగా తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని పొందారు.
- సుధ జీవిత చరిత్ర 8–11 ఏళ్ల వయసు స్కూలు పిల్లలకు అనేక రాష్ట్రాలలో పాఠ్యాంశమయింది.
- ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఇన్‌వెర్టిస్ విశ్వవిద్యాలయం సుధను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.

### అత్తింటి అదనపు శక్తి

ఇండియా, సౌదీ అరేబియా, అమెరికా, కెనడా, ఖతార్, కువైట్, బహ్రెయిన్, ఒమన్‌లలో నృత్య ప్రదర్శనలు. దాదాపు అన్ని భాషా చిత్రాలలో నటిగా గుర్తింపు. ఒక కష్టాన్ని అధిగమించాక నాకు వచ్చిన అవకాశాలు ఎన్నో. వాటిల్లో ఒక్కదానినీ వదులుకోలేదు. సినిమాలు చేస్తున్నప్పుడే అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రవి డంగ్‌తో పరిచయం ఏర్పడింది. తనది బెంగాలీ కుటుంబం. మానసికంగా దగ్గరయ్యాం. పెళ్లి చేసుకోవాలని అనుకున్నాం. అనుకున్న రెండు రోజుల్లోనే పెద్దల అంగీకారంతో పెళ్లయ్యింది. నేను దక్షిణాది అమ్మాయిని, తను ఉత్తరాది అబ్బాయి. పద్ధతుల్లో పూర్తి వ్యత్యాసాలున్న కుటుంబ నేపథ్యాలు అయినా అత్తింటివారంతా నన్ను అక్కున చేర్చుకున్నారు.


● భర్త రవితో సుధాచంద్రన్

### నెంబర్‌వన్ కోడలు

జీ తెలుగులో ఈ వారమే మొదలైన ఈ సీరియల్ ద్వారా 'వాగ్దేవి'గా పరిచయం అవుతున్నాను. విద్యాసంస్థలను నడిపే వ్యక్తిగా తన చుట్టూ ఉన్నవారంతా చదువులో నెంబర్‌వన్‌గా ఉండి తీరాలనుకుంటుంది వాగ్దేవి. అలాంటి వాగ్దేవి ఇంట అక్షరం ముక్క రాని కోడలు అడుగుపెడుతుంది. చేస్తున్న పనిలో నెంబర్ వన్‌గా ఉండాలనే నా తపనకు తగ్గట్లు వచ్చిన అవకాశం ఇది'' అంటూ ముగించారు సుధాచంద్రన్.

జీవితంలో వచ్చే సవాళ్లు ఒక్కోసారి పెను ఉప్పెనలా ముంచేస్తాయి. ఆ ఉప్పెన నుంచి ఉవ్వెత్తున లేవాలంటే పోరాటం చేయాలి. ఆ పోరాటంలో నిలబడిన శక్తి సుధాచంద్రన్. నేర్చుకోవాలనుకునేవారికి ఆమె జీవితం ఎప్పటికీ ఓ కొత్త పాఠం.

– నిర్మలారెడ్డి

ఫొటో: శివ మల్లాల

## 1వ పాశురం

**మార్గళి త్తింగళ్ మది నిఱైంద నన్నాళాల్**
**నీరాడ ప్పోదువీర్ పోదుమినో నేరిళైయీర్**
**శీర్ మల్గుం ఆయ్ ప్పాడి చ్చెల్వ చ్చిఱుమీర్గాళ్**
**కూర్వేల్ కొడుందొళిలన్ నందగోపన్ కుమరన్**
**ఏరాంద కణ్ణి యశోదై ఇళమ్ శింగం**
**కార్మేని చ్చెంగణ్ కదిర్మదియం పోల్ ముగత్తాన్**
**నారాయణనే నమక్కే పఱైతరువాన్**
**పారోర్ పుగళప్పడిందేలోర్ ఎమ్బావాయ్**

నేటినుంచి ధనుర్మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా మహాభక్తురాలైన ఆండాళ్ తిరుప్పావై రూపంలో శ్రీ రంగనాథస్వామికి సమర్పించిన ఈ పాశురాల నీరాజనం పాఠకులకోసం రోజుకొకటి చొప్పున అందిస్తున్నాం.



మార్గళి మాసం, నిండు చంద్రుడి పండు వెన్నెల షోడశ కళలతో వృద్ధి పొందే కాలం, బ్రహ్మముహూర్తంలో, పూర్తిగా సూర్యోదయం కాక మునుపే స్నానమాడ బోదాము రండి చెలులారా అని పిలుస్తున్నది ఆండాళ్ . యమునా నదిలో మునకలు వేస్తే చాలదు, భగవద్గుణ గానంలో , పరమాత్ముడి అనంతకళ్యాణ గుణసాగరంలో మునిగి మనలో పేరుకున్న పాపపంకిలాన్ని సమూలంగా వదిలించుకునే స్నానం అని ఆండాళ్ చెప్పకనే చెబుతున్నది. ఈ పవిత్ర వ్రతానికి వలసిన యోగ్యత ఒక్కటే – భగవానుని తెలుసుకోవాలనే యెఱుక మాత్రమే !

పైరుపంటలతో విలసిల్లే, పాడికుండలు పొంగిపొర్లే లక్ష్మీప్రదమైన గోకులంలో గోపికల వలె మనమందరమూ కృష్ణానురక్తులం కావాలి అని చెలులతో చెబుతున్నది ఆండాళ్. నారాయణుడే కృష్ణుని రూపాన మన మధ్య వెలసి ఉన్నాడు. శుద్ధసాత్త్విక మూర్తి నందగోపుడు తన కుమారుడు చిన్ని కృష్ణుడికి కావిలి కాస్తూ , అసురసంహారం కోసం బల్లెం పూనినవాడై, కత్తి తిప్పుతూ ఉంటాడు కదా. బాలకృష్ణుడు సింహంపిల్లలాగా యశోదమ్మ వడిలో వర్ధిల్లుతున్నాడు. ఆ దివ్యబాలుడు నల్లని కారు మేఘ ఛాయలో, చెంగల్వల వంటి ఎర్రని కనుకొలుకులతో, సూర్యచంద్రుల కాంతి మేనిలో ప్రస్ఫుటమౌతూండగా తన అల్లరి, ఆగడాలతో వాత్సల్యమూర్తియైన తల్లి యశోద కన్నులు అద్భుతాశ్చర్యాలతో వెడల్పు కావిస్తాడు. ఈ కృష్ణుడే మన రక్షకుడు సుమా! నారాయణ మంత్రమహిమను బోధించి, ఆయన మాత్రమే మనకు 'పర' అనే (పరతత్త్వాన్ని) భేరీ వాయిద్యాన్ని ప్రసాదించగలడు అని నమ్మబలుకుతోంది ఆండాళ్.


– శ్రీదేవి మురళీధర్

## ● ముగ్గు-ముచ్చట



25 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు


బాలందేవి,
తణుకు
పశ్చిమ గోదావరి జిల్లా




సుగుణ
అనంతపురం

20 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు




### ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
muggulu.sakshi@gmail.com

## చెట్టు నీడ

# తిరిగి వచ్చినవాడు



ఒక తండ్రికి ఇద్దరు కుమారులున్నారు. వారిలో చిన్నవాడు ఆస్తిలో తనకు వచ్చే భాగాన్ని తనకు ఇవ్వమని తండ్రిని అడిగాడు. తండ్రికి ఆస్తిని పంచడం ఇష్టం లేకున్నా పంచాడు. అయితే చిన్నవాడు కావడం వల్ల ఆ ఆస్తిని ఎలా వాడాలో తెలియని ఆ కుమారుడు తనకున్న సంపదని తీసుకుని ఆ ప్రాంతం నుండి వెళ్లిపోయి తన ఆస్తినంతటినీ చెడ్డ పనులు చేసి పోగొట్టుకున్నాడు. దాంతో చేసేదేం లేక ఆ దేశంలో పందులను మేపే పనిని చేస్తూ పందులు తినే పొట్టుతో కడుపు నింపుకుంటూ ఎంతో వేదననుభవించాడు. చాలా బాధ పడ్డాక ఆ కుమారుడికి తన తండ్రి, తన ఇల్లు అన్నీ గుర్తుకొచ్చాయి. మళ్లీ తను అక్కడకు వెళితే బాగుంటుందనే ఆలోచన రావడంతోనే తిరిగి తన తండ్రి వద్దకు వెళ్లిపోయాడు. ఆ కుమారుడిని దూరం నుంచే చూసిన తండ్రి.. కుమారునికి ఎదురు వెళ్లి అతడిని ముద్దు పెట్టుకుని, తన దాసులతో కుమారుడు వచ్చాడని చెప్పి విందు చేయించాడు. అయితే ఆ తండ్రి వద్దనే ఉన్న పెద్ద కుమారుడికి తండ్రి చేస్తున్న ఆ పని నచ్చలేదు. ఆస్తి మొత్తాన్ని పోగొట్టి వచ్చిన వాడికోసం విందు చేసినందుకు అలిగాడు. అదే మాట తండ్రిని అడిగాడు. అందుకు ఆ తండ్రి ఇలా చెప్పాడు. (లూకా 15:32) ''నీ తమ్ముడు చనిపోయి బతికాడు, తప్పిపోయి దొరికాడు. కనుక మనం ఆనందించాలి'' అన్నాడు. తన పెద్ద కుమారుడికి దేనిని ప్రేమించాలో నేర్పాడు.

మనం కూడా ధనానికి ప్రాముఖ్యతనిస్తున్నామా? ఆలోచించుకోవాలి. వస్తు, సంపదలకు ఇచ్చే ప్రాముఖ్యం మనం మనుషులకు ఇవ్వడం లేదు. ఇక్కడ ఆ తండ్రి ఆస్తికి ప్రాముఖ్యతను ఇవ్వడం లేదు. కుమారుడు ప్రాణాలతో తిరిగి రావడమే చాలా గొప్ప అనే ఆ తండ్రి ప్రేమ ఈ రోజు మనకు అనేక పాఠాలు నేర్పుతుంది.

– బెల్లంకొండ రవికాంత్

## రెండు వైపులు

**ఉద్యోగం చేస్తూ పిల్లల్ని పెంచుతున్న తల్లులు ఓ అరగంట కునుకు తీసే అవకాశం కోసం ముఖం వాచిపోతున్నారు. ఇంటి పట్టున ఉండి ఇంటిని, పిల్లల్ని చక్కబెట్టుకుంటున్న మహిళలు తమకంటూ ఒక గుర్తింపు కోసం పరితపిస్తున్నారు. ఈ వైరుధ్యం ఏమిటి? వాళ్లెందుకు ఉద్యోగాలు మానాలని అనుకుంటున్నారు? వీళ్లెందుకు చిన్న ఉద్యోగంలోనైనా చేరాలని అనుకుంటున్నారు?!**

# వాళ్లెందుకు ▼ ఉద్యోగం మానాలనుకుంటున్నారు?



# వీళ్లెందుకు ▼ ఉద్యోగంలో చేరాలనుకుంటున్నారు?



ఈ తరం మహిళల్లో అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఏ మాత్రం వెనుకడుగు వేయని మానసిక స్థయిర్యం ఉంటోంది. సవాళ్లను ఎదుర్కోవడంలో వెరవని ధైర్యమూ ఉంటోంది. అయితే తల్లిగా తాను పిల్లలను మిస్ అవుతున్నాననే ఆవేదన ఉద్యోగినుల్లో సంఘర్షణకు కారణమవుతోంది. 'ఎల్లెనామిక్స్' సంస్థ నిర్వహించిన ఓ సర్వేలో.. ఉద్యోగం చేస్తున్న తల్లుల్లో 55 శాతం మంది ఉద్యోగం మానేస్తే బావుణ్ననుకుంటున్నారని వెల్లడైంది! ఇంటి పట్టున ఉండి ఉదయం పిల్లల్ని స్కూల్లో దించడం, మధ్యాహ్నం ఓ అరగంట నడుం వాల్చి విశ్రాంతి తీసుకోవడం, సాయంత్రం వెళ్లి తీసుకురావడంలో సంతోషాన్ని కోరుకుంటున్నామని ఆ ఉద్యోగినులు తెలిపారు. సరిగ్గా ఇదే పనులు చేస్తున్న గృహిణుల్లో మాత్రం 65 శాతం మంది.. 'తన జీవితం ఏంటి? ఉదయం లేచినప్పటి నుంచి ఇంట్లో వాళ్లకు అన్నీ అమర్చి పెట్టడం, వండి వడ్డించడమేనా? ఇందుకోసమేనా స్కూలు, కాలేజీ, యూనివర్సిటీలలో అంతంత చదువుకున్నది? జీవితాన్ని ఏ మాత్రం ఫలవంతంగా మలుచుకోకుండా నిరర్థకంగా గడిపేయాల్సి వస్తోంది అని ఆవేదన చెందుతున్నారు. 'ఉద్యోగినులైతే ఉదయమే చక్కగా తయారై బయటకు వెళ్తారు. సొసైటీలో ఎంతోమంది చదువుకున్న వాళ్లను కలుస్తారు. నిరంతరం వారి మెదళ్లకు పని చెప్తూ రోజంతా చురుగ్గా ఉంటారు. వారికి తమ భావాలను షేర్ చేసుకోవడానికి మంచి వేదికలుంటాయి. తమకు మాత్రం ఇంటి నాలుగ్గోడలు, వాటిని దాటి బయటకు వస్తే స్కూలు గేటు దగ్గర పిల్లల కోసం పడిగాపులు కాయడంతోనే జీవితం గడిచిపోతోంది. కనీసం సామాజిక జీవనం కూడా కరువవుతోంది' అని వారు వాపోతున్నారు.

### రెండు బాధ్యతల నడుమ

తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగం చేస్తున్న కుటుంబాల్లో పిల్లలకు అనారోగ్యం వస్తే తల్లులు ఉద్యోగానికి సెలవు పెట్టి పిల్లలను చూసుకోవాలి. సెలవు పెట్టే తండ్రుల శాతం చాలా తక్కువ. ఆ సమయానికి తల్లి కూడా అనారోగ్యంతో బాధపడుతున్నా సరే ఆ ఇంటి మగవాళ్లు సెలవు తీసుకుని భార్యాపిల్లలను చూసుకోరు. ఆ పని తల్లిదే అన్నట్లు ఉంటారు. ఆఫీసులోనూ అంతే. మహిళ అయిన కారణంగా ఒంట్లో బాగోలేదని చెప్పి ఆఫీస్ పనిలో ఎవరూ వెసులుబాటు కల్పించరు కదా? ఉద్యోగంలో ఉన్న మగవాళ్లకైనా ఆడవాళ్లకైనా ఉద్యోగ బాధ్యతలు సమానమే. ఉద్యోగినులు మాత్రం అటు ఆఫీస్, ఇటు ఇల్లు అంటూ నలిగిపోతున్నారు. నిద్రలేమి అనేది వారి సర్వ సాధారణమైన సమస్యగా మారింది. ఒత్తిడికి లోను కావడం, చిరాకు, ఆందోళన, మానసిక అలజడి, నిరంతరం అలసటకు లోనుకావడం... వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఉద్యోగం మానేస్తే బావుణ్ననే ఆలోచనకు రావడానికి ఇవన్నీ కారణాలే.. అంటున్నారు ఉద్యోగినులు.

### గృహిణులకు అదీ లేదు

ఉద్యోగినులు కనీసం తమ ఉద్యోగాన్ని వదిలేయడమనే ఒక ఆప్షన్‌ని ఎంచుకోగలుగుతున్నారు. అదే గృహిణుల విషయానికి వస్తే నిస్పృహతో జీవితాన్ని చాలిస్తున్న ఘటనలూ జరుగుతున్నాయి. 2014లో దేశంలో ఇరవై వేల మంది గృహిణులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు నేర నివేదికలు తెలుపుతున్నాయి. ఆ ఏడాది రైతుల ఆత్మహత్యలకంటే కూడా నాలుగు రెట్లు ఎక్కువగా గృహిణుల ఆత్మహత్యలు సంభవించాయి. అవి కూడా తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ వంటి చదువుకున్న రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉన్నాయి. మహిళల చదువు పట్ల పెద్దగా ఆసక్తి చూపించని ఉత్తరప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో ఉన్న మహిళలకు తాము జీవితాన్ని నిరర్థకంగా గడిపేస్తున్నామనే ఆలోచన కూడా రాని పరిస్థితి ఉంది. దాంతో జీవితం మీద వైరాగ్యం, ఆత్మహత్యకు పాల్పడడం వంటి అవాంఛనీయ ఘటనలు అక్కడ చాలా తక్కువ. అది ఇంకా దారుణమైన పరిస్థితి. జీవచ్ఛవాల్లా పడి ఉండటమే.

– మంజీర

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ సోమవారం 16-12-2019



మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. ఈ చిత్రం ప్రీ – రిలీజ్ వేడుక జనవరి 5న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరగనుంది. 'దిల్' రాజు, రామబ్రహ్మం సుంకర, మహేశ్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 11న రిలీజ్ కానుంది.

● మహేశ్‌బాబు




● లావణ్యా త్రిపాఠి

## స్ట్రైకింగ్‌కి సిద్ధం

హాకీ స్టిక్ పట్టుకొని గ్రౌండ్‌లో సిద్ధంగా ఉన్నారు లావణ్యా రావ్. బాల్ రావడం ఆలస్యం నేరుగా గోల్ కొట్టాలని వెయిట్ చేస్తున్నారు. తన గేమ్‌ని చూడటానికి కొంచెం టైమ్ ఉంది. సందీప్ కిషన్, లావణ్యా త్రిపాఠి జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'ఏ1 ఎక్స్‌ప్రెస్'. డెన్నిస్ జీవన్ కను కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, సందీప్ కిషన్, దయా పన్నెం నిర్మిస్తున్నారు. హాకీ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో సందీప్, లావణ్య హాకీ క్రీడా కారులుగా కనిపిస్తారు. ఆదివారం లావణ్య త్రిపాఠి పుట్టినరోజు. ఈ సందర్భంగా సినిమాలో తన లుక్‌ను రిలీజ్ చేశారు. ''లావణ్య రావ్ అనే హాకీ ప్లేయర్ పాత్ర చేయడం చాలా సంతోషంగా, ఎగ్జయి టింగ్‌గా ఉంది. ఈ పాత్ర నా కెరీర్‌లో స్పెషల్‌గా ఉండబో తోంది'' అన్నారు లావణ్య. ఈ చిత్రానికి సంగీతం: హిప్ హాప్ తమిళ, సహ–నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

# ఆ స్ఫూర్తితోనే రూలర్ చేశాం

- బాలకృష్ణ

''రైతుల మీద సినిమాలు చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. ఓ సందర్భంలో చాలామందిని కలిశాను కూడా. కానీ కుదర్లేదు. 'రూలర్' సినిమాతో ఆ కోరిక కొంత తీరింది'' అన్నారు బాలకృష్ణ. కె.ఎస్ రవికుమార్ దర్శక త్వంలో బాలకృష్ణ హీరోగా సి. కల్యాణ్ నిర్మించిన చిత్రం 'రూలర్'. ఇందులో వేదిక, సోనాల్ చౌహాన్ కథా నాయికలుగా నటించారు. ఈ నెల 20న ఈ సినిమా విడుదల కానుంది.



● సి.కల్యాణ్, వేదిక, బాలకృష్ణ, సోనాల్ చౌహాన్, కేయస్ రవికుమార్

ఈ సందర్భంగా జరిగిన ప్రీ–రిలీజ్ ఈవెంట్‌లో సినిమా ట్రైలర్‌ను దర్శకుడు బోయపాటి శీను, నందమూరి రామకృష్ణ విడుదల చేశారు. బాల కృష్ణ మాట్లాడుతూ–''నేనూ, కల్యాణ్, కేఎస్ రవి కుమార్ కలిసి చేసిన 'జై సింహా' చిత్రాన్ని ప్రేక్ష కులు ఆదరించారు. ఆ స్ఫూర్తితోనే 'రూలర్' సినిమా తీశాం. మొదట్లో ఈ సినిమాకు మరో కథ అనుకున్నాం. కుదర్లేదు. ఆ సమయంలో నేను పరుచూరి మురళిగారికి ఫోన్ చేశాను. ఆయన దగ్గర ఉన్న ఓ కథను వినిపించారు. ఆ కథ నచ్చ డంతో వెంటనే ఈ సినిమా చేయాలని నిర్ణయించు కున్నాను. ప్రేక్షకుల అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా, కొత్తదనం అందించాలనే ప్రయత్నాలు చేస్తుంటాను. ఈ ప్రయత్నంలో భాగంగానే ఎన్నెన్నో విభిన్నమైన పాత్రలు చేశాను. కళామతల్లికి సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించిన తెలుగు ప్రేక్షకులకు నా హృదయపూర్వక కృతజ్ఞ తలు'' అని అన్నారు. ''రూలర్' అనే పేరు బాల కృష్ణగారికి పర్‌ఫెక్ట్‌గా సరిపోతుంది. తమిళంలో రవికుమార్‌గారు చేసిన సినిమాలు మాలాంటి దర్శకులకు రిఫరెన్స్‌లా ఉపయోగపడతాయి. సి.కల్యాణ్‌గారికి అభినందనలు''అన్నారు బోయ పాటి శీను. ''ఇండస్ట్రీలో నాకు బాగా సపోర్ట్ అందించిన వ్యక్తి బాలకృష్ణగారు. కేఎస్ రవి కుమార్ సూపర్ డైరెక్టర్. సి.కల్యాణ్‌గారితో నాకు ఎప్పట్నుంచో పరిచయం ఉంది. ఇంతమంది నాకు కావాల్సిన వ్యక్తులు చేసిన ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు నటుడు రాజశేఖర్. ''జై సింహా' తర్వాత మా కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రం ఇది. టీమ్ అందరూ ఎంతగానో కష్ట పడ్డారు'' అన్నారు కేఎస్ రవికుమార్. ''బాల కృష్ణగారు ఈజ్ గ్రేట్' అనేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు సి. కల్యాణ్. కథానాయికలు సోనాల్ చౌహాన్, వేదిక మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గంటా శ్రీనివాసరావు, అంబికా కృష్ణ, జీవితా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నచ్చిన సినిమాలే చేస్తాను

''దొంగ' సినిమా పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. అలానే దర్శకుడు జీతూ జోసెఫ్ సినిమాల్లో కని పించే సస్పెన్స్, థ్రిల్స్ కూడా ఉంటాయి. నేను చేసిన 'ఊపిరి, నా పేరు శివ' సినిమాలను కలిపితే ఎలా ఉంటుందో ఈ సినిమాలో అలాంటి ఛాయ లుంటాయి'' అని హీరో కార్తీ అన్నారు. కార్తీ, నిఖిలా విమల్ జంటగా జ్యోతిక, సత్యరాజ్, 'షావుకారు' జానకి ముఖ్య పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'తంబీ'. తెలుగులో 'దొంగ' పేరుతో రిలీజ్ కాబోతోంది. జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రావూరి వి. శ్రీనివాస్ నిర్మించారు. ఈ నెల 20న ఈ చిత్రం రిలీజ్ కాబోతున్న సంద ర్భంగా కార్తీ పంచుకున్న విశేషాలు..



● కార్తీ

- నా కెరీర్‌లో ఇప్పటి వరకూ 19 సినిమాలు చేశాను. ప్రతి సినిమాకు వంద శాతం కష్టపడ్డాను. స్క్రిప్ట్ నాకు బాగా నచ్చితేనే సినిమా చేశాను. కథల ఎంపిక విషయంలో చాలా జాగ్రత్తలు వహిస్తుంటాను. ఈ సినిమా 'ఖైదీ' వచ్చిన రెండు నెలల తర్వాత వస్తుండొచ్చు, కానీ రెండేళ్ల నుంచి పక్కా ప్లానింగ్‌తో 'దొంగ' సినిమా చేశాం.
- 'రంగ్ దే బసంతి' రాసిన రచయిత రెన్సిల్ డిసిల్వ ఈ కథను నా దగ్గరకు తీసుకువచ్చారు. ఈ కథ నాకు బాగా నచ్చింది. వదిన(జ్యోతిక) కూడా ఈ కథ విన్నారు. దర్శకుడు ఎవరు? అని అనుకుంటుంటే.. జీతూ జోసెఫ్ కరెక్ట్ అని అను కున్నాం. నేనూ, వదినా ఈ సినిమా చేయబో తున్నాం అని తెలిసి ఆయన కూడా ఓకే అన్నారు. ఆయనకి ఈ స్క్రిప్ట్ బాగా నచ్చడంతో మాకు మరింత నమ్మకం వచ్చింది.
- వదినతో యాక్ట్ చేయడం ఇంట్లో కూర్చొని మాట్లాడినట్టే ఉండేది. ఎందుకంటే ఈ సిని మాలో మా పాత్రలు కూడా అలానే ఉంటాయి. మేమిద్దరం అక్కాతమ్ముడి పాత్రల్లో నటించాం. నెల రోజుల ముందే డైలాగ్స్ అన్నీ నేర్చుకుని సెట్‌కి వచ్చేవారు వదిన.
- ఈ సినిమాను అన్నయ్య(సూర్య) ఇంకా చూడ లేదు. థియేటర్స్‌లోనే చూస్తా అని చెప్పారు.
- ఇందులో సత్యరాజ్ మా తండ్రి పాత్రలో నటిం చారు. 'షావుకారు' జానకి మా బామ్మ పాత్ర చేశారు. ఇంతమంది అద్భుతమైన నటీ నటులతో పని చేసినప్పుడు మనం కూడా బాగా చేస్తాం. చాలా నేర్చుకుంటాం.
- నా గత చిత్రం 'ఖైదీ' చిరంజీవిగారి సినిమా టైటిలే. ఇది కూడా చిరంజీవిగారి సినిమా టైటిలే. ఆయన కూడా 'ఖైదీ' తర్వాత 'దొంగ' సినిమా చేశారని నాతో ఎవరో అన్నారు. మంచి శకునం అనుకున్నాను.
- ప్రస్తుతం మణిరత్నం గారి 'పొన్నియిన్ సెల్వ మ్' షూటింగ్ థాయ్ ల్యాండ్‌లో జరుగు తోంది. 'దొంగ' ప్రమోషన్స్ కోసం చిన్న బ్రేక్ తీసు కొని వచ్చాను. మళ్లీ వెళ్లి షూటిం గ్‌లో జాయిన్ అవుతాను.

# మరికొన్ని సెటైరికల్ చిత్రాలు తీస్తాను

- రామ్‌గోపాల్ వర్మ



● నట్టి కుమార్, రామ్ గోపాల్ వర్మ, టి. అంజయ్య

'అమ్మరాజ్యంలో కడప బిడ్డలు' చిత్రాన్ని నవం బర్ 29న రిలీజ్ చేయా లనుకున్నాం. కానీ మా సినిమా కుల ద్వేషాలను రెచ్చగొడుతుందనే కార ణాలు చూపి రిలీజ్‌ను అడ్డుకోవడానికి ప్రయ త్నించి, రిలీజ్ వాయిదా పడేలా చేశారు. రిలీజ్ ఆలస్యం కావడం వల్ల మాకు నష్టం జరిగింది. దీనికి కారణం అయిన వాళ్లందరి మీద నష్టపరిహారం దావా వేయబో తున్నాం'' అన్నారు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. ఆయన టైగర్ ప్రొడక్షన్ కంపెనీ బ్యానర్ నుంచి వచ్చిన చిత్రం 'అమ్మరాజ్యంలో కడప బిడ్డలు'. సిద్ధార్థ్ తాతోలు దర్శకత్వం వహించిన ఈ సినిమాను అజయ్ మైసూర్, టి.నరేష్ కుమార్, టి.శ్రీధర్ నిర్మించారు. నట్టి క్రాంతి, నట్టి కరుణ సహ–నిర్మాతలు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో వర్మ మాట్లాడుతూ– ''ఇదొక సెటైరికల్ చిత్రం. జరగబోయే దాన్ని ఊహించి తీసిన చిత్రం. చాలామందికి అర్థం కాలేదేమో. మెల్లిగ్గా అర్థం చేసుకుంటారు. బయట రాజకీయ నాయకులు ఒకరినొకరు నిజంగానే తిట్టుకుంటుంటారు. వాళ్లను పట్టించుకోకుండా సరదాగా సినిమా తీసిన మా గురించి ఎక్కువగా మాట్లాడుకుంటు న్నారు. బయట జరిగే వాటితో పోలిస్తే మేం చాలా తక్కువ చూపించినట్లు. మనకు అను కూలంగా ఉన్నప్పుడు కామెడీగా తీసుకొని ప్రతి కూలంగా ఉన్నప్పుడు సీరియస్‌గా తీసుకుంటే ఎట్లా? సెన్సార్ బోర్డ్, ఇంద్రసేన్ చౌదరి, ది గ్రేట్ కేఏ పాల్ మరికొందరు సృష్టించిన ఇబ్బందుల వల్ల రెండు వారాలు ఆలస్యంగా మా సినిమా విడుదలయింది. ఏ కారణాలు చెప్పి ఈ సినిమా విడుదలను అడ్డుకోవాలనుకున్నారో, హైకోర్ట్ ఆ ఆరోపణలన్నీ కొట్టిపారేసి రిలీజ్‌కు అనుమతి ఇ చ్చింది. కోర్ట్ తీర్పు ఇచ్చినప్పుడు కూడా వాళ్ల ఆరోపణలను ఆపలేదు. 'మేం కోర్ట్‌ని మోసం చేశాం' అని ఇంద్రసేన్ చౌదరి అనే వ్యక్తి ఆరోపిం చారు. అంటే.. వాళ్లు కోర్ట్‌ని అవమానించినట్టే. ఆయనకి కోర్ట్ మీద సరైన అవగాహన లేదను కుంటాను. రిలీజ్ ఆలస్యం వల్ల మాకు నష్టం జరిగింది. దీని వెనుక ఉన్నవాళ్ల అందరి వివరాలు సేకరిస్తున్నాం. వాళ్ల మీద నష్ట పరిహారం దావా వేయాలనుకుంటున్నాం. ఇందులో ముఖ్యంగా ఇంద్రసేన్ చౌదరి, కేఏ పాల్, జ్యోతి ఉన్నారు. వాళ్లు నా మీద మార్ఫింగ్ కేసు కూడా పెట్టారు. మమ్మల్ని ఇబ్బంది పెడదాం అని అనుకున్నవాళ్లను వదిలే సమస్యే లేదు. త్వరలో మరిన్ని సెటైరికల్ చిత్రాలు తీస్తాను. అలానే పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్‌కి నేను చనిపోయినట్టు పోస్ట్‌లు పెట్టడం తప్ప వేరే కళ లేనట్టుంది. సెటైర్ స్టయిల్లోనే మరిన్ని సినిమాలు తీస్తా. నా తదుపరి చిత్రం 'ఎంటర్ ది గాళ్ డ్రాగన్''అన్నారు. ఈ కార్యక్రమంలో టి. అంజయ్య, నట్టి కుమార్ పాల్గొన్నారు.



'వరల్డ్ ఫేమస్ లవర్' చిత్రంలో రాశీ ఖన్నా, విజయ్ దేవరకొండ.

# నాకు ఆ అలవాటు లేదు

- నరసింహా నంది



● నరసింహా నంది, దివ్యా రావు, వరుణ్

''ట్రైలర్లో ఒక రకంగా, సిని మాలో మరో రకంగా చూపించే అలవాటు నాకు లేదు. ట్రైలర్లో ఉన్నది సినిమాలోనూ ఉంటుంది'' అన్నారు దర్శకుడు నరసింహా నంది. వరుణ్, దివ్యా రావు హీరోహీరోయిన్లుగా లక్ష్మీ నరసింహా సినిమా పతాకంపై నర సింహా నంది దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డిగ్రీ కాలేజ్'. ఈ సినిమా సెన్సార్ కార్యక్ర మాలు ముగిశాయి. ఈ చిత్రాన్ని జనవరి 1న విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా నరసింహా నంది మాట్లాడుతూ– ''ఇద్దరు డిగ్రీ విద్యార్థుల మధ్య చిగురించిన వాస్తవ ప్రేమ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తీశాను. ప్రేమలో ఉన్న ఓ అబ్బాయి, ఓ అమ్మాయి తరగతి గదిలో, బయట ఎలా ప్రవర్తించారన్న అంశాలను చూపించాను. ఇంతవరకు నేను తీసిన సినిమాలకు భిన్నంగా ఈ సినిమాలో కమర్షియల్ అంశాలను జోడించాను'' అని అన్నారు. ''ఇందులో కేవలం రొమాన్స్ మాత్రమే కాదు. అంతకుమించిన భావోద్వేగ సన్నివేశాలు ఉన్నాయి. అందుకే విడుదల చేయాలనుకుంటు న్నాను'' అన్నారు డిస్ట్రిబ్యూటర్ బాలరాజు. వరుణ్, దివ్యారావు, టి.ప్రసన్న కుమార్, రవి రెడ్డి, మదన్ పాల్గొన్నారు.

# బాలరాజు కబుర్లు



● కార్తికేయ

'చావు కబురు చల్లగా' చెబుతానంటు న్నారు బస్తీ బాలరాజు. 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ హీరోగా నటించనున్న తాజా చిత్రానికి 'చావు కబురు చల్లగా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సిని మాతో కౌశిక్ పెగళ్లపాటి దర్శకునిగా పరి చయం కాబోతున్నారు. ఇందులో బస్తీ బాలరాజు అనే పాత్రలో నటించబోతు న్నారు కార్తికేయ. అల్లు అరవింద్ సమర్ప ణలో 'బన్నీ' వాసు ఈ సినిమాను నిర్మిం చనున్నారు. సునీల్ రెడ్డి సహ–నిర్మాత. ఈ సినిమా చిత్రీకరణ వచ్చే ఏడాది ప్రారంభం కానుంది. ''ఓ కొత్త అంశంతో ప్రేక్షకులను అలరిస్తాం. ఈ సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణుల గురించి త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.



● అంజలి

# పింక్ రీమేక్‌లో అంజలి?

రెండేళ్ల క్రితం బాలీవుడ్‌లో విడుద లైన 'పింక్' చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. అనిరుద్ధ రాయ్ దర్శకత్వంలో అమితాబ్ బచ్చన్, తాప్సీ, కృతీ కల్హారీ, ఆండ్రియా టారియంగ్ ప్రధాన పాత్రల్లో నటించారు. నిర్మాత బోనీకపూర్ 'పింక్' చిత్రాన్ని గత ఏడాది తమిళంలో 'నేర్కొండ పార్వై'గా రీమేక్ చేశారు. ఇప్పుడు 'పింక్' చిత్రం తెలుగులో రీమేక్ కానుంది. 'దిల్' రాజు, బోనీ కపూర్ నిర్మించనున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. 'ఓ మై ఫ్రెండ్, ఎమ్‌సీఏ' చిత్రాల ఫేమ్ వేణు శ్రీరామ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. తమన్ స్వరకర్త. ఈ సినిమాలో కథ రీత్యా ముగ్గురు అమ్మాయిల పాత్రలు ఉంటాయి. వీరిలో ఇద్దరు అమ్మాయిలుగా అంజలి, నివేదా థామస్ నటించబోతున్నారని లేటెస్ట్ టాక్. ఇక హిందీ 'పింక్'లో అమితాబ్ బచ్చన్ పోషించిన పాత్రను తెలుగులో పవన్ కల్యాణ్ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. జనవరిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని తెలిసింది.




పరిచయం స్వప్న, 'డ్యాజిల్ మిసెస్ ఇండియా' రన్నర్ అప్

# కాన్ఫిడెన్సే కిరీటం



'మీకు ఒక అద్భుత శక్తి వచ్చి... చరిత్ర నుంచి ఎవరినైనా వెనక్కు తీసుకురావచ్చు అంటే మీరెవరిని తెస్తారు?'.. ఇది మహిళల అందాల పోటీలో ఒక కంటెస్టెంట్‌గా స్వప్నకు ఎదురైన ప్రశ్న. అందుకు ఈమె ఇచ్చిన సమాధానమే ఆమెను విజేతను చేసింది. ఈవారం మనకు ఆమె 'పరిచయం' అయ్యేలా చేసింది.

''ప్రతి మనిషిలోనూ వారికంటూ కొన్ని ప్రత్యేకతలుంటాయి. ఒక వ్యక్తిని గొప్ప అని, మరొకరిని గొప్పకాదు అనడానికి వీల్లేదు. ప్రతి ఒక్కరికీ ఓ చరిత్ర ఉంటుంది. చారిత్రక వ్యక్తులంటూ కొందరికే గౌరవం ఇవ్వడం సరికాదు. ఏ వ్యక్తి అయినా ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు. ఒక ఇల్లు బాగుండాలంటే అందుకు తల్లి ప్రధానం. నేనైతే.. తల్లులు లేని ఇళ్లను వెతికి వాళ్లకు వారి తల్లులను తిరిగి తెచ్చిస్తాను. సమాజానికి దారి చూపే ప్రతి నాయకుడూ ఒక తల్లి తీర్చిదిద్దిన బిడ్డే. తల్లి బాగుంటే ప్రతి ఇల్లూ సమాజానికి ఒక లీడర్‌నిస్తుంది''.. ఇది అందాల పోటీలో స్వప్న సమాధానం. ఏడేళ్ల కిందట దూరమైన తల్లిని తలుచుకుంటూ ఇచ్చిన సమాధానం. ఈ సమాధానమే ఆమెను 'డ్యాజిల్ మిసెస్ ఇండియా వరల్డ్ 2019 ఎలీట్' పోటీల్లో విజేతగా నిలిపింది. ఈ పోటీల్లో సెకండ్ రన్నర్ అప్ కిరీటం ధరించిన స్వప్న కోరిప తన విజయ ప్రస్థానాన్ని సాక్షితో పంచుకున్నారు.

**అందానికి భాష్యం**

రాజస్థాన్ రాష్ట్రం పుష్కర్‌లో గత నవంబర్ తొమ్మిదవ తేదీన జరిగిన మిసెస్ బ్యూటీ కాంటెస్ట్‌లో మిసెస్ బ్యూటీ రన్నర్ అప్ కిరీటాన్ని ధరించారు స్వప్న. అందం అంటే ముఖానికి మెరుగులు దిద్దుకునే మేకప్పులు కాదని, మహిళల దేహాకృతి–కొలతలు కాదని, ఆత్మవిశ్వాసమే అసలైన అందం అని అందానికి భాష్యం చెప్పారామె. ''అందంతో ఏ మాత్రం నిమిత్తం లేకుండా తోటి వారితో వ్యవహరించే తీరు, ఒక అంశం మీద స్పందించే వైఖరి ఆధారంగా సాగే పోటీలివి. మనిషి లోపల భయం, ధైర్యం, అంతర్మథనం, అపరాధభావం, ఆత్మవిశ్వాసం వంటివన్నీ నడకలో ప్రతిబింబిస్తాయి. ముఖంలో ప్రతిఫలిస్తాయి. అందుకే అడుగు తీసి అడుగు వేయడం నుంచి, ముఖ కవళికల వరకు పరిగణనలోకి తీసుకుంటారు. అయితే ఇవన్నీ ద్వితీయాంశాలే. అసలైన పోటీ మన ఆలోచన తీరుదే. ఒక ప్రశ్నకు మనం ఏ సమాధానం చెప్పినా అది తప్పు కాదు. ఆ సమాధానంలో మన ఆలోచన తీరు వ్యక్తమవుతుంది. ఏ ప్రశ్నకూ 'అవును, కాదు' అనే పొడి సమాధానాలివ్వకూడదు. మన సమాధానంలో ఒక రీజనింగ్ ఉండి తీరాలి. ఆ సమాధానాన్ని విశ్లేషించి మార్కులు వేస్తారు'' అని వివరించారు స్వప్న.




**స్నేహపూర్వక పోటీ**

''మహిళలోని పరిపూర్ణత్వానికి ఈ పోటీ ఒక గీటురాయిగా ఉంటుందే తప్ప పోటీలో పాల్గొన్న వారి మధ్య పోటీతత్వం కనిపించదు. సాధారణంగా కనిపించే ఈర్ష్య, అసూయలు కూడా లేకుండా చాలా స్నేహపూర్వకంగా ఉంటారని తెలుసుకున్నాను'' అన్నారు స్వప్న. ఆమె రాజస్థాన్‌లో తనకు ఎదురైన ఒక అనుభవాన్ని పంచుకున్నారు. ''నేను వేసుకున్న గాజు నా చీరకు సరిగ్గా మ్యాచ్ అవలేదు. మా పోటీలు జరిగిన రిసార్ట్ పుష్కర్ నగరానికి దూరంగా విసిరేసినట్లు ఉంది. ఏదైనా ఒక వస్తువు మర్చిపోతే బజారుకెళ్లి తెచ్చుకుందాం అనుకోవడానికి వీల్లేదు. దాంతో నా దగ్గర ఉన్న గాజునే వేసుకున్నాను. అది చూసి అస్సాం నుంచి వచ్చి న'మరోమి' తన దగ్గరున్న బ్యాంగిల్ ఇచ్చింది. ఆ గాజు వేసుకున్న తర్వాత ఇప్పుడు పర్‌ఫెక్ట్‌గా ఉన్నారని కాంప్లిమెంట్ కూడా ఇచ్చింది. ఈ పోటీల్లో ఉండే వాళ్లందరూ బిడ్డల తల్లులే కావడంతోనే షేరింగ్, పరిణితి సాధ్యమైందనిపించింది. పోటీలకు వెళ్లేటప్పుడు తెలియలేదు, కానీ పోటీల అనుభవమే నాలో పరిపూర్ణత తెచ్చిందనిపిస్తోంది'' అన్నారు స్వప్న.

**'మార్గదర్శక్' విస్తృతం**

సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ నిర్వహించే ట్రాఫిక్ సేఫ్టీ, ఉమెన్ సేఫ్టీ శిక్షణ తరగతుల్లో 'ఉమెన్ సేఫ్టీ' విభాగంలో ఆరువారాల పాటు శిక్షణ పొందారు స్వప్న. ఈ శిక్షణ పొందిన వారికి పోలీస్ డిపార్ట్‌మెంట్ 'మార్గదర్శక్' సర్టిఫికేట్ ఇస్తుంది. గృహహింసకు గురవుతున్న బాధిత మహిళలకు ఆలంబనగా ఉంటూ వారికి చట్టాల గురించి అవగాహన కల్పించడం, వారి అవసరాన్ని బట్టి షీ టీమ్స్, భరోసా సెంటర్‌ల ద్వారా మార్గనిర్దేశనం చేయడమే మార్గదర్శక్ ప్రధాన విధులు. మిసెస్ బ్యూటీ విజయంతో వచ్చిన గుర్తింపును మార్గదర్శక్ సేవలను విస్తృతం చేయడానికి వినియోగించుకుంటానని చెప్పారు స్వప్న. ''అమ్మ పోయిన తర్వాత ఏర్పడిన వెలితిని అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఉన్న అనాథ శరణాలయం భర్తీ చేసింది. మా పాప పుట్టిన రోజు, అమ్మ పోయిన రోజుల్లో ఆ పిల్లల మధ్యనే గడుపుతున్నాను. వారికి బియ్యం, పుస్తకాలు, స్కూలు బ్యాగ్‌లు ఇవ్వడం వంటి చేతనైన సహాయం చేస్తున్నాను. ఈ చిన్న పనిలో ఎంత సంతోషం పొందుతున్నానో, బాధిత ఆడవాళ్లకు అండగా నిలవడం కూడా సంతోషం కలుగుతోంది'' అన్నారు.

**బిర్యానీ ల్యాండ్**

ఈ కాంటెస్ట్‌లో మరో ముఖ్యమైన విషయం తమను తాము ఆవిష్కరించుకోవడం. సౌత్ ఇండియా కిరీటం గెలుచుకుని జాతీయ పోటీలకు హాజరైన స్వప్న ''మెకానికల్ ఇంజనీరింగ్ చదివి, ఎమ్ఎన్‌సీలో ఉద్యోగం చేస్తున్న నేను 'ల్యాండ్ ఆఫ్ బిర్యానీ' నుంచి వచ్చాన''ని చెప్పగానే 22 మంది పార్టిసిపెంట్స్, ఆహుతులు 'హైదరాబాద్, బిర్యానీ' అని అరిచారు. ఆమె బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగం హైదరాబాద్‌లోనే. కానీ ఆమె మూలాలు ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, జలదంకి మండలం బ్రాహ్మణ క్రాకలో ఉన్నాయి. ''తాత కోరిప అంకయ్య, నానమ్మ రమణమ్మ. మా చిన్నాన్న, పెద్దనాన్నలు ఆ ఊరిలో ఉన్నారు. నాన్నకు బిఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగం కారణంగా హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. మా తాత జ్ఞాపకంగా మా ఊరిలో ఏదైనా చేయాలనుంది. చేసి తీరుతాను'' అని స్వప్న ఆత్మవిశ్వాసంతో చెప్పారు.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: దేవేంద్రనాథ్ ఇసుకపట్ల

## కూతురే కాంటెస్ట్‌కి పంపింది!

ఇంటర్ చదివే కూతుర్ని బ్యూటీ కాంటెస్ట్‌కి సిద్ధం చేయకుండా, 38 ఏళ్ల వయసులో తాను పాల్గొనడానికి వెనుక ఉన్న కారణాన్ని వివరించారు స్వప్న. ''2008లో ఒక షోరూమ్ వాళ్లు చీరలకు మోడలింగ్ చేస్తారా... అని అడిగారు. చేయాలని చాలా ఉత్సాహంగా ఉండింది. కానీ మా పేరెంట్స్ వద్దన్నారు. అప్పటికి నేను పెళ్లయిన మూడు నెలలకే ఆత్మహత్యా ప్రయత్నం చేసి బతికి బయట పడి, అమ్మానాన్నల దగ్గర ఉన్నాను. నా భర్త వేధింపుల నుంచి నన్ను కాపాడుకోవడం కోసం మా అమ్మానాన్నలు కంటి మీద కునుకులేకుండా ఉన్న రోజులవి. వాళ్లు వద్దనడానికి అదీ ఒక కారణమే. ఈ మధ్య ఓ రోజు మా అమ్మాయితో ఆ మాట చెప్పాను. అప్పటి నుంచి తను ఎలాగైనా నన్ను మోడలింగ్‌లోకి తీసుకురావాలని ప్రయత్నించింది. అయితే ఈ కాలంలో మోడలింగ్ రంగంలోకి రావాలంటే అంతకంటే ముందు ఏదో ఒక గుర్తింపు ఉండాలని తెలిసి నన్ను బ్యూటీ కాంటెస్ట్‌కి పంపించింది. మా అమ్మాయికి ఊహ తెలిసినప్పటి నుంచి తను నా కన్నీళ్లను, కష్టాలను మాత్రమే చూసింది. రెండు–మూడేళ్ల నుంచి అప్పులు తీరి జీవితం గాడిన పడింది. నా ముఖంలో ఇంకా ఇంకా సంతోషం చూడాలని పట్టుపట్టి తను ఈ పని చేసింది.

పరి పరిశోధన

# స్వచ్ఛమైన గాలికి ఎయిర్‌బాక్స్!

పీల్చే గాలి విషమవుతోంది. రుజువు కావాలా? ఒక్కసారి ఢిల్లీకెళ్లి చూడండి. ఆ సంగతి ఇప్పుడెందుకంటారా? ఫొటో చూసేయండి.. విషయం మీకే అర్థమైపోతుంది. ఫొటోలో కనిపిస్తున్నది అత్యాధునిక ఎయిర్ ఫిల్టర్. పేరు ఎయిర్‌బాక్స్. పిట్టకొంచెం కూత ఘనం అంటామే ఆ టైప్ అన్నమాట. బాత్రూముల్లోని సూక్ష్మజీవులు మొదలుకొని రసాయనిక రంగుల్లోని హానికారక కాలుష్యాల వరకూ అన్నింటినీ ఇట్టే పీల్చేసుకుని స్వచ్ఛమైన గాలిని అందిస్తుంది. అప్పుడప్పుడూ ఇందులోని ఫిల్టర్‌ను బయటకు తీసి శుభ్రం చేసుకోవడం ఒక్కటే మనం చేయాల్సిన పని. అరచేతిలో ఇమిడిపోయే ఈ ఎయిర్ ఫిల్టర్‌లోకి కలుషితాలతో కూడిన గాలి ప్రవేశించిన వెంటనే ముందుగా ఈ ఫిల్టర్ ద్వారా ప్రయాణించి పెద్దపెద్ద ధూళికణాలను తీసేస్తుంది. ఆ తరువాత ఓ యూవీ ఎల్ఈడీ లైటు సాయంతో ఓ నానో రియాక్టర్ హానికారక రసాయన కణాలను ధ్వంసం చేస్తుంది. చివరగా నెగటివ్ అయాన్ జనరేటర్ సెకనుకు రెండు కోట్ల అయాన్లను ఉత్పత్తి చేస్తుంది. ఇది అతిసూక్ష్మమైన పిఎం 2.5 కణాలకు అతుక్కుని తొలగిస్తుంది. ప్రస్తుతం ఈ ఎయిర్ బాక్స్‌ను తయారు చేసేందుకు అవసరమైన నిధులను కిక్‌స్టార్టర్ వేదికగా సేకరిస్తున్నారు.




* * * * * *

# చెమట చెబుతుంది మద్యమెంతో...!



ఎంత మద్యం తాగారో తెలుసుకునేందుకు ఇప్పుడు వాడుతున్నారే.. బ్రీతలైజర్లు.. వాటికి త్వరలో కాలం చెల్లిపోనుంది. బాగానే పనిచేస్తున్నా.. దీంతో సమస్యలూ ఉన్నాయి. అందుకే వీటి స్థానంలో చెమట నుంచి ఆల్కహాల్ మోతాదును అంచనా వేసేందుకు ఓ కొత్త పద్ధతి, టెక్నాలజీ అందుబాటులోకి రానుంది. న్యూయార్క్‌లోని అల్బేనీ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. మన ఊపిరిలోని ఎథనాల్ మోతాదును లెక్కకట్టడం ద్వారా బ్రీతలైజర్లు పనిచేస్తాయన్నది మనకు తెలిసిందే. అయితే మీరు మౌత్‌వాష్ వాడారనుకోండి. దాంట్లోని ఎథనాల్ ద్వారా కూడా మీ రీడింగ్ మారిపోవచ్చు. మధుమేహులైతే... వారి ఊపిరిలోని ఎసిటోన్ కూడా బ్రీతలైజర్ రీడింగ్ మార్చేస్తుంది. ఈ చిక్కులన్నింటినీ అధిగమించేందుకు అల్బేనీ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేశారు. ఐస్‌క్రీమ్ స్టిక్ లాంటిదానిపై చెమటచుక్కను వేస్తే సరి.. మద్యం ఉంటే దానిపై ఓ రంగు చుక్క ఏర్పడుతుంది. రంగు ముదురుగా ఉంటే ఎక్కువ, లేతగా ఉంటే తక్కువ మద్యం ఉందని అర్థం. ఈ ముదురు, తేలిక రంగు తేడాలను గుర్తించడం కష్టమని అంటున్నారా? నో ప్రాబ్లెమ్. ఓ స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్ ద్వారా రంగు అర్థాలను వివరించేందుకు ఏర్పాట్లు ఉన్నాయి. ఇప్పటికే కొంతమందిపై ఈ పట్టీని ప్రయోగాత్మకంగా పరిశీలించి మంచి ఫలితాలు సాధించారు. అనలిటికల్ కెమిస్ట్రీ మేగజైన్‌లో పరిశోధన తాలూకూ వివరాలు ప్రచురితమయ్యాయి.

ధనుర్మాస స్వగతం

# ప్రకృతికాంత పారవశ్యం

**హేమంతం వస్తే చాలు ఇంటింటా బంతులు, చేమంతులతో నా పాదాలకు పసుపు పసుపు పూసి, ఎర్రటి కారబ్బంతులతో పారాణి తీర్చి దిద్దుతారు. కుసుమ లావణ్య వతులకు ఈ మాసమంటే ఎంత సరదానో.**

నా మనసు పరవళ్లు తొక్కుతోంది. నేటి నుంచి నెలనాళ్లు నాకు ప్రతి రోజూ పండుగే. 'మల్లెలతో వసంతం... చేమంతులతో హేమంతం... వెన్నెల పారిజాతాలు..' అని దేవులపల్లి కృష్ణశాస్త్రి నన్ను ఎంత అందంగా వర్ణించాడో! హేమంతం వస్తే చాలు ఇంటింటా బంతులు, చేమంతులతో నా పాదాలకు పసుపు పసుపు పూసి, ఎర్రటి కారబ్బంతులతో పారాణి తీర్చి దిద్దుతారు. తెలతెలవారుతుండగా ఇంకా తెలిమేను ముసుగు తొలగించకుండానే నా చిట్టితల్లులు పరికిణీని నడుములోకి దోపి, ముంగిళ్లకు కళ్లాపి స్నానం చేయించి, తెల్లటి ముగ్గుల రంగవల్లులతో వస్త్రధారణ చేసి, ప్రతి గుమ్మాన్ని అందమైన ముద్దుగుమ్మగా తీర్చిదిద్దుతారు. నాకు ఇంటింటా చీర సారె పెట్టినట్లే కదా. నేను ధరించే చీర మీద ఎన్ని అందాలో! ఒకరు పారిజాతాలు, ఒకరు నక్షత్రాలు, ఒకరు మారేడు దళాలు, మరొకరు జాజి తీగెలు, ఒకరు సన్నాయి మేళాలు, మరొకరు పొంగలి



కుండలు, చెరకు గడలు, దీపాలు.. ఒక్కొక్కరు ఒక్కో అందమైన రంగవల్లితో చీర తయారు చేసి, నన్ను అలంకరిస్తుంటే, వారి కంటె ఎక్కువగా నేను ఆనందిస్తుంటాను.

**వాకిట గొబ్బిళ్లు మాత్రం!**

కుసుమ లావణ్యవతులకు ఈ మాసమంటే ఎంత సరదానో. వారికేంటి సాక్షాత్తు శ్రీకృష్ణపరమాత్మ మాసాలలో మార్గశిర మాసం తానే అన్నాడు. నా జన్మ ధన్యమైనట్లే కదా. పిల్లలంతా గోమయాన్ని ఇచ్చే ఇళ్లకు తెల్లవారుజామునే వెళ్లి, వరుసలో నిలబడి, కావలసినంత పేడ తెచ్చుకుని, గొబ్బిళ్లుగా తీర్చిదిద్ది, పసుపు, కుంకుమలతో వాటిని అలంకరించి, తెల్లని కాంతులు జత చేసి, ఆ పైన గొబ్బిపూలతోను, రకర కాల రంగురంగుల పూలతో అలంకరిస్తుంటే.. నన్ను అలంకరించినట్లే భావిస్తాను. ఇక నా శ్రీకృష్ణుడికి ఈ మాసమంతా రుచికరమైన ప్రసాదాల ఆరగింపులే. అసలే వెన్న దొంగ, ఈ కమ్మటి వాసనలకు ఆ బాలగోపాలుడు ఎక్కడికీ పోలేడు.

**హరిదాసులు.. హరి విల్లులు**

హరిదాసులు విష్ణువుకి దాసులైపోతారు. ఒక చేతిలో చిటి వీణ, ఒక చేతిలో తాళాలు, తల మీద భిక్ష పాత్ర, నుదుటన విష్ణు తిరునామాలు పెట్టుకుని 'హరీ! హరిలో రంగ హరీ! వైకుంఠధామా హరీ' అంటూ పాదాలను అల్లుకున్న చిరు మువ్వలు సవ్వడి చేస్తూ, చేతిలోని చిటివీణను, తాళాలను లయబద్ధంగా మేళవిస్తుంటే, శ్రీకృష్ణదేవరాయల మాలదాసరి నా మనసుకు స్ఫురిస్తాడు. హరికథలు చెప్పే ఆదిభట్ల నారాయణదాసు కూడా కళ్ల ముందు గజ్జెలు ఘల్లుమనేలా గాలిలోకి ఎగురుతున్నట్లు కనిపిస్తాడు. నా హృదయం ఇందుకు సంబరంగా సన్నగా సవ్వడులు చేస్తుంది. గంగిరెద్దుల వారు ఇంటింటికీ వచ్చి 'అయ్యవారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు' అని అందరికీ సలాములు చేయిస్తుంటారు. గంగిరెద్దుల వీపులు ఇంద్రధనుస్సులా రంగురంగుల చీరెసారెలతో నిండిపోతాయి. ఎంత వింతో కదా.. గంగిరెద్దు చీరలను ధరించడం! పాడి సంపద సమృద్ధిగా ఉంటేనే కదా నా సంతానమంతా కడుపునిండుగా భోజనం చేయగలుగుతారు. పంట చేతికి వచ్చి, సంపదలతో తులతూగుతూ, నన్ను ఆరాధిస్తుంటే తృప్తిగా ఉంటుంది నాకు.

**ఇలలో వేల్పుల కొలువు**

ఇవన్నీ చెప్పి, బొమ్మల కొలువు గురించి మాట్లాడకపోతే ఎలా! ధనుర్మాసానికి వీడ్కోలు పలుకుతూ భోగి నాడు భోగిమంటలు వేసుకుని, సాయంత్రం భోగిపళ్లు పోసుకుంటూ ఎంత భోగం అనుభవిస్తారో చిన్నారులు. వాటితో పాటు ఆడపిల్లలంతా వారిలోని ఆలోచనాశక్తికి పదునుపెట్టి, బొమ్మలకొలువులు ఏర్పాటుచేసి, ఇరుగుపొరుగులను పేరంటాలకు పిలుచుకుని, ఒకరికి ఒకరు అండగా ఉన్నామన్న భరోసా ఇస్తుంటే, ఒక తల్లిగా నాకు ఆనందమే కదా! ఆఖరి రోజున ఈ మాసాన్ని రథమెక్కించి సాగనంపుతుంటుంటే, ఆ భోగం చూడటానికి ఎన్ని కన్నులున్నా చాలవు కదా అనిపిస్తుంది. నన్ను మకరరాశిలోకి పంపేసి, ప్రజలంతా నెల్లాళ్ల పండుగకు ముగింపు పలుకుతుంటే, ఈ నెల్లాళ్ల అనుభూతులను ఏడాది పాటు నెమరువేసుకుంటూ, మళ్లీ వచ్చే మార్గశిరం కోసం నిరీక్షించాల్సిందే. ఇదిగో మీకందరికీ ఈ ధనుర్మాసానికి స్వాగతం పలుకుతున్నాను. మీరెలాగూ నన్ను గౌరవంగా ఆహ్వానించి, సత్కరించడం ప్రారంభించారుగా. విజయోస్తు!

– వైజయంతి పురాణపండ

ది షో

# అత్తగారూ కోడలూ




అత్తగారూ కోడలూ టీవీల్లో ఒకరినొకరు హింసించుకోవడం కనిపిస్తుంది. నిజ జీవితంలో వారు సఖ్యంగా ఉండరనే అపవాదు ఉంది. కాని ఒక సెలబ్రిటీ కోడలు తన సెలబ్రిటీ అత్తగారితో ఒక రేడియో షో నిర్వహించడం చాలామందిని ఆకట్టుకుంది. 'ఇష్క్' రేడియో 104.8 ముంబై, కోల్‌కతా, ఢిల్లీలో ప్రసారం అవుతోంది. ఇందులో కరీనా కపూర్ 'వాట్ ఉమెన్ వాంట్' (స్త్రీలకు ఏమి కావాలి?) అనే షో చేస్తోంది. మొదటి సీజన్ ముగిసి రెండో సీజన్ ప్రారంభం కాగా మొదటి ఎపిసోడ్‌లో తన అత్తగారూ సైఫ్ అలీ ఖాన్ తల్లి అయిన షర్మిలా టాగోర్‌తో సంభాషించింది. పది నిమిషాలకు పైగా సాగిన ఈ షోను యూ ట్యూబ్ ప్రచారం కోసం వీడియోగా కూడా అందుబాటులో ఉంచారు. కరీనా, షర్మిలా పక్కపక్కన కూచుని మాట్లాడుకోవడం అభిమానులను కుతూహలపరిచింది.

'మీరు స్త్రీగా మీ కెరీర్‌ను కుటుంబాన్ని ఎలా అనుసంధానించుకున్నారు' అని కరీనా అడిగితే 'నా సినిమాలను మానుకోవడం ద్వారా' అని షర్మిలా సమాధానం ఇచ్చారు. 'పని చేసే భార్య ఉన్నప్పుడు ఇంట్లో ఉండే భర్త– అంటే హౌస్ హజ్బెండ్స్ ఉండటం మన సమాజం అంగీకరించదు. అలా భర్తను ఇంట్లో ఉంచితే భార్యను తప్పుగా చూస్తుంది. స్త్రీలు అలా తప్పుగా చూడబడటాన్ని అంగీకరించరు. కనుక తాము ఇంట్లో ఉండి పిల్లలను చూసుకుంటూ భర్తను పనికి పంపుతారు. నేను కూడా అలాగే చేయాల్సి వచ్చింది' అని షర్మిలా అన్నారు. 'కూతురికి కోడలికి తేడా ఏమిటి?' అని కరీనా అడిగితే 'కూతురు గురించి మనకు తెలిసి ఉంటుంది. కోడలి గురించి తెలియదు. మెల్లగా తెలుసుకోవాలి. అందుకు సమయం వెచ్చించాలి. ఓర్పు వహించాలి' అని షర్మిల చెప్పారు. 'కోడలిగా అడుగుపెట్టినప్పుడు నేను కూడా ఇబ్బంది పడ్డాను. నేను బెంగాలీని రైస్ తింటాను. టైగర్ (పటౌడి–భర్త) వాళ్లు రొట్టె తింటారు. నాకు చేపలు ఇష్టం. టైగర్‌కు ఇష్టం ఉండదు. ఇవన్నీ నడిచాయి. వీటిని అత్తాకోడళ్లు ఇద్దరూ అర్థం చేసుకోవాలి' అని ఆమె అన్నారు. ఇద్దరూ కరీనా కుమారుడు తైమూర్ గురించి సోషల్ మీడియా ప్రదర్శిస్తున్న అటెన్షన్ గురించి కొద్దిగా ఆందోళన పడ్డారు. 'మీ (నలుగురు) మనమలలో ఎవరంటే మీకు ఎక్కువ ఇష్టం' అని షర్మిలను అడిగితే 'అమ్మో... ఒకరినని ఎలా చెప్పడం.. నలుగురూ నాలుగు విధాలా ఇష్టం' అని చెప్పారామె. సైఫ్–అమృతాసింగ్‌ల కుమార్తె అయిన సారా ఇప్పుడు హీరోయిన్‌గా సఫలం కావడం పట్ల షర్మిల సంతోషం వ్యక్తం చేశారు.

అత్తాకోడళ్ల ఈ సంభాషణలో ఇద్దరూ ఒకరినొకరు గౌరవించుకుంటూ మాట్లాడుకోవడం మంచి విషయంగా అనిపించింది. చాలామంది ఇలాగే ఉంటారని ప్రచారం చేయాల్సిన అవసరం కూడా కనిపించింది.

ఫ్యామిలీ డాక్టర్

# పక్షవాతం వంశపారంపర్యమా?

న్యూరో కౌన్సెలింగ్

**నా వయసు 36 ఏళ్లు. మేము ముగ్గురు అన్నదమ్ములం. మా నాన్నగారు నా చిన్నతనంలో పక్షవాతానికి గురయ్యారు. అప్పట్లో సరైన వైద్యసౌకర్యాలు లేకపోవడంతో మంచానపడి పదేళ్లపాటు నరకం అనుభవించి చనిపోయారు. నా పెద్దతమ్ముడికి 29 ఏళ్లు. సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. నెల్లాళ్ల కిందట 'బ్రెయిన్‌స్ట్రోక్'కు గురయ్యాడు. వెంటనే మంచి వైద్యం ఇప్పించడం వల్ల వెంటనే కోలుకున్నాడు. కుడి చేయి, కుడి కాలు ఇంకా స్వాధీనంలోకి రాలేదుగానీ ప్రాణాపాయం లేదనీ, ఫిజియోథెరపీ, మందులు వాడటం వల్ల తొందరలోనే కోలుకుంటాడని వైద్యులు తెలిపారు. ఇప్పుడు నాకూ, మా చిన్న తమ్ముడికి ఒక భయం పట్టుకుంది. నాన్నగారిలా, తమ్ముడిలా మాకూ పక్షవాతం వస్తుందా? 'బ్రెయిన్‌స్ట్రోక్' వంశపారంపర్యంగా వచ్చే జబ్బా? పక్షవాతం గురించి వివరాలను విపులంగా తెలియజేయండి.**

**– పి. ప్రశాంత్, నందికొట్కూరు**

పక్షవాతం (బ్రెయిన్‌స్ట్రోక్) వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి కాదు. ఈ విషయంలో మీరు ఎలాంటి భయాలూ, ఆందోళనలూ పెట్టుకోకుండా ధైర్యంగా ఉండండి. మీ ఫ్యామిలీ హిస్టరీలో పక్షవాతం ఉంది కాబట్టి బ్రెయిన్‌స్ట్రోక్‌కు దారితీసే ఇతర రిస్క్ ఫ్యాక్టర్స్... అంటే అధిక రక్తపోటు, డయాబెటిస్, హైకొలెస్ట్రాల్ వంటి వంశపారంపర్య వ్యాధుల పట్ల మీ కుటుంబ సభ్యులు జాగ్రత్త వహించాలి. మీరు క్రమం తప్పకుండా బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకుని, ఒకవేళ ఏమైనా తేడాలుంటే క్రమం తప్పకుండా మందులు వాడుతూ, ఇతర జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా బ్రెయిన్‌స్ట్రోక్ ముప్పు నుంచి కాపాడుకోవచ్చు.

పరిశోధనల ప్రకారం మహిళల కంటే పురుషుల్లో పక్షవాతం వచ్చే అవకాశాలు ఎక్కువ. పక్షవాతంలో రెండు రకాలున్నాయి.

**ఇస్కిమిక్ స్ట్రోక్ :** మెదడు మొత్తానికి నాలుగు రక్తనాళాలు రక్తాన్ని సరఫరా చేస్తాయి. ఇందులో రెండు రక్తనాళాలు మెదడు ఎడమవైపునకూ, రెండు కుడివైపునకూ వెళ్తాయి. ఈ రక్తనాళాల్లో ఎక్కడైనా రక్తం గడ్డకడితే రక్తప్రసరణకు ఆటంకం కలుగుతుంది. దాంతో మెదడుకు రక్తసరఫరా సరిగా జరగక, కణాలు చచ్చుబడిపోయి పక్షవాతం వస్తుంది. దాదాపు 80 శాతం కేసుల్లో ఇదే కారణం.

**హేమరేజిక్ స్ట్రోక్ :** రక్తనాళాల్లో ఏదైనా చిట్లిపోయి, రక్తం బయటకు రావడంతో మెదడులోని కణాలు దెబ్బతింటాయి. ఈ తరహా పక్షవాతం 20 శాతం కేసుల్లో కనిపిస్తుంటుంది.

ఈ రెండు కారణాల వల్ల ఎడమవైపు మెదడు భాగాలు దెబ్బతింటే శరీరంలోని కుడివైపున ఉండే అవయవాలు, కుడివైపు మెదడు భాగాలు దెబ్బతింటే ఎడమ వైపున ఉండే అవయవాలు దెబ్బతింటాయి.



**కారణాలు :** పక్షవాతం రావడానికి ప్రధాన కారణాలు అధిక రక్తపోటు. డయాబెటిస్. డ్రగ్స్, అధిక ఒత్తిడి కూడా ఇందుకు కారణాలే. ఇంతకుమునుపు ఇవి అరవై ఏళ్ల వయసులో కనిపించేవి. కానీ ఇప్పుడు మూడు పదుల్లోనే కనిపిస్తున్నాయి. అందుకే పక్షవాతం ఇప్పుడు చాలా చిన్న వయసువారిలోనూ కనిపిస్తోంది.

**ఎలా గుర్తించాలి :** ● మాటలో తేడా రావడం, నత్తినత్తిగా రావడం ● విన్నది అర్థం చేసుకోలేకపోవడం ● మూతి పక్కకి వెళ్లిపోవడం ● ఒకవైపు కాలు, చెయ్యి బలహీనం కావడం ● నడిస్తే అడుగులు తడబడటం... ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సీటీ స్కాన్ చేసి, తక్షణం చికిత్స మొదలుపెట్టాలి.

పక్షవాతం వచ్చిన మూడు నుంచి నాలుగున్నర గంటలలోపు చికిత్స అందించగలిగితే శరీరం చచ్చుబడకుండా కాపాడవచ్చు. ఇక ప్రధాన చికిత్స తర్వాత పక్షవాతం నుంచి పూర్తిగా కోలుకోడానికి ఫిజియోథెరపీ చికిత్స కూడా అవసరమవుతుంది.



**డా. జయదీప్ రాయ్ చౌధురి,**
సీనియర్ ఫిజీషియన్,
యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ,
హైదరాబాద్

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
సోమవారం
16-12-2019

**ఇంజనీరింగ్ స్పెషల్**


బీటెక్ అనంతరం విద్యార్థుల భవిష్యత్ ప్రయాణాన్ని 'ఉన్నత విద్య.. ఉద్యోగం'.. ఇలా రెండు కోణాల్లో చూడొచ్చు. వీటితో పాటు స్వయం ఉపాధి సైతం ఓ మార్గంగా ఉంటుంది.

» బీటెక్ పూర్తయ్యాక మార్గాలు.. ఉన్నత విద్య, ఉద్యోగం, స్టార్టప్
» ఎక్కువ మంది చూపు ఎంటెక్ లేదా ఎంబీఏ వైపు
» మరికొంత మందిది స్వయం ఉపాధి మార్గం

ఇంజనీరింగ్.. దేశంలో లక్షల మంది విద్యార్థుల కలల కెరీర్ గమ్యం! మన తెలుగు రాష్ట్రాల్లో మరికొద్ది నెలల్లో బీటెక్ చివరి సంవత్సరం పూర్తి చేసుకొని వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ పట్టాలతో బయటకు రానున్నారు. నాలుగేళ్లు కష్టపడి చదివి బీటెక్ పూర్తిచేసుకునే విద్యార్థులకు అందుబాటులో ఉన్న మార్గాలేమిటి.. ఉద్యోగాన్వేషణ.. లేక ఉన్నత విద్యకు ఓటేయాలా.. ఎంటెక్‌లో చేరాలా లేదా ఎంబీఏయేనా.. ఉన్నత విద్య వైపు వెళ్లాలనుకుంటే విద్యార్థుల ముందున్న మార్గాలేమిటి.. ఉద్యోగంలో స్థిరపడాలనుకుంటే ఎంచుకోవాల్సిన లక్ష్యాలేంటి?! బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రత్యేక కథనం...



# వాట్ ఆఫ్టర్ బీటెక్




## ఉన్నత విద్య.. ఎటు వైపు!

### ఎంటెక్.. కోర్‌పై పట్టు

మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఎంటెక్).. ఉన్నత విద్య పరంగా ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లకు అందుబాటులో ఉన్న పోస్టు గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సు. ఇంజనీరింగ్ విభాగాల్లోనే కొనసాగాలనుకొనే వారికి ఎంటెక్‌లో చేరడం లాభిస్తుంది. ఎంటెక్ పూర్తిచేయడం ద్వారా విద్యార్థులు ఆయా సబ్జెక్టులపై మరింత పట్టు సాధిస్తారు. స్పెషలైజ్డ్ కోర్సుల్లో ఎంటెక్ పూర్తి చేస్తే ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి. ఆకర్షణీయ వేతన ప్యాకేజీలు అందుకోవచ్చు. ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంటెక్ చదవాలనుకునే విద్యార్థులు.. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్)కు హాజరవ్వాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయి యూనివర్సిటీల్లో ఎంటెక్‌లో చేరాలనుకునే అభ్యర్థులు.. సదరు రాష్ట్రం నిర్వహించే పోస్టు గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(పీజీఈసెట్)కు హాజరవ్వాలి. వీటితోపాటు పలు డీమ్డ్ యూనివర్సిటీలు సొంతంగా ప్రవేశ పరీక్షలు నిర్వహించి.. విద్యార్థులను ఎంపిక చేస్తున్నాయి. విద్యార్థులు ఆయా అవకాశాలను అందిపుచ్చుకొని ఎంటెక్‌లో ప్రవేశం పొందవచ్చు.

### ఎంబీఏ వైపు చూపు


బీటెక్ తర్వాత ఎంబీఏలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. జాబ్ మార్కెట్ ట్రెండ్, ఆకర్షణీయ వేతనాలు, భవిష్యత్ కెరీర్ అవకాశాలు, కోర్ ఇంజనీరింగ్ కెరీర్‌పై అనాసక్తి తదితరాల కారణంగా విద్యార్థులు ఎంబీఏవైపు మొగ్గుచూపుతున్నారు. దేశంలోని ప్రతిష్టాత్మక బీస్కూల్స్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్స్ (ఐఐఎంలు)ల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్). ఈ పరీక్షకు హాజరై.. టాప్ పర్సంటైల్ దక్కించుకుంటున్న వారిలో ఇంజనీరింగ్ విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉండటమే దీనికి నిదర్శనం. ఇంజనీరింగ్ తర్వాత ఎంబీఏలో చేరాలనుకునే విద్యార్థులు క్యాట్‌తోపాటు, ఎక్స్ఏటీ, మ్యాట్, సీమ్యాట్, ఐసెట్ తదితర ప్రవేశ పరీక్షలు రాసి.. ఆయా మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం పొందొచ్చు.

### స్టార్టప్ ట్రెండ్

యువతలో ఇప్పుడు స్టార్టప్ ట్రెండ్ కనిపిస్తోంది. ఇంజనీరింగ్ పూర్తయ్యాక సరికొత్త ఆలోచనతో స్టార్టప్ దిశగా ప్రయత్నించొచ్చు. స్టార్టప్ ఐడియా నచ్చితే పెద్ద పెద్ద సంస్థలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తాయి. ప్రభుత్వాలు సైతం స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాయి. స్టార్టప్ కంపెనీ నిలదొక్కుకోవాలంటే.. చాలా సహనంతో కష్టపడాల్సి ఉంటుంది. కాబట్టి అన్ని విధాల ఆలోచించి స్టార్టప్‌ల స్థాపనకు ఉపక్రమించాలి. సవాళ్లను ఎదుర్కొనే సత్తా, మెండైన ఆత్మవిశ్వాసం ఉన్నవారు స్టార్టప్ దిశగా ప్రయత్నించవచ్చు. స్టార్టప్‌ల పరంగా ఆర్థిక వెసులుబాటు కూడా కీలకమే.

### జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో కొలువులు దక్కని విద్యార్థులు.. జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను ఎంచుకోవడం లాభిస్తుంది. ఎంబీఏ, ఎంటెక్ తదితర ఉన్నత విద్యా కోర్సులపై ఆసక్తి లేని వారు.. వీఎల్ఎస్ఐ, రోబోటిక్స్, ఎథికల్ హ్యాకింగ్, ప్రొటోకాల్ టెస్టింగ్, మెషిన్ డిజైనింగ్, ఎంబెడెడ్ టెక్నాలజీ వంటి జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను ఎంచుకోవచ్చు. తద్వారా ఆయా రంగాల్లోని కంపెనీల్లో కొలువులు దక్కించుకోవచ్చు.




### అభిరుచి, ఆసక్తికి పట్టం

చాలా మంది విద్యార్థులకు చదువుతోపాటు ఇతర అభిరుచులూ ఉంటాయి. జీవితంలో అకడమిక్ ప్రతిభ కంటే హాబీలతో పాపులర్ అయిన వారు కూడా ఉన్నారు. కాబట్టి ఇంజనీరింగ్ విద్యార్థులు చదువుతోపాటు స్వీయ అభిరుచులు ఏమిటో తెలుసుకొని.. ఆ దిశగా కొంత సమయం కేటాయించాలి. నాట్యం, ఫోటోగ్రఫీ, పెయింటింగ్, మ్యూజిక్, రైటింగ్, స్పోర్ట్స్, కళలు తదితరాలు హాబీలుగా ఉన్నవారు వాటికి కాస్త మెరుగులు దిద్దుకుంటే.. అవే కెరీర్‌గా మారే అవకాశం ఉంటుంది.

## టెక్నాలజీపై దృష్టిపెట్టండి

ప్రస్తుత పరిస్థితుల్లో బీటెక్ అర్హతతో ఉద్యోగం సంపాదించడం కొంత కష్టంగానే ఉంది. కాని కొన్ని ప్రత్యేక నైపుణ్యాలను సొంతం చేసుకోవడం ద్వారా కంపెనీల దృష్టిని ఆకర్షించి కొలువులు సొంతం చేసుకోవచ్చు. అలాగే అధిక వేతనాలు పొందేందుకు అవకాశం ఉంది. వీటిల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డేటా అనలిటిక్స్, బిగ్‌డేటా, క్లౌడ్‌కంప్యూటింగ్ వంటి టెక్నాలజీ ద్వారా ఉద్యోగావకాశాలు పొందొచ్చు.

### ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

పని పూర్తిచేయడంలో మానవ ప్రమేయాన్ని తగ్గించి.. రోబోలు, వర్చువల్ టెక్నాలజీ తదితరాల ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని సంస్థలు భావిస్తున్నాయి. ఫలితంగా ఆర్థిక వ్యయం తగ్గించుకొని.. క్లయింట్ సంస్థలకు వేగంగా సేవలందించొచ్చని పేర్కొంటున్నాయి. కాబట్టి బీటెక్ విద్యార్థులు బ్రాంచ్‌తో సంబంధం లేకుండా.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యాలపై అవగాహన పెంచుకుంటే.. జాబ్ మార్కెట్‌లో మంచి అవకాశాలు లభిస్తాయి.

### డేటా అనలిటిక్స్, బిగ్ డేటా

మారుతున్న పరిస్థితుల్లో ఇంజనీరింగ్ అభ్యర్థులు డేటా అనలిటిక్స్, బిగ్ డేటా నైపుణ్యాలపై ప్రధానంగా దృష్టిసారించాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కంపెనీలన్నీ వినియోగదారుల అభిరుచులు, ఆసక్తులకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులు, సేవలు అందించాలనే ప్రయత్నాల్లో ఉన్నాయి. డేటా అనలిటిక్స్, బిగ్‌డేటా టూల్స్‌ను వినియోగించడం అధికమైంది. కాబట్టి ఆయా నైపుణ్యాలను అలవరచుకోవడం ద్వారా కెరీర్‌ను సుస్థిరం చేసుకోవచ్చు.




### క్లౌడ్ కంప్యూటింగ్

క్లౌడ్ కంప్యూటింగ్ ప్రారంభంలో కొన్ని ఐటీ సంస్థలకే పరిమితమైనా.. ఇప్పుడంతటా విస్తరించింది. ఐటీ సంస్థలన్నీ తమ క్లయింట్‌లకు సులువైన మార్గంలో సమర్థమంతంగా సేవలందించేందుకు క్లౌడ్ టెక్నాలజీని వినియోగిస్తున్నాయి. బీటెక్ అనంతరం క్లౌడ్ కంప్యూటింగ్‌లో శిక్షణ తీసుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవచ్చు!!

## కొలువుల బాటలో

### సివిల్స్, గ్రూప్స్

బీటెక్ అనంతరం ప్రభుత్వ కొలువులో స్థిరపడాలనుకొనే విద్యార్థులు.. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్, ఫారెస్ట్ సర్వీసెస్, ఇంజనీరింగ్ సర్వీసెస్ వంటి పరీక్షలపై దృష్టిపెట్టొచ్చు. అలాగే స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే గ్రూప్ 1, 2 పరీక్షలు చక్కని అవకాశాలుగా చెప్పొచ్చు. సివిల్స్‌లో సత్తా చాటితే దేశ అత్యున్నత సర్వీసులుగా పేరొందిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర పోస్టులను దక్కించుకోవచ్చు. ఏటా సివిల్స్‌కు హాజరయ్యే ఇంజనీరింగ్ విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. సర్వీస్‌కు ఎంపికవుతున్న వారిలోనూ ఇంజనీరింగ్ నేపథ్యం ఉన్న అభ్యర్థులు ఎక్కువగానే ఉంటున్నారు. దీంతోపాటు స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) నిర్వహించే




పరీక్షల్లో ప్రతిభ చూపడం ద్వారా ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలు పొందొచ్చు. వీటికి దేశవ్యాప్తంగా ప్రతిభావంతులు పోటీ పడుతుంటారు. కాబట్టి సివిల్స్, గ్రూప్స్, ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు కచ్చితంగా ఎంపికవుతామనే గ్యారంటీ లేదు. కాబట్టి ప్రత్యామ్నాయ కెరీర్ మార్గాన్ని సిద్ధంగా ఉంచుకోవడం మేలు చేస్తుంది.

### త్రివిధ దళాలు

ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి త్రివిధ దళాల్లో సైతం ఉద్యోగాలు స్వాగతం పలుకుతున్నాయి. దేశానికి నేరుగా సేవచేసే అవకాశంతో పాటు సమాజంలో గౌరవం, ఆకర్షణీయమైన వేతనాలు లభిస్తుండటంతో యువతకు త్రివిధ దళాల కొలువులపై ఆసక్తి పెరుగుతోంది. ఇంజనీరింగ్ విద్యార్థులు ఆయా పరీక్షల ద్వారా డిఫెన్స్ సర్వీసుల్లో ఉద్యోగం సొంతం చేసుకోవచ్చు.

### పీఎస్‌యూ జాబ్స్

ప్రభుత్వ రంగ సంస్థలు గేట్ స్కోర్ ఆధారంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ట్రైనీ, ట్రైనీ ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్, మేనేజ్‌మెంట్ ట్రైనీ తదితర పోస్టులను భర్తీ చేస్తున్నాయి. ఇందుకోసం గేట్‌లో అత్యున్నత ప్రతిభ చూపాలి. దాంతోపాటు ఇంటర్వ్యూలోనూ రాణించాల్సి ఉంటుంది. పీఎస్‌యూ జాబ్స్ ద్వారా ఉజ్వలమైన కెరీర్ అవకాశాలతోపాటు ఆకర్షణీయ వేతనాలు అందుకోవచ్చు.

---

ఇంజనీరింగ్, టెక్నాలజీ కోర్సులను అందించడంలో పేరుగాంచిన.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాస్ (ఐఐటీఎం).. సోషల్ స్టడీస్‌లో ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులను కూడా అందిస్తుంది. ఏటా హెచ్ఎస్ఈఈ (హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్) ద్వారా ఆయా కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తోంది. ఇటీవల హెచ్ఎస్ఈఈ-2020 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. పరీక్షకు సంబంధించిన సమగ్ర సమాచారం...



హెచ్ఎస్ఈఈ-2020

# ఐఐటీలో ఎంఏ

ప్రపంచ వ్యాప్తంగా హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ కోర్సులు చదివిన వారికి ప్రస్తుతం డిమాండ్ పెరుగుతోంది. కాని అందుకు తగ్గ నైపుణ్యం కలిగిన మానవ వనరులు లభించడం లేదు. దాంతో ఐఐటీ మద్రాస్ ఇంటిగ్రేటెడ్ ఎంఏ కోర్సులను ప్రారంభించింది. ఏటా దేశవ్యాప్తంగా హెచ్ఎస్ఈఈ పరీక్ష నిర్వహించి.. అర్హత సాధించిన వారికి ఎంఏ ఇన్ డెవలప్‌మెంట్ స్టడీస్, ఇంటిగ్రేటెడ్ ఎంఏ ఇన్ ఇంగ్లిష్ స్టడీస్‌లో ప్రవేశం కల్పిస్తోంది. వీటి కాల వ్యవధి ఐదేళ్లు. ఈ కోర్సుల్లో భాగంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడానికి థింకింగ్, రీసెర్చ్, ఐడియాస్, పీపుల్, సొసైటీ, ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ కండిషన్ తదితర కోణాల్లో బోధన, శిక్షణ ఉంటుంది. ఐఐటీ మద్రాస్ అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఎంఏ కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆయా రంగాల్లో అవకాశాలు అందుకునే వీలుంది.

### కోర్సులు

- ఇంటిగ్రేటెడ్ ఎంఏ ఇన్ డెవలప్‌మెంట్ స్టడీస్
- ఇంటిగ్రేటెడ్ ఎంఏ ఇన్ ఇంగ్లిష్ స్టడీస్
- **మొత్తం సీట్లు:** 52

### అర్హతలు

- ప్రభుత్వ గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సుల్లో జనరల్, ఓబీసీ విద్యార్థులు 60 శాతం.. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత.

### ఎంపిక ప్రక్రియ

హెచ్ఎస్ఈఈ పరీక్షల్లో మెరిట్ సాధించిన అభ్యర్థుల కటాఫ్ మార్కులను పరిగణనలోకి తీసుకొని తుది ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఐఐటీ మద్రాస్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఏ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు.

### పరీక్ష విధానం

- హెచ్ఎస్ఈఈ పూర్తిగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ). ఈ పరీక్ష రెండు పార్ట్‌లుగా ఉంటుంది. పార్ట్-1లో మల్టిపుల్ ఛాయిస్



ప్రశ్నలు ఉంటాయి. పార్ట్-2లో ఎస్సే రైటింగ్ నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్‌లో ఉంటుంది.
- **పార్ట్-1 సిలబస్:** పార్ట్-1 పరీక్ష సమయం 2.30 గంటలు. ఇందులో ఇంగ్లిష్ అండ్ కాంప్రహెన్షన్ స్కిల్స్, అనలిటికల్ అండ్ క్వాంటిటేటివ్ ఎబిలిటి, జనరల్ స్టడీస్, ఎన్విరాన్‌మెంట్ అండ్ ఎకాలజీ నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. జనరల్ స్టడీలో ఇండియన్ ఎకానమీ, ఇండియన్ సొసైటీ అండ్ కల్చర్, వరల్డ్ అఫైర్స్‌పై ప్రశ్నలుంటాయి.
- పార్ట్ -2 ఎస్సేలో.. ప్రస్తుతం కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన అంశాల నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది.

### పరీక్ష ఫీజు

- జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ. 2400; ఎస్సీ, ఎస్టీ, మహిళా, దివ్యాంగులకు దరఖాస్తు ఫీజు రూ.1200. బ్యాంక్ చార్జీలకు అదనంగా రూ.40 చెల్లించాల్సి ఉంటుంది.
- ఆన్‌లైన్, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్/డెబిట్ కార్డ్ ద్వారా ఫీజు చెల్లించవచ్చు.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తు ముగింపు తేదీ:** జనవరి 22, 2020
- **అడ్మిట్ కార్డు:** మార్చి 18, 2020
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 19, 2020
- **ఫలితాలు:** మే 15, 2020
- **ఆఫర్ లెటర్:** మే 16, 2020
- **వెబ్‌సైట్:** http://hsee.iitm.ac.in/

---

# ఉద్యోగ సమాచారం

## ఐఏఎఫ్-ఎయిర్‌మెన్ పోస్టులు

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్)..అవివాహితులైన పురుష అభ్యర్థుల నుంచి గ్రూప్-ఎక్స్, గ్రూప్-వై ట్రేడుల్లో ఖాళీగా ఉన్న ఎయిర్‌మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. గ్రూప్-ఎక్స్ ట్రేడులు (ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ ట్రేడ్ మినహాయించి)
   » **అర్హత:** మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్/ఏదైనా విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
2. గ్రూప్-వై ట్రేడులు (ఆటోమొబైల్ టెక్నీషియన్, జీటీఐ, ఐఏఎఫ్ (పీ), ఐఏఎఫ్ (ఎస్), మ్యుజీషియన్ ట్రేడులు మినహాయించి).
   » **అర్హత:** ఇంటర్మీడియెట్/10+2 ఉత్తీర్ణత.
3. గ్రూప్-వై మెడికల్ అసిస్టెంట్ ట్రేడ్
   » **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్/10+2 ఉత్తీర్ణత

- **వయసు:** 2000, జనవరి 17 నుంచి 2003, డిసెంబర్ 30 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్షతేదీ:** 2020, మార్చి 19-23 వరకు జరుగుతాయి.
- **పరీక్ష ఫీజు:** రూ.250.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** జనవరి 2, 2020.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 20, 2020.
- **వెబ్‌సైట్:** https://indianairforce.nic.in

## ఏపీఎస్-32

హైదరాబాద్ (గోల్కొండ)లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ (ఏపీఎస్).. 32 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** పీజీటీ-3, టీజీటీ-12, పీఆర్‌టీ-15, పీఈటీ-2.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఈ-మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 5, 2020.
- **వెబ్‌సైట్:** https://apsgolconda.edu.in

## డీఆర్‌డీఓ (సెప్టం)-1817

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)కి చెందిన సెంటర్ ఫర్ పర్సనల్ టాలెంట్ మేనేజ్‌మెంట్ (సెప్టం).. 1817 మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** పదోతరగతి/ఐటీఐ/తత్సమాన కోర్సులు ఉత్తీర్ణత.
- **వయసు:** 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) టైర్-1, టైర్-2 ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** డిసెంబర్ 23, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 23, 2020.
- **వెబ్‌సైట్:** www.drdo.gov.in

## ఎన్ఎస్ఐఎల్-7

బెంగళూరులోని ఇస్రోకి చెందిన న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 7 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** కంపెనీ సెక్రటరీ-1, డిప్యూటీ మేనేజర్-6.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, బీఈ/బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్ష తేదీ:** ఫిబ్రవరి 9, 2020.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 31, 2019.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500.
- **వెబ్‌సైట్:** http://nsilindia.co.in

## నీరి-95

నాగ్‌పూర్‌లోని సీఎస్ఐఆర్-నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (నీరి) తాత్కాలిక ప్రాతిపదికన 95 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ప్రాజెక్ట్ అసిస్టెంట్-58
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ, ఎంఎస్సీ ఉత్తీర్ణత.
- **వయసు:** పోస్టులను బట్టి 28-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈ-మెయిల్/ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 31, 2019.
- **పర్సనల్ ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 9, 2020.


2. ప్రాజెక్ట్ అసిస్టెంట్-37
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ, ఎంఎస్సీ ఉత్తీర్ణత.
- **వయసు:** పోస్టులను బట్టి 28-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈ-మెయిల్/ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 23, 2019.
- **పర్సనల్ ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 2, 2020.
- **వెబ్‌సైట్:** www.neeri.res.in

## ఐఐఎఫ్‌సీఎల్-8

ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ఐఐఎఫ్‌సీఎల్).. 8 అసిస్టెంట్ మేనేజర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** పీజీ/ఎంబీఏ/పీజీడీఎం/సీఏ/బీటెక్/ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** ప్రిలిమినరీ స్క్రీనింగ్, రాతపరీక్ష, బిహేవియరల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 31, 2019.
- **వెబ్‌సైట్:** www.iifcl.org

టి20 సిరీస్ గెలిచి ఊపు మీదున్న భారత్‌కు వెస్టిండీస్ గట్టి షాకే ఇచ్చింది. తొలి వన్డేలో ఆతిథ్య జట్టును ఊహించని రీతిలో చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ఇరుజట్ల మధ్య ఒక్కటే తేడా... భారత టాపార్డర్ (రోహిత్, రాహుల్, కోహ్లి) చేతులెత్తేస్తే... ప్రత్యర్థి టాపార్డర్ ఆడుతూ పాడుతూ భారీ లక్ష్యాన్ని ఛేదించేసింది. విండీస్ ఓపెనర్ షై హోప్, వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ హెట్‌మైర్ శతకాలతో కదంతొక్కి తమ జట్టును విజయతీరాలకు చేర్చారు.


కోహ్లిని బౌల్డ్ చేశాక... సెల్యూట్‌తో కాట్రెల్ సంబరం



హెట్‌మైర్
పరుగులు 139
బంతులు 106
ఫోర్లు 11
సిక్స్‌లు 7

# సెంచరీలతో షాక్ ఇచ్చారు

## చెరో శతకం బాదిన హెట్‌మైర్, షై హోప్

- తొలి వన్డేలో భారత్‌పై 8 వికెట్ల తేడాతో విండీస్ జయభేరి
- టాపార్డర్‌ను పడేసిన కాట్రెల్
- రాణించిన అయ్యర్, పంత్
- రెండో వన్డే 18న వైజాగ్‌లో

**చెన్నై:** వన్డే సిరీస్‌లో తొలి పంచ్ కరీబియన్‌దే. టీమిండియాకు ఊహించని షాక్ ఇచ్చిన వెస్టిండీస్ యువ జట్టు తొలి వన్డేలో 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. అయ్యర్ (88 బంతుల్లో 70; 5 ఫోర్లు, 1 సిక్స్), పంత్ (69 బంతుల్లో 71; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు సాధించారు. విండీస్ బౌలర్లలో కాట్రెల్, కీమో పాల్, జోసెఫ్ తలా 2 వికెట్లు తీశారు. తర్వాత వెస్టిండీస్ 47.5 ఓవర్లలో 2 వికెట్లకు 291 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ షై హోప్ (151 బంతుల్లో 102 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ సాధించగా... 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' హెట్‌మైర్ (106 బంతుల్లో 139; 11 ఫోర్లు, 7 సిక్సర్లు) భారత్‌పై ఫైర్ అయ్యాడు. మూడు వన్డేల సిరీస్‌లో విండీస్ 1–0తో ముందంజ వేసింది. రెండో వన్డే ఈనెల 18న విశాఖపట్నంలో జరుగుతుంది.


కోహ్లి

### ఇద్దరే ఇరగదీశారు...

భారత్ నిర్దేశించిన లక్ష్యం 288 పరుగులు కష్టమైందే! కానీ విండీస్ మాత్రం ఇద్దరంటే ఇద్దరితో సులువుగా ఛేదించేసింది. మొదట నింపాదిగా ఆడి 10 ఓవర్ల తర్వాత ఆటతీరు మార్చుకుంది. విజయానికి అవసరమైన రన్‌రేట్ పడిపోకుండా... పరుగుల్ని చకాచకా చేసేసింది. తొలుత ఆట మొదలైన కాసేపటికే అంబ్రిస్ (9) వికెట్‌ను చాహర్ బౌలింగ్‌లో కోల్పోయింది. దీపక్ చాహర్ ఇచ్చిన ఈ ఆనందం మ్యాచ్ సాగేకొద్దీ ఆవిరైంది. పవర్‌ప్లే పది ఓవర్లలో వికెట్ నష్టానికి 36 పరుగులే చేసిన విండీస్ తర్వాత విజయమే లక్ష్యంగా అడ్డుఅదుపూ లేకుండా సాగిపోయింది. ఓపెనర్ హోప్ అండతో హెట్‌మైర్ చెలరేగాడు. 50 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా... విండీస్ 21.3 ఓవర్లో వంద పరుగులు దాటింది. అర్ధసెంచరీ తర్వాత హెట్‌మైర్ భారీషాట్లతో విరుచుకుపడ్డాడు. నింపాదిగా ఆడిన హోప్ 92 బంతుల్లో ఫిఫ్టీ చేయగా... హెట్‌మైర్ 85 బంతుల్లోనే (8 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ బాదాడు. కోహ్లి పేసర్లను, స్పిన్నర్లను మార్చినా, పార్ట్‌టైమ్ బౌలర్లతో బౌలింగ్ వేయించినా... ఈ జోడీ ని మాత్రం విడగొట్టలేకపోయాడు. హెట్‌మైర్ వ్యక్తిగత స్కోరు 106 పరుగుల వద్ద అతను ఇచ్చిన క్యాచ్‌ను శ్రేయస్ అయ్యర్ వదిలేశాడు. 36వ ఓవర్లో వెస్టిండీస్ స్కోరు 200 పరుగులకు చేరింది. దుర్భేధ్యంగా సాగిపోతున్న ఈ భాగస్వామ్యాన్ని షమీ గెలుపుదారిన పడిన తర్వాతే విడగొట్టగలిగాడు. జట్టు స్కోరు 229 వద్ద హెట్‌మైర్‌ను ఔట్ చేయడంతో 218 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత హోప్‌కు నికోలస్ పూరన్ (29 నాటౌట్; 4 ఫోర్లు) జతయ్యాడు. ఇతని అండతో 149 బంతుల్లో (7 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ పూర్తి చేసిన హోప్... జట్టు గెలిచేదాకా అజేయంగా నిలిచాడు.

### కోహ్లి బౌల్డ్...

టాస్ నెగ్గిన విండీస్ కెప్టెన్ పొలార్డ్ బౌలింగ్‌కే మొగ్గు చూపాడు. తన కెప్టెన్ నిర్ణయం సరైందేనని లెఫ్టార్మ్ పేసర్ కాట్రెల్ చేతల్లో చూపాడు. భారత ఓపెనర్లు రోహిత్, రాహుల్ అతని మూడో ఓవర్లోగానీ పరుగులు చేయలేకపోయారు. 6 ఓవర్లయిన భారత్ (19/0) ఇరవై పరుగులు చేయలేకపోయింది. అసలే చప్పగా సాగుతున్న ఇన్నింగ్స్‌ను కాట్రెల్ దెబ్బ మీద దెబ్బ తీసి కష్టాల్లో పడేశాడు. ఇన్నింగ్స్‌లో ఏడో ఓవర్ రెండో బంతికి రాహుల్ (6)ను హెట్‌మైర్ క్యాచ్‌తో బొల్తా కొట్టించిన కాట్రెల్, ఆఖరి బంతికి కెప్టెన్ కోహ్లి (4)ని బౌల్డ్ చేశాడు. అంతే 25 పరుగులకే 2 వికెట్లను కోల్పోయింది. తర్వాత ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌ను మెయిడెన్‌గా వేశాడు. అంటే కాట్రెల్ తన 5 ఓవర్ల స్పెల్‌లో మూడు ఓవర్లు పరుగు ఇవ్వకుండానే ముగించడం విశేషం.

### ఆదుకున్న అయ్యర్, పంత్...

తర్వాత రోహిత్ శర్మ (56 బంతుల్లో 36; 6 ఫోర్లు)కు శ్రేయస్ అయ్యర్ జతయ్యాడు. ఇద్దరు ఆచితూచి ఆడారు. జట్టు 13వ ఓవర్లో జట్టు స్కోరు 50 పరుగులు దాటింది. పరుగుల వేగం పెరుగుతున్న దశలో జోసెఫ్ బౌలింగ్‌లో 'హిట్ మ్యాన్' అవుటయ్యాడు. దీంతో భారత్ 80 పరుగులకే కీలకమైన మూడు టాపార్డర్ వికెట్లను కోల్పోయింది. ఈ దశలో రిషభ్ పంత్ క్రీజులోకి వచ్చాడు. 25వ ఓవర్లో భారత్ 100 పరుగులు పూర్తయ్యాయి. ధోని వారసుడిగా వచ్చిన పంత్ ఎట్టకేలకు ధోని ఐపీఎల్ గడ్డ (చెన్నై)పై జట్టుకు అక్కరకొచ్చే ఇన్నింగ్స్ ఆడాడు. ఒక్క సిక్సర్ లేని ఇన్నింగ్స్‌కు ఆ మెరుపు వెలతి తీర్చాడు. ఎట్టకేలకు స్పిన్నర్ చేజ్ బౌలింగ్‌లో పంత్ మిడ్‌వికెట్ మీదుగా భారీ సిక్సర్ బాదాడు. అలా 28 ఓవర్లకుగానీ భారత ఇన్నింగ్స్‌లో తొలి సిక్సర్ నమోదైంది. రన్‌రేట్ కూడా మెరుగవడంతో 31.3 ఓవర్లోనే 150 పరుగులుకు చేరింది. ఈ క్రమంలోనే అయ్యర్ 70 బంతుల్లో, పంత్ 49 బంతుల్లో ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. వన్డేలో పంత్‌కి ఇదే తొలి అర్ధ సెంచరీ. ఇద్దరు కలిసి నాలుగో వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. 194 జట్టు స్కోరు వద్ద శ్రేయస్, మరో 16 పరుగుల వ్యవధిలో 210 వద్ద పంత్ నిష్క్రమించారు. అనంతరం కేదార్ జాదవ్ (35 బంతుల్లో 40; 3 ఫోర్లు, 1 సిక్స్), జడేజా (21 బంతుల్లో 21; 2 ఫోర్లు) ధాటిగా ఆడి ఆఖరి ఓవర్లలో ఔటయ్యారు.



షై హోప్
పరుగులు 102 నాటౌట్
బంతులు 151
ఫోర్లు 7
సిక్స్‌లు 1


అయ్యర్ పంత్

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (సి) పొలార్డ్ (బి) జోసెఫ్ 36; రాహుల్ (సి) హెట్‌మైర్ (బి) కాట్రెల్ 6; కోహ్లి (బి) కాట్రెల్ 4; శ్రేయస్ (సి) పొలార్డ్ (బి) జోసెఫ్ 70; పంత్ (సి) హెట్‌మైర్ (బి) పొలార్డ్ 71; కేదార్ (సి) పొలార్డ్ (బి) కీమో పాల్ 40; జడేజా (రనౌట్) 21; శివమ్ దూబే (సి) హోల్డర్ (బి) కీమో పాల్ 9; చాహర్ (నాటౌట్) 6; షమీ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 287.**
**వికెట్ల పతనం:** 1–21, 2–25, 3–80, 4–194, 5–210, 6–269, 7–269, 8–282. బౌలింగ్: కాట్రెల్ 10–3–46–2, హోల్డర్ 8–0–45–0, వాల్ష్ 5–0–31–0, కీమోపాల్ 7–0–40–2, జోసెఫ్ 9–1–45–2, చేజ్ 7–0–42–0, పొలార్డ్ 4–0–28–1.

**వెస్టిండీస్ ఇన్నింగ్స్:** హోప్ (నాటౌట్) 102; అంబ్రిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) దీపక్ చాహర్ 9; హెట్‌మైర్ (సి) అయ్యర్ (బి) షమీ 139; పూరన్ (నాటౌట్) 29; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (47.5 ఓవర్లలో 2 వికెట్లకు) 291.**
**వికెట్ల పతనం:** 1–11, 2–229. బౌలింగ్: దీపక్ చాహర్ 10–1–48–1, షమీ 9–1–57–1, కుల్దీప్ 10–0–45–0, దూబే 7.5–0–68–0, కేదార్ జాదవ్ 1–0–11–0, రవీంద్ర జడేజా 10–0–58–0.

## అంపైర్... జడేజా ఔటే!



పాల్ వేసిన 48వ ఓవర్లో ఫీల్డ్ అంపైర్ పొరపాటుతో జడేజా బతికి పోయేవాడు. కానీ నిర్ణయం ఆలస్యమైనా... చివరకు వెను దిరగాల్సి వచ్చింది. అసలేం జరిగిందంటే... 47.4 ఓవర్లో జడేజా మిడ్‌వికెట్‌లో బంతిని ఆడాడు. అతను క్రీజ్‌లోకి రాకముందే చేజ్ డైరెక్ట్ త్రోతో నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో వికెట్లను గిరాటే వేశాడు. జడేజా రనౌటయ్యాడు. కానీ మొదట దీన్ని ఫీల్డ్ అంపైర్ షాన్ జార్జ్ (దక్షిణాఫ్రికా) గుర్తించలేదు. 51 వన్డేల్లో అంపైరింగ్ చేసిన అనుభవమున్న జార్జ్ కనీసం మూడో అంపైర్‌కు నివేదించలేదు. విండీస్ ఫీల్డర్లు కూడా తొలుత మిన్నకుండి... ఆలస్యంగా స్పందించారు. దీంతో అంపైర్ షాన్ జార్జ్ థర్డ్ అంపైర్‌ను ఆశ్రయించాక జడేజా వెనుదిరిగాడు.

### మైదానంలోకి 'భౌ-భౌ'



భారత ఇన్నింగ్స్ సమయంలో ఓ శునకం మైదానంలోకి వచ్చేసింది. పంత్, శ్రేయస్ అయ్యర్‌లు క్రీజ్‌లో కుదురుగా ఆడుతుండగా 26వ ఓవర్లో కుక్క ఫీల్డ్‌లోకి ఎంటరైంది. స్టేడియం సిబ్బంది, భద్రత వర్గాలు దాన్ని తరిమేశాక ఆట మొదలైంది.

## ఇదేం నిబంధన...

జడేజా రనౌట్‌పై నాకు తీవ్ర అసంతృప్తి ఉంది. దానిపై అర్థంలేని సమీక్షకెందుకెళ్లారో అర్థం కావడం లేదు. ఎందుకంటే ఫీల్డర్ చేసిన అప్పీల్‌కు మైదానంలోని అంపైర్ వెంటనే నాటౌట్ అన్నాడు. అక్కడితోనే అది ముగిసింది. బయటివారు చెబితే ఫీల్డర్లు అంపైర్‌ను సమీక్ష కోరడమేంటి? క్రికెట్‌లో నేనేప్పుడూ ఈ రకమైన అంపైరింగ్ చూడలేదు. ఆ రూలేంటో మరి? అది ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. దీన్ని మ్యాచ్ రిఫరీ, అంపైర్లే సరిచేయాలి. ఇది మరోమారు పునరావృతం కాకుండా చూడాలి. టీవీల్లో మ్యాచ్ చూసే బయటివ్యక్తులు ఫీల్డును శాసించడమేంటి?

–భారత కెప్టెన్ కోహ్లి

### 228

ఈ మ్యాచ్ ద్వారా ఆల్‌రౌండర్ శివమ్ దూబే భారత్ తరఫున వన్డేల్లో అరంగేట్రం చేసిన 228వ క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా ఈ ఏడాది భారత్ తరఫున వన్డేల్లో నలుగురు క్రికెటర్లు సిరాజ్, విజయ్ శంకర్, శుబ్‌మన్ గిల్ అరంగేట్రం చేశారు.

## లక్ష్య సేన్ ఖాతాలో ఐదో టైటిల్



**ఢాకా:** భారత యువ షట్లర్ లక్ష్య సేన్ ఈ ఏడాదిని మరో టైటిల్‌తో ముగించాడు. ఆదివారం ముగిసిన బంగ్లాదేశ్ ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీలో 18 ఏళ్ల లక్ష్య సేన్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో ఉత్తరాఖండ్‌కు చెందిన లక్ష్య సేన్ 22–20, 21–18తో లియోంగ్ జున్ హావో (మలేసియా)పై విజయం సాధించాడు. తాను పాల్గొన్న గత ఏడు టోర్నీలలో లక్ష్య సేన్ ఐదు టోర్నీలలో చాంపియన్‌గా నిలువడం విశేషం. బెల్జియం ఓపెన్, డచ్ ఓపెన్, సార్లార్‌లక్స్ ఓపెన్, స్కాటిష్ ఓపెన్ టోర్నీల్లో లక్ష్య సేన్ టైటిల్స్ సాధించాడు. మహిళల డబుల్స్‌లో కె.మనీషా–రితూపర్ణ (భారత్) ద్వయం... పురుషుల డబుల్స్‌లో ఎం.ఆర్.అర్జున్–ధ్రువ్ కపిల జంట రన్నరప్‌గా నిలిచాయి. ఫైనల్స్‌లో మనీషా–రితూపర్ణ జోడీ 20–22, 19–21తో తాన్ పియర్లీ కూంగ్ లీ–థినా మురళీథరన్ (మలేసియా) ద్వయం చేతిలో... అర్జున్–ధ్రువ్ జంట 19–21, 16–21తో యీ జున్ చాంగ్–కై వున్ తీ (మలేసియా) జోడీ చేతిలో ఓడిపోయాయి.

## ఆబిద్ అలీ అరుదైన ఘనత

- టెస్టు, వన్డే మ్యాచ్‌ల అరంగేట్రంలో సెంచరీలు చేసిన తొలి క్రికెటర్‌గా గుర్తింపు
- పాకిస్తాన్, శ్రీలంక తొలి టెస్టు 'డ్రా'

**రావల్పిండి:** ఊహించిన ఫలితమే వచ్చింది. తొలి నాలుగు రోజులు వర్షం అంతరాయం కలిగించిన పాకిస్తాన్, శ్రీలంక జట్ల మధ్య తొలి టెస్టు మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. చివరిరోజు ఎండ కాయడంతో పూర్తి ఓవర్లు సాధ్యమయ్యాయి. ఓవర్‌నైట్ స్కోరు 282/6తో ఆట చివరి రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక ఆరు వికెట్లకు 308 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. ధనంజయ డి సిల్వా (102 నాటౌట్; 15 ఫోర్లు) అజేయ సెంచరీ చేశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ ఆట ముగిసే సమయానికి 70 ఓవర్లలో 2 వికెట్లకు 252 పరుగులు చేసింది. ఓపెనర్ ఆబిద్ అలీ (109 నాటౌట్; 11 ఫోర్లు), బాబర్ ఆజమ్ (102 నాటౌట్; 14 ఫోర్లు) అజేయ సెంచరీలు చేశారు. ఈ శతకంతో ఆబిద్ అలీ అరుదైన ఘనత సాధించాడు. పురుషుల క్రికెట్‌లో టెస్టు, వన్డే అరంగేట్రం మ్యాచ్‌ల్లో సెంచరీలు చేసిన తొలి బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందాడు. ఈ ఏడాది దుబాయ్‌లో ఆస్ట్రేలియాతో ఆడిన తాను ఆడిన తొలి వన్డేలో ఆబిద్ అలీ 112 పరుగులు చేశాడు. పురుషుల క్రికెట్ కంటే ముందుగా మహిళల క్రికెట్‌లో ఈ ఘనత నమోదైంది. ఇంగ్లండ్‌కు చెందిన ఎనిడ్ బ్లాక్‌వెల్ తాను ఆడిన తొలి టెస్టు (1968లో ఆస్ట్రేలియాపై 113)లో, తొలి వన్డేలో (1973లో ఇంటర్నేషనల్ ఎలెవన్‌పై 101 నాటౌట్) సెంచరీలు చేసింది.


ఆబిద్


ఆజమ్

## మొమోటా మ్యాజిక్...

- వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీలోనూ విజేత
- ఈ ఏడాది 11వ సింగిల్స్ టైటిల్‌తో కొత్త రికార్డు



**గ్వాంగ్‌జౌ (చైనా):** తన అద్వితీయ ఫామ్‌ను కొనసాగిస్తూ ప్రపంచ నంబర్‌వన్, ప్రపంచ చాంపియన్ కెంటో మొమోటా (జపాన్) 2019 సీజన్‌ను టైటిల్‌తో ముగించాడు. సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో మొమోటా విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ మొమోటా 87 నిమిషాల్లో 17–21, 21–17, 21–14తో ఆంథోనీ జిన్‌టింగ్ (ఇండోనేసియా)పై అద్భుత విజయం సాధించాడు. ఈ ఏడాది మొమోటా 12 టోర్నీల్లో ఫైనల్స్ చేరగా... 11 టోర్నీల్లో టైటిల్స్ సాధించాడు. తద్వారా బ్యాడ్మింటన్ చరిత్రలో ఒకే ఏడాది అత్యధికంగా 11 టైటిల్స్ గెలిచిన తొలి ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇప్పటిదాకా ఈ రికార్డు లీ చోంగ్ వీ (మలేసియా), వాంగ్ జియోలి–యు యాంగ్ (చైనా) జంట పేరిట ఉండేది. 2010లో లీ చోంగ్ వీ సింగిల్స్ విభాగంలో 10 టైటిల్స్ నెగ్గగా... 2011లో వాంగ్ జియోలి–యు యాంగ్ జోడీ మహిళల డబుల్స్ విభాగంలో 10 టైటిల్స్ సాధించింది.

జిన్‌టింగ్‌తో జరిగిన ఫైనల్లో మొమోటా అద్భుతమే చేశాడు. తొలి గేమ్ కోల్పోయిన ఈ జపాన్ స్టార్ రెండో గేమ్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో ఒకదశలో 5–12తో ఏడు పాయింట్లతో వెనుకబడి ఉన్నాడు. అయితే ఈ టోర్నీకంటే ముందు తాను ఆడిన నాలుగు టోర్నీల ఫైనల్స్‌లోనూ ఓడిపోయిన జిన్‌టింగ్ కీలకదశలో ఒత్తిడికి లోనయ్యాడు. వరుసగా ఏడు పాయింట్లు గెలిచిన మొమోటా స్కోరును 12–12తో సమం చేశాడు. ఆ తర్వాత స్కోరు 15–14 వద్ద మొమోటా ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఆరు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌నూ కైవసం చేసుకున్నాడు. దాంతో జిన్‌టింగ్ ఈ ఏడాది ఆడిన ఐదు టోర్నీల ఫైనల్స్‌లో ఓటమిని మూటగట్టుకున్నాడు. చాంపియన్ మొమోటాకు లక్షా 20 వేల డాలర్లు (రూ. 84 లక్షల 83 వేలు), రన్నరప్ జిన్‌టింగ్‌కు 60 వేల డాలర్లు (రూ. 42 లక్షల 41 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

*ఈ సంవత్సరం మొమోటా చైనా మాస్టర్స్, డెన్మార్క్ ఓపెన్, కొరియా ఓపెన్, చైనా ఓపెన్, ప్రపంచ చాంపియన్‌షిప్, జపాన్ ఓపెన్, ఆసియా చాంపియన్‌షిప్, సింగపూర్ ఓపెన్, ఆల్ ఇంగ్లండ్ ఓపెన్, జర్మన్ ఓపెన్‌లలో విజేతగా నిలిచాడు.*

## 'ఆసియా' చాంప్ తస్నిమ్

**సురబాయ (ఇండోనేసియా):** ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్–15 బాలికల సింగిల్స్ విభాగంలో భారత అమ్మాయి తస్నిమ్ మీర్ విజేతగా అవతరించింది. భారత్‌కే చెందిన తారా షాతో ఆదివారం జరిగిన ఫైనల్లో తస్నిమ్ మీర్ 17–21, 21–11, 21–19తో విజయం సాధించింది. గుజరాత్‌కు చెందిన 13 ఏళ్ల తస్నిమ్ తన తల్లితో కలిసి 2017లో హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో చేరి ఆయన వద్దే శిక్షణ తీసుకుంటోంది. తస్నిమ్ తండ్రి ఇర్ఫాన్ అలీ గుజరాత్‌లోని మెహసానా జిల్లాలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో ఖేలో ఇండియా గేమ్స్‌లో అండర్–17 సింగిల్స్ విభాగంలో స్వర్ణం నెగ్గిన తస్నిమ్ గతేడాది ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి మేఘన రెడ్డితో కలిసి అండర్–15 డబుల్స్ విభాగంలో టైటిల్ సాధించింది.



## ఆసీస్ భారీ విజయం

**296 పరుగుల తేడాతో కివీస్ ఓటమి**



**పెర్త్:** స్వదేశంలో డే నైట్ టెస్టుల్లో అజేయ రికార్డును కొనసాగిస్తూ ఆస్ట్రేలియా జట్టు మరో విజయం నమోదు చేసింది. న్యూజిలాండ్‌తో నాలుగో రోజే ముగిసిన డే నైట్ తొలి టెస్టులో ఆస్ట్రేలియా 296 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. దాంతో ఆస్ట్రేలియా గడ్డపై ఇప్పటివరకు జరిగిన ఏడు డే నైట్ టెస్టుల్లో ఆసీస్‌నే విజయం వరించింది. 468 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 65.3 ఓవర్లలో 171 పరుగులకే ఆలౌటైంది. ఆసీస్ బౌలర్లు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' స్టార్క్ (4/45), లయన్ (4/63), కమిన్స్ (2/31) న్యూజిలాండ్ పతనాన్ని శాసించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 167/6తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 9 వికెట్లకు 217 పరుగులవద్ద డిక్లేర్ చేసి న్యూజిలాండ్‌కు 468 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా మూడు టెస్టుల సిరీస్‌లో 1–0తో ఆధిక్యం సంపాదించింది. రెండో టెస్టు ఈనెల 26న మెల్‌బోర్న్‌లో మొదలవుతుంది.

## బెంగళూరుకు ముంబై షాక్

**బెంగళూరు:** ఈ ఏడాది ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో అజేయంగా ఉన్న బెంగళూరు ఎఫ్‌సీకి ముంబై సిటీ ఎఫ్‌సీ షాకిచ్చింది. దీంతో బెంగళూరుకు తొలి ఓటమి ఎదురైంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 2–3తో ముంబై చేతిలో ఓడింది. ముంబై ఆటగాళ్లలో సుభాషిశ్ బోస్ (12వ ని.లో), కార్లోస్ (77వ ని.లో), బోర్జెస్ (90+4వ ని.లో)... బెంగళూరు తరఫున మాటో (ఓన్ గోల్– 58వ ని.లో), సునీల్ ఛెత్రి (89వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

## స్టార్స్ అందరూ వస్తున్నారు

**ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు టాప్ ర్యాంకర్ల ఎంట్రీలు ఖరారు**

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఈసారి స్టార్ క్రీడాకారులందరూ బరిలోకి దిగనున్నారు. వచ్చే ఏడాది జనవరి 20 నుంచి ఫిబ్రవరి 7 వరకు జరిగే ఈ టోర్నీకి సంబంధించి శనివారంతో ఎంట్రీల తుది గడువు ముగిసింది. మాజీ విజేత అజరెంకా మినహా పురుషుల, మహిళల సింగిల్స్ విభాగాల్లో టాప్–50లోని క్రీడాకారులందరూ తమ ఎంట్రీలను ఖరారు చేశారు. పురుషుల సింగిల్స్ విభాగంలో నంబర్‌వన్ నాదల్ (స్పెయిన్)తోపాటు జొకోవిచ్ (సెర్బియా), ఫెడరర్ (స్విట్జర్లాండ్)... మహిళల సింగిల్స్‌లో టాప్ ర్యాంకర్ యాష్లే బార్టీ (ఆస్ట్రేలియా), ఏడుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత సెరెనా విలియమ్స్ (అమెరికా) మెల్‌బోర్న్‌కు రానున్నారు.

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 428 ▲ | 115 ▲ |
| 41,010 | 12,087 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు


| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,735 | ▲ 18 |
| డోజోన్స్ | 28,135 | ▲ 3 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,353 | ▲ 80 |
| డాక్స్ | 13,283 | ▲ 61 |
| షాంఘై | 2,968 | ▲ 52 |
| నిక్కాయ్ | 24,023 | ▲ 598 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 69.85 | 71.49 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 93.49 | 96.80 |
| యూరో | ఎస్‌బీఐ | 77.50 | 80.43 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.30 | 65.68 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.92 | 50.08 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.38 | 53.17 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.10 | 19.70 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.82 | 19.82 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.52 | 10.93 |

# భారత్ బాండ్.. ఇన్వెస్ట్ చేస్తున్నారా?



## రిస్క్ వద్దనుకునే వారికి సురక్షిత సాధనం

- 6.5-7.5 శాతం మధ్య రాబడులు
- మూడేళ్లు, పదేళ్ల కాల వ్యవధులు
- స్టాక్ ఎక్ఛేంజీలలో కూడా ట్రేడింగ్

**భారత్ బాండ్ ఈటీఎఫ్.. నూతన మ్యూచువల్ ఫండ్స్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) ఈ నెల 12న ప్రారంభమైంది. ఈ నెల 20 వరకు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఉంటుంది. రిస్క్ లేకుండా బ్యాంకు డిపాజిట్ల స్థాయిలో రాబడులు కోరుకునే వారు ఇష్యూను పరిశీలించొచ్చు. ఈ ఇష్యూ ద్వారా కనీసం రూ.7,000 కోట్ల వరకు సమీకరించాలన్నది ప్రణాళిక. దేశంలో తొలి కార్పొరేట్ బాండ్ ఫండ్ ఇదే అవుతుంది. ఈ ఇష్యూకు సంబంధించి పూర్తి వివరాలను తెలుసుకుంటే, అప్పుడు ఇన్వెస్ట్ చేయవచ్చా? లేదా? అన్నది ఇన్వెస్టర్లు సులభంగా నిర్ణయించుకోగలరు. ఆ వివరాలు అందించే 'ప్రాఫిట్' కథనమే ఇది.**

●●●

**భారత్ బాండ్ ఈటీఎఫ్‌ను కేంద్రం తీసుకురావడం వెనుక లక్ష్యాలను పరిశీలిస్తే.. దేశీయ డెట్ మార్కెట్లో లిక్విడిటీని మరింత పెంచడం ఒకటి. రిటైల్ ఇన్వెస్టర్లు సులభంగా పాలు పంచుకునేలా చేయడం రెండోది. తక్కువ ఖర్చుకే బాండ్ ఈటీఎఫ్‌ను అందించడం.. ప్రభుత్వరంగ సంస్థలు తమ కార్యకలాపాల కోసం అవసరమైన నిధులను కొంచెం తక్కువ రేటుకే పొందే మార్గం కల్పించడం మరొకటి.**

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్(ఈటీఎఫ్)లు ప్యాసివ్ (క్రియాశీలకం కాని) పనితీరుతో కూడినవి. అవి ఒక ఇండెక్స్‌ను అనుసరిస్తుంటాయి. రాబడులు కూడా ఆ ఇండెక్స్‌కు అనుగుణంగానే ఉంటాయి. భారత్ బాండ్ ఈటీఎఫ్‌కు సంబంధించి భారత్ బాండ్ ఇండెక్స్– ఏప్రిల్ 2023, భారత్ బాండ్ ఇండెక్స్ – ఏప్రిల్ 2030 సూచీలను ఎన్ఎస్ఈ ఏర్పాటు చేసింది. ప్రస్తుత ఈటీఎఫ్‌లకు భారత్ బాండ్ ఈటీఎఫ్‌కు మధ్య వ్యత్యాసం.. భారత్ బాండ్ ఈటీఎఫ్ నిర్దేశిత కాల వ్యవధి మూడేళ్లు, పదేళ్లతో కూడి ఉండడమే. మిగతాదంతా ఇతర ఈటీఎఫ్‌ల్లో మాదిరే ఉంటుంది. భారత్ బాండ్ ఈటీఎఫ్ మూడేళ్లు (ఏప్రిల్ 2023), పదేళ్లు (ఏప్రిల్ 2030) కాల వ్యవధితో రెండు రకాలుగా ఉంటుంది. కాల వ్యవధి తీరిన తర్వాత అసలు పెట్టుబడి, ఆ మొత్తంపై వడ్డీ రాబడి చెల్లిస్తారు. ఇందులో కేవలం గ్రోత్ ఆప్షన్ మాత్రమే ఉంది. రాబడులను ఎప్పటికప్పుడు చెల్లించే డివిడెండ్ ఆప్షన్ లేదు. ఎడెల్‌వీజ్ ఏఎంసీ ఈ ఈటీఎఫ్ నిర్వహణను చూస్తోంది. ఇది ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ కనుక ఇష్యూ ఈ నెల 20న ముగిసినప్పటికీ.. తర్వాత స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ట్రేడవుతుంటాయి. బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ చేయనున్నారు. లిస్ట్ అయిన తర్వాత యూనిట్ల రూపంలో కొనుగోలు, అమ్మకాలు చేసుకోవచ్చు. కనుక ట్రేడింగ్, డీమ్యాట్ అకౌంట్ ఉన్న వారు లావాదేవీలకు అర్హులు. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక యూనిట్ (రూ.1,000) నుంచి కొనుగోలు చేసుకోవచ్చు. గరిష్టంగా రూ.2 లక్షల వరకే పెట్టుబడికి అవకాశం ఉంటుంది. 'భారత్‌బాండ్ డాట్ ఇన్' పోర్టల్‌కు వెళ్లి ఎన్ఎఫ్‌వో ఆఫర్ పత్రాన్ని పొందొచ్చు. దీనిని సమీపంలోని ఎడెల్‌వీజ్ కార్యాలయంలో సమర్పించడం ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.



### ఇష్యూ సైజు

మూడేళ్ల ఈటీఎఫ్ రూపంలో కనీసం రూ.3,000 కోట్లు, స్పందనను బట్టి అదనంగా మరో రూ.2,000 కోట్లు సమీకరించాలన్నది ప్రణాళిక. అలాగే, పదేళ్ల ఈటీఎఫ్ ద్వారా కనీసం రూ.4,000 కోట్లు, స్పందన అధికంగా ఉంటే మరో రూ.2,000 కోట్ల వరకు సమీకరించనున్నారు.

### భద్రత ఎక్కువే...

భారత్ బాండ్ ఈటీఎఫ్ కచ్చితంగా ఏఏఏ రేటింగ్ కలిగిన ప్రభుత్వరంగ కంపెనీల డెట్ సాధనాల్లోనే ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. కనుక భద్రతకు ఢోకా ఉండదు. ఏఏఏ రేటింగ్ తిరిగి చెల్లింపుల విషయంలో అధిక భద్రతను సూచిస్తుంది. అంటే క్రెడిట్ రిస్క్ చాలా చాలా తక్కువ. పైగా భారత్ బాండ్ ఈటీఎఫ్ వెనుక కేంద్ర ప్రభుత్వం ఉంది. కనుక పెట్టుబడులకు ఎటువంటి రిస్క్ ఉండదు.

### రాబడులు/చార్జీలు

ఈటీఎఫ్‌లకు నిర్దేశిత కాల వ్యవధి మూడేళ్లు, పదేళ్లుగా నిర్ణయించారు. కనుక వీటిల్లో రాబడులను సుమారుగా ఊహించొచ్చు. భారత్ బాండ్ ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వో డాక్యుమెంట్ ప్రకారం.. ఎన్ఎఫ్‌వో సమయంలో ఇన్వెస్ట్ చేసి కాల వ్యవధి పూర్తయ్యే వరకు ఈటీఎఫ్‌లో కొనసాగితే అప్పుడు.. 2023 ఈటీఎఫ్‌లో వార్షిక రాబడులు 6.59 శాతం, 2030 ఈటీఎఫ్‌లో వార్షిక రాబడులు 7.52 శాతం వరకు ఉంటాయి. ఈ రాబడులు గ్యారంటీ కావు. కేవలం సూచనీయమైనవి. ఎందుకంటే మ్యూచువల్ ఫండ్స్‌లో రాబడులకు ఎప్పుడూ హామీ ఉండదు. సూచిత రాబడులను రోజువారీగా ఎడెల్‌వీజ్ ఏఎంసీ వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు. ఇందులో ఎక్స్‌పెన్స్ రేషియో (పెట్టుబడులపై వసూలు చేసే నిర్వహణ చార్జీ) కేవలం 0.0005 శాతమే. దేశంలో అత్యంత చౌక మ్యూచువల్ ఫండ్ ఇది. అంతేకాదు ప్రపంచంలోనే అత్యంత చౌక చార్జీలతో కూడిన డెట్ ఫండ్ కూడా అవుతుంది. డెట్ ఫండ్స్‌లో రాబడులు తక్కువగా ఉంటాయి కనుక ఎక్స్‌పెన్స్ రేషియో చాలా కీలక పాత్రే పోషిస్తుంది. భారత్ బాండ్ ఈటీఎఫ్ చార్జీల పరంగా ఎంతో చౌక కనుక నికర రాబడులు మెరుగ్గా ఉంటాయి. ఈటీఎఫ్‌లపై రాబడులు ప్రభుత్వరంగ బ్యాంకులు ఇవే కాల పరిమితుల డిపాజిట్లపై ఆఫర్ చేస్తున్న రేట్ల స్థాయిలోనే ఉంటాయని భావించొచ్చు. ఇక ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత 30 రోజుల్లోపు వైదొలిగితే అప్పుడు 0.10 శాతం ఎగ్జిట్‌లోడ్ చెల్లించాల్సి ఉంటుంది.

### లిక్విడిటీ...

ఒక సాధనంలో పెట్టుబడి, రాబడులతోపాటు అవసరమైన సందర్భాల్లో వేగంగా వాటిని నగదుగా మార్చుకునే సౌలభ్యం (లిక్విడిటీ) ఉండాలి. అప్పుడే అది ఇన్వెస్టర్లకు సౌకర్యంగా అనిపిస్తుంది. ఎక్కువ మంది ఎఫ్‌డీల్లో ఇన్వెస్ట్ చేయడానికి గల ప్రధాన కారణాల్లో లిక్విడిటీ కూడా ఒకటి. మన దేశంలో చాలా వరకు డెట్ ఈటీఎఫ్‌ల్లో ట్రేడింగ్ స్వల్పంగానే ఉంటోంది. అయితే, పెద్ద సైజు ఈటీఎఫ్‌ల్లో ట్రేడింగ్ యాక్టివిటీ చురుగ్గానే ఉంటుంది. ఆ విధంగా చూసుకున్నప్పుడు భారత్ బాండ్ ఈటీఎఫ్ రూ.7,000 కోట్లకుపైనే సమీకరించనున్న దృష్ట్యా లిక్విడిటీ తగినంత ఉంటుందని ఆశించొచ్చు. పైగా భారత్ బాండ్ ఈటీఎఫ్‌లలో తగినంత లిక్విడిటీ ఉండేలా చర్యలు తీసుకుంటామని ఎడెల్‌వీజ్ ఏఎంసీ చెబుతోంది. ఇందు కోసం పలువురు మార్కెట్ మేకర్లను నియమించనున్నట్టు ఈ సంస్థ ప్రకటించింది. వీరు తగినంత లిక్విడిటీతోపాటు ధర సహేతుకంగా ఉండేలా చూస్తారు. మార్కెట్ మేకర్ల కోసం రూ.20 కోట్లను వెచ్చించేందుకు ఏఎంసీలకు అనుమతి ఉంది. పైగా ఇందులో రూ.1,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇది చిన్న మొత్తం కావడంతో లిక్విడిటీ మెరుగ్గానే ఉంటుందని అంచనా. వాస్తవంగా లిక్విడిటీ ఏ మేరకు అన్నది ఈటీఎఫ్ లిస్ట్ అయిన తర్వాతే తెలుస్తుంది. ఎడెల్‌వీజ్ ఏఎంసీ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్‌వోఎఫ్) రకాన్ని కూడా తీసుకురానుంది. ఇది భారత్ బాండ్ ఈటీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేసే డెట్ మ్యూచువల్ ఫండ్ పథకం. ఈ ఫండ్ ఆఫ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసిన వారికి లిక్విడిటీ పరంగా ఇబ్బందేమీ ఉండదు. ఇతర డెట్ ఫండ్ పథకాల మాదిరే అవసరమైనప్పుడు విక్రయించి పెట్టుబడులు వెనక్కి తీసేసుకోవచ్చు. డీమ్యాట్ అకౌంట్ లేని వారు ఈ ఫండ్ ఆఫ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

### అనుకూలమేనా..?

డెట్ ఫండ్ విభాగంలో సంక్షోభాన్ని చూస్తూనే ఉన్నాం. ఈ సమయంలో అధిక క్వాలిటీ పోర్ట్‌ఫోలియోతో, ఊహించతగ్గ రాబడులతో, తక్కువ ఖర్చుతో కూడిన భారత్ బాండ్ ఈటీఎఫ్ అనుకూలమే. నిర్ణీత కాలం పాటు ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు పరిశీలించొచ్చు. మూడేళ్లతో పోలిస్తే పదేళ్ల ఈటీఎఫ్‌లో తొలినాళ్లలో రేట్ల పరంగా అస్థిరత కొంత ఉండే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే పదేళ్ల కాలంలో వడ్డీ రేట్ల పరంగా మార్పులు చోటు చేసుకుంటుంటాయి. అయితే, పదేళ్ల పాటు ఇన్వెస్ట్‌మెంట్ కొనసాగించే వారు ఆందోళన చెందక్కర్లేదు. తక్కువ క్రెడిట్ రిస్క్, అతి తక్కువ నిర్వహణ చార్జీలతో కూడిన కార్పొరేట్ డెట్ మార్కెట్లో రిటైల్ ఇన్వెస్టర్లు పాల్గొనేందుకు ఇది అవకాశం కల్పిస్తోంది. కొనుగోలు చేసి పూర్తి కాలం పాటు కొనసాగితే వడ్డీ రేట్ల రిస్క్ కూడా ఉండదు. రిస్క్ తీసుకోని ఇన్వెస్టర్లు, పదవీ విరమణ చేసిన వారు, భారత్ బాండ్ ఈటీఎఫ్‌ల కాల వ్యవధి వరకు కొనసాగేవారు పెట్టుబడులను పరిశీలించొచ్చు. ముఖ్యంగా పెట్టుబడుల్లో వైవిధ్యానికి ఇది ఉపకరిస్తుంది. పెట్టుబడులన్నింటినీ తీసుకెళ్లి ఒకే విభాగంలో (ఈక్విటీ లేదా రియల్టీ) ఇన్వెస్ట్ చేయడం రిస్క్ కోణంలో సూచనీయం కాదు. డెట్‌లోనూ కొంత ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా వైవిధ్యం ఉండేలా చూసుకోవాలన్నది నిపుణుల మాట. అందుకోసం భారత్ బాండ్ ఈటీఎఫ్‌ను పరిశీలించొచ్చు. తమ పెట్టుబడుల్లో 10–20 శాతం మేర భారత్ బాండ్ ఈటీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

### పన్ను ప్రయోజనాలు

డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి మూడేళ్ల పాటు కొనసాగితే, ద్రవ్యోల్బణ ప్రభావ మినహాయింపు (ఇండెక్సేషన్)ను పొందే అవకాశం ఉంటుంది. మూడేళ్లపైన మూలధన రాబడులపై 20 శాతం పన్ను అమలవుతుంది. అంటే మూలధన రాబడుల నుంచి ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించిన తర్వాతే 20% పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అదే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై రాబడి వ్యక్తిగత ఆదాయంలో కలసి, నిర్ణీత శ్లాబు ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. రాబడి ఎఫ్‌డీల స్థాయిలో ఉన్నా కానీ, పన్ను ఆదా పరంగా బాండ్ ఈటీఎఫ్ అదనపు ప్రయోజనం. ప్రారంభంలో ఇన్వెస్ట్ చేసిన వారికి మూడేళ్ల ఈటీఎఫ్‌పై నాలుగేళ్ల ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని అందిస్తున్నారు. దీంతో పన్ను అనంతర రాబడులు అధికంగా ఉంటాయని ఆశించొచ్చు. మూడేళ్ల బాండ్ ఈటీఎఫ్‌లో పన్ను అనంతరం రాబడులు 6.3%, పదేళ్ల ఈటీఎఫ్‌లో పన్ను అనంతర రాబడులు 7 శాతంగా ఉంటాయని అంచనా.


### పారదర్శకత



రోజువారీగా పోర్ట్‌ఫోలియో, ఇండికేటివ్ రిటర్నులు (సూచిత రాబడులు) ఎంత మేర అన్న వివరాలను ఎడెల్‌వీజ్ ఏఎంసీ తన వెబ్‌సైట్‌లో ప్రదర్శించనుంది. అదే సంప్రదాయ డెట్ ఫండ్స్ నెలకోసారి మాత్రమే పోర్ట్‌ఫోలియో వివరాలను వెల్లడిస్తున్నాయి. వీటితో పోలిస్తే భారత్ బాండ్ ఈటీఎఫ్‌లో పారదర్శకత ఎక్కువే.

### భారత్ బాండ్ ఈటీఎఫ్‌లో వేటి వాటా ఎంత (శాతంలో)

| కంపెనీ | మూడేళ్ల ఈటీఎఫ్ | పదేళ్ల ఈటీఎఫ్ |
|---|---|---|
| ఎక్స్‌పోర్ట్–ఇంపోర్ట్ బ్యాంకు ఆఫ్ ఇండియా | 8 | 2.83 |
| హిందుస్తాన్ పెట్రోలియం | 4.87 | – |
| హౌసింగ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్ప్ | 11.84 | – |
| ఇండియన్ ఆయిల్ | – | 8 |
| ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్ప్ | 1.88 | 15.01 |
| నాబార్డ్ | 14.98 | 1.48 |
| ఎన్‌హెచ్ఏఐ | 3.86 | 14.99 |
| ఎన్‌హెచ్‌పీసీ | 1.21 | 1.27 |
| ఎన్ఎల్‌సీ ఇండియా | – | 3.92 |
| ఎన్‌టీపీసీ | 6.65 | 11.64 |
| న్యూక్లియర్ పవర్ కార్ప్ | 2.43 | 6.61 |
| పీఎఫ్‌సీ | 15.01 | 6.51 |
| ఆర్ఈసీ | 15.02 | 12.73 |
| సిడ్బి | 7.01 | – |



### పన్ను ఎంతో తక్కువ

మూడేళ్లకు పైగా పెట్టుబడులను కొనసాగిస్తే, ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే పన్ను ఎంతో తక్కువ. ఇన్వెస్టర్ల రిస్క్ ప్రొఫైల్‌కు అనుగుణంగా కేటాయింపులు ఉండాలి. కన్జర్వేటివ్ (రిస్క్ తీసుకోని) ఇన్వెస్టర్లు 20–22 శాతం పెట్టుబడులను భారత్ బాండ్ ఈటీఎఫ్‌కు కేటాయించుకోవచ్చు. ఏఏఏ రేటింగ్ రాబడులు, రిస్క్ లేని సాధనం.

*– పవన్ అగర్వాల్, ప్రైవేటు వెల్త్ (ఇండియా నివేష్) ఎండీ*

### అన్ని విధాలా అనుకూలం

అత్యంత చౌక బాండ్ ఫండ్ ఇది. ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తే బయటకు వచ్చేందుకు మూడేళ్లు ఆగాల్సి ఉంటుంది. కానీ, ఈ ఫండ్ విషయంలో ఎక్స్ఛేంజ్‌ల్లో రోజువారీగా లిక్విడిటీ ఉంటుంది. రాబడులు, పన్ను, లిక్విడిటీ ఇలా అన్ని అంశాల్లోనూ సంప్రదాయ మ్యూచువల్ ఫండ్‌తో పోలిస్తే దీనికి ఎక్కువ మార్కులు పడతాయి.

*– నితిన్ జైన్, ఎడెల్‌వీజ్ అసెట్ ఇన్వెస్ట్‌మెంట్ సీఈవో*

## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

*రూ. కోటి వరకు డిపాజిట్లు, (డిసెంబర్-3-2019 అంకెలు శాతాల్లో)*

| బ్యాంకులు | 6 నెలలు– ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 6 | 6.6 | 6.5 |
| యాక్సిస్ బ్యాంక్ | 6.5 | 6.7 | 6.7 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 5.9 | 6.3 | 6.25 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.4 | 6.25 |
| కెనరా బ్యాంక్ | 5.95 | 6.4 | 6.25 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.4 | 6.25 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.3 | 6.65 | 6.5 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 6.05 | 6.3 | 6.3 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6 | 6.6 | 6.6 |
| ఐడీబీఐ బ్యాంక్ | 6 | 6.45 | 6.25 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 6.5 | 7.25 | 7.15 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 6.05 | 6.3 | 6.2 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 5.8 | 6.25 | 6.25 |
| పీఎన్‌బీ | 6.1 | 6.3 | 6.25 |
| ఎస్‌బీఐ | 5.8 | 6.25 | 6.25 |
| సిండికేట్ బ్యాంక్ | 5.75 | 6.6 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.5 | 7.25 |

*బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...*

## మిడ్‌క్యాప్ విభాగంలో మెరుగైన ప్రదర్శన

### యాక్సిస్ మిడ్‌క్యాప్ ఫండ్




గడిచిన ఏడాది కాలంలో బీఎస్ఈ సెన్సెక్స్ 15 శాతం వరకు ర్యాలీ చేసింది. కానీ, ఇదే కాలంలో మిడ్‌క్యాప్ ఇండెక్స్ మాత్రం ఫ్లాట్‌గా కొనసాగింది. గతంలో ప్రధాన సూచీలతో పోలిస్తే అధిక వ్యాల్యుయేషన్లకు చేరిన మిడ్‌క్యాప్ విభాగంలో ప్రస్తుత పరిస్థితి పూర్తి విరుద్ధం. ప్రధాన సూచీల కంటే ఎంతో చౌకగా స్టాక్స్ వ్యాల్యుయేషన్లు ఉన్నాయి. కనుక ఈ సమయంలో నాణ్యమైన మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మధ్య కాలం నుంచి దీర్ఘకాలంలో మంచి రాబడులు పొందే అవకాశం ఉంటుందని విశ్లేషకులు, నిపుణుల అంచనా. మిడ్‌క్యాప్ విభాగంలో ఇన్వెస్ట్ చేసే మ్యూచువల్ ఫండ్స్‌లో యాక్సిస్ మిడ్‌క్యాప్ ఫండ్ గురించి కచ్చితంగా చెప్పుకోవాలి. ఎందుకంటే ఈ పథకం రాబడుల పరంగా మెరుగైన ప్రదర్శన చూపుతోంది.

**రాబడులు...:** గత ఏడాది కాలంలో మిడ్‌క్యాప్ విభాగంలో నికర రాబడులు సున్నాయే. కచ్చితంగా చెప్పుకోవాలంటే బీఎస్ఈ మిడ్‌క్యాప్ టీఆర్ఐ 0.3 శాతం నికరంగా నష్టపోయింది. కానీ, యాక్సిస్ మిడ్‌క్యాప్ ఫండ్ మాత్రం ఏడాది కాలంలో 14.6 శాతం రాబడులను ఇచ్చి ఈ విభాగంలోనే ఉత్తమ పథకంగా నిలిచింది. ఇక గడిచిన మూడేళ్ల కాలంలో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ కేవలం 8 శాతమే వృద్ధి చెందింది. ఈ కాలంలోనూ యాక్సిస్ మిడ్‌క్యాప్ పథకం వార్షికంగా 17.3 శాతం రాబడులతో అద్భుత పనితీరు చూపించింది. అంటే ప్రతికూల పరిస్థితుల్లోనూ మంచి వృద్ధి, ర్యాలీకి అవకాశం ఉన్న కంపెనీలను గుర్తించి ఇన్వెస్ట్ చేయడంలో ఫండ్ మేనేజర్ విజయవంతమైనట్టు ఇది సూచిస్తోంది. ఇక ఐదేళ్ల కాలంలోనూ వార్షికంగా 9.9 శాతం రాబడులను ఈ పథకం ఇచ్చింది. ఈ కాలంలో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 8.4 శాతమే వృద్ధి చెందింది. ఈ పథకం ఫిబ్రవరి 2011న ఆరంభం కాగా, నాటి నుంచి చూసుకుంటే వార్షికంగా 16.79 శాతం రాబడులను ఇన్వెస్టర్లకు పంచింది.





**పెట్టుబడుల విధానాలు..**

మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ సెబీ నిబంధనల ప్రకారం తమ నిర్వహణలోని పెట్టుబడుల్లో కనీసం 65 శాతాన్ని మిడ్‌క్యాప్ స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. యాక్సిస్ మిడ్‌క్యాప్ ఫండ్ ఈ నిబంధనలను అనుసరిస్తోంది. ప్రస్తుతం డెట్ విభాగంలో 15 శాతం మేర ఇన్వెస్ట్ చేసి ఉంటే, 85 శాతం వరకు ఈక్విటీలకు కేటాయించింది. ఈక్విటీ పెట్టుబడుల్లో 79 శాతం మిడ్‌క్యాప్ విభాగానికి, 21 శాతం లార్జ్‌క్యాప్ విభాగానికి కేటాయించి ఉంది. పోర్ట్‌ఫోలియోలో ప్రస్తుతం 42 స్టాక్స్ ఉన్నాయి. ప్రధానంగా గడిచిన రెండేళ్ల కాలంలో (2018 నుంచి) మార్కెట్లలో ఎంతో అస్థిరతలు ఉన్నా కానీ, ఈ పథకం మంచి పనితీరు చూపించడానికి గల కారణాల్లో డెట్ విభాగానికి చెప్పుకోతగ్గ పెట్టుబడులను కేటాయించడం కూడా ఒకటి. మార్కెట్ అస్థిరతల్లో ఈ పథకం నష్టాల రిస్క్‌ను తగ్గించేందుకు డెట్ విభాగంలోకి కొంత పెట్టుబడులను మళ్లిస్తుంది. 2017 మార్కెట్ ర్యాలీలో ఈక్విటీల్లో పెట్టుబడులను 95 శాతం మేర నిర్వహించగా, ఆ తర్వాత 2018లో అస్థిరతలు ఆరంభం కాగానే ఈక్విటీ ఎక్స్‌పోజర్‌ను కొంత మేర తగ్గించుకుంది. అంతే కాదు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా రంగాల వారీగా కేటాయించిన పెట్టుబడుల్లోనూ మార్పులు చేస్తుంటుంది. ప్రస్తుతం బ్యాంకింగ్, ఫైనాన్షియల్, సర్వీసెస్, కెమికల్స్ రంగాలకు ఎక్కువ కేటాయింపులు చేసింది. ఈ తరహా విధానాలతో ఈ పథకం తన పనితీరును మెరుగ్గా కొనసాగిస్తోంది.

### ఈక్విటీ టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| ఇన్ఫోఎడ్జ్ (ఇండియా) | 5.23 |
| సిటీ యూనియన్ బ్యాంకు | 4.83 |
| అవెన్యూ సూపర్‌మార్ట్స్ | 4.36 |
| ఆస్ట్రల్‌పాలీ టెక్నిక్ | 4.22 |
| వోల్టాస్ | 4.22 |
| బజాజ్ ఫైనాన్స్ | 4.18 |
| బాటా ఇండియా | 3.46 |
| చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ | 3.34 |
| ఇంద్రప్రస్థ గ్యాస్ | 3.34 |
| పీఐ ఇండస్ట్రీస్ | 3.20 |



> నిర్ణయాల్లో మంచివంటూ ఏవీ ఉండవు
> ఏదైనా సక్రమంగా అమలు చేయడమే కీలకం
> – రతన్ టాటా, పారిశ్రామిక దిగ్గజం

## బొమ్మ-బొరుసు



# అన్నీ మంచి శకునాలే..!




- అమెరికా–చైనా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం
- బ్రిటన్ ఈయూ నుంచి బయటకు వచ్చేందుకు మార్గం సుగమం
- అంతర్జాతీయ అంశాలు మార్కెట్‌ను ప్రభావితం చేస్తాయంటున్న నిపుణులు
- 12,200 – 12,250 పాయింట్ల స్థాయిలో నిఫ్టీకి ప్రధాన నిరోధం: ఎపిక్ రీసెర్చ్ అభిప్రాయం
- బుధవారం జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం, ఆర్‌బీఐ మినిట్స్ వెల్లడి


**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆందోళనకరంగా మారిన రెండు కీలక అంశాలకు సంబంధించి గతవారంలో ఒకేసారి సానుకూల పరిణామాలు చోటుచేసుకున్నాయి. అమెరికా–చైనా దేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అంగీకారం కుదరడం, యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ బయటకు వచ్చేందుకు మార్గం సుగమం కావడం వంటి అనుకూల అంశాలతో గత వారాంతాన దేశీ స్టాక్ సూచీలు భారీ లాభాలను నమోదు చేశాయి. అమెరికా దిగుమతి చేసుకుంటున్న చైనా ఉత్పత్తుల విషయంలో తొలి దశ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లు చైనా శుక్రవారం ప్రకటించింది. వాణిజ్య, ఆర్థిక అంశాల పరంగా మొదటి దశ ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లు ప్రకటించింది. ఈ సానుకూల అంశం నేపథ్యంలో దేశీ మార్కెట్ మరింత ముందుకు వెళ్లే అవకాశం కనిపిస్తోందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా విశ్లేషించారు. ట్రేడ్ డీల్ ఒక కొలిక్కి రావడం, బ్రిటన్ ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకోవడం వంటి మార్కెట్ ప్రభావిత అంశాలు బుల్స్‌కు అనుకూలంగా ఉన్నాయని ఎపిక్ రీసెర్చ్ సీఈఓ ముస్తఫా నదీమ్ తెలిపారు. నిఫ్టీకి 12,200 – 12,250 స్థాయిలో ప్రధాన నిరోధం ఎదురుకావచ్చని అంచనా వేశారు. ఇక తాజా పరిణామాలు మార్కెట్‌కు సానుకూలంగా ఉన్నందున ర్యాలీకి ఆస్కారం ఉందని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అన్నారు.

**జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం ఈవారంలోనే..**

పరోక్ష పన్నుల విధానంలో ఆదాయాన్ని పెంచేందుకు ఈవారంలోనే వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) కౌన్సిల్ సమావేశం కానుంది. బుధవారం జరిగే 38వ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వాల నష్టపరిహారం అంశం చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇదే విధంగా మినహాయింపు అంశాలపై సమీక్ష, రేట్లలో మార్పులు ఉండేందుకు ఆస్కారం ఉందని ప్రభుత్వ ఉన్నత అధికారి ఒకరు మీడియాకు చెప్పారు. వీటికి ప్రభావితం అయ్యే రంగాలపై మార్కెట్ వర్గాలు దృష్టిసారించాయి.

**ఆర్‌బీఐ మినిట్స్ వెల్లడి..:** ఈ నెల మొదటి వారంలో జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమావేశ మినిట్స్‌ను ఆర్‌బీఐ బుధవారం విడుదల చేయనుంది. ఇక నవంబర్ నెల టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం సోమవారం వెల్లడికానుంది.

## మీనా జ్యుయలర్స్‌పై ఎన్‌సీఎల్‌టీకి ఎస్‌బీఐ





**హైదరాబాద్:** రుణాల డిఫాల్ట్‌కు సంబంధించి మీనా జ్యుయలర్స్ సంస్థలపై దివాలా కోడ్ కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆశ్రయించింది. మీనా జ్యుయలర్స్, మీనా జ్యుయలర్స్ ఎక్స్‌క్లూజివ్ ప్రైవేట్ లిమిటెడ్, మీనా జ్యుయలర్స్ అండ్ డైమండ్స్ అనే 3 సంస్థలు కలిసి దాదాపు రూ. 254 కోట్లు ఎగవేసినట్లు తెలిపింది. వాటిపై దివాలా పరిష్కార ప్రక్రియకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఎస్‌బీఐ పిటిషన్‌ను స్వీకరించిన ఎన్‌సీఎల్‌టీ.. మధ్యంతర పరిష్కార నిపుణుడిగా కొండపల్లి వెంకట్ శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్‌లో దివాలా చర్యలు ఎదుర్కొంటున్న తొలి ఆభరణాల సంస్థ.. మీనా జ్యుయలర్సేనని ఎస్‌బీఐ తెలిపింది.

## యాక్సిస్ మ్యూచువల్ నుంచి రిటైర్మెంట్ సేవింగ్స్ ఫండ్




యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ సంస్థ తాజాగా రిటైర్మెంట్ సేవింగ్స్ ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఇన్వెస్టర్ల రిస్కు సామర్థ్యాలకు తగ్గట్లుగా మూడు వేర్వేరు ప్లాన్స్ (అగ్రెసివ్, డైనమిక్, కన్జర్వేటివ్) ఇందులో ఉంటాయి. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ (సిప్)కు కట్టే వాయిదాల పరిమాణాన్ని బట్టి దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు ఐప్లస్ సిప్ ఇన్సూరెన్స్ పేరిట బీమా సదుపాయం కూడా లభిస్తుందని సంస్థ సీఈవో చంద్రేశ్ కుమార్ నిగమ్ తెలిపారు.

## కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో ఎఫ్‌డీఐలపై సమీక్ష



**న్యూఢిల్లీ:** వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాల్లో టెలికంతోపాటు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)పై కేంద్రం దృష్టి సారించింది. వ్యూహాత్మక ప్రాంతాలు, సరిహద్దుల్లో వివిధ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో విదేశీ పెట్టుబడులపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆర్‌బీఐతో పాటు వివిధ శాఖలు, ఏజెన్సీలు ఈ కసరత్తులో పాల్గొంటున్నట్లు వివరించాయి. ప్రస్తుతం చాలామటుకు పరిశ్రమల్లో ఆటోమేటిక్ పద్ధతిలో ఎఫ్‌డీఐలకు అనుమతులు ఉన్నాయి. అయితే, ఈశాన్య రాష్ట్రాలు సహా కీలకమైన ప్రాంతాల్లోని ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో విదేశీ పెట్టుబడులను అనుమతించడం ఎంత వరకూ శ్రేయస్కరమన్నది కేంద్రం పరిశీలిస్తోంది. సాధారణంగా చాలా మటుకు దేశాలు వ్యూహాత్మక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో విదేశీ సంస్థలకు అనుమతులివ్వవు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 16-12-2019

| | |
|---|---|
| విశాఖ | 470-00 |
| చిత్తూరు | 458-00 |
| వరంగల్ | 436-00 |
| విజయవాడ | 452-00 |
| గోదావరి | 452-00 |
| 15-12-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 433-00 |

## పాన్- ఆధార్ లింకింగ్ గడువు తేదీ డిసెంబర్ 31



**న్యూఢిల్లీ:** పాన్ కార్డ్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసేందుకు ఈ నెల 31 గడువు తేదీగా కేంద్ర ప్రత్యక్ష పన్నుల విభాగం (సీబీడీటీ) ప్రకటించింది. ఆదాయ పన్ను సేవలు మరింత పారదర్శకంగా కొనసాగడం కోసం ఈ రెండింటి అనుసంధాన్ని తప్పనిసరి చేసినట్లు పేర్కొంది. ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 139 ఏఏ (2) ప్రకారం 2017 జూలై 1 నాటికి పాన్ కార్డును పొంది ఉండి, ఆధార్ పొందడానికి అర్హులైన ప్రతి వ్యక్తి, సంస్థ తమ ఆధార్ నంబర్‌ను ఆదాయ పన్ను శాఖకు వెల్లడించాల్సి ఉంటుంది. ఈ సెక్షన్‌లోని అంశానికి గడువు తేదీని ఇంతకుముందు ఈ ఏడాది సెప్టెంబర్ 30గా ప్రకటించిన విషయం తెలిసిందే.

## పీఎన్‌బీ మొండిబాకీ లెక్కల్లో వ్యత్యాసాలు

- రూ. 2,617 కోట్ల మేర డైవర్జెన్స్
- ఆర్‌బీఐ ఆడిట్‌లో వెల్లడి




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) దాదాపు రూ. 2,617 కోట్ల మేర మొండి బాకీలు తక్కువగా చూపినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆడిట్‌లో వెల్లడైంది. 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్‌బీఐ లెక్కల ప్రకారం పీఎన్‌బీ స్థూల మొండిబాకీలు (ఎన్‌పీఏ) రూ. 81,089.70 కోట్లుగా ఉన్నాయి. కానీ పీఎన్‌బీ రూ. 78,472 కోట్లు మాత్రమే ఎన్‌పీఏలుగా చూపించింది. దీంతో ఆర్‌బీఐ, పీఎన్‌బీ లెక్కల మధ్య రూ. 2,617 కోట్ల వ్యత్యాసం (డైవర్జెన్స్) వచ్చింది. ఇక నికర ఎన్‌పీఏలు రూ. 30,038 కోట్లుగా ఉన్నట్లు పీఎన్‌బీ చూపగా, ఆర్‌బీఐ ఆడిట్ ప్రకారం రూ. 32,655 కోట్లుగా ఉన్నాయి. దీంతో నికర ఎన్‌పీఏలకు సంబంధించి కూడా డైవర్జెన్స్ రూ. 2,617 కోట్లుగా ఉన్నట్లు పీఎన్‌బీ వెల్లడించింది. మరోవైపు మొండి బాకీలకు కేటాయింపుల విషయంలో కూడా రూ. 2,091 కోట్ల మేర వ్యత్యాసం నమోదైంది. రూ. 50,242 కోట్ల మేర ప్రొవిజనింగ్ చేయాల్సి ఉండగా.. రూ. 48,151 కోట్లు మాత్రమే పీఎన్‌బీ కేటాయించింది. 2018–19 ఆర్థిక ఫలితాల్లో పీఎన్‌బీ రూ. 9,975 కోట్ల నష్టాన్ని ప్రకటించగా.. ఆర్‌బీఐ లెక్కించిన విధంగా ప్రొవిజనింగ్ చేసి ఉంటే నష్టాలు రూ. 11,336 కోట్లుగా ఉండేవి. దాదాపు రూ. 14,000 కోట్ల నీరవ్ మోదీ స్కామ్ నుంచి బైటపడేందుకు నానా తంటాలు పడుతున్న పీఎన్‌బీకి ఇతరత్రా మొండిబాకీలు భారంగా మారుతున్నాయి.

## పరిశ్రమ వర్గాలతో ప్రి-బడ్జెట్ సమావేశాలు

- నేటి నుంచి ప్రారంభం
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్




**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై కేంద్రం కసరత్తు జరుపుతోంది. ఇందులో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం (నేడు) నుంచి పరిశ్రమవర్గాలు, రైతు సంఘాలు, ఆర్థికవేత్తలు మొదలైనవారితో సమావేశం కానున్నారు. వినియోగానికి, వృద్ధికి ఊతమిచ్చేందుకు తీసుకోతగిన చర్యల గురించి చర్చించనున్నారు. సోమవారం ప్రారంభమయ్యే ప్రి-బడ్జెట్ సమావేశాలు డిసెంబర్ 23 దాకా కొనసాగుతాయని, ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. సోమవారం నాడు స్టార్టప్స్, ఫిన్‌టెక్, డిజిటల్ రంగ సంస్థలు, ఆర్థిక రంగం.. క్యాపిటల్ మార్కెట్ ప్రతినిధులతో ఆర్థిక మంత్రి సమావేశమవుతారు. వ్యాపారాల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు, ప్రైవేట్ పెట్టుబడులకు అనువైన పరిస్థితులు కల్పించేందుకు, వృద్ధికి ఊతమివ్వడానికి తీసుకోతగిన చర్యల గురించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటారు. పరిశ్రమల సమాఖ్యలతో డిసెంబర్ 19న సమావేశమవుతారు. 2019–20 రెండో త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్ట స్థాయి 4.5 శాతానికి పడిపోయిన నేపథ్యంలో.. రాబోయే బడ్జెట్‌లో ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే చర్యలపై మరింత దృష్టి పెట్టవచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే కార్పొరేట్ ట్యాక్స్‌లను గణనీయంగా తగ్గించినందున.. వేతనజీవులకు సంబంధించి వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లపరంగా ఊరటనిచ్చే చర్యలేమైనా ఉండొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. వస్తువులు, సేవలకు డిమాండ్ పెంచే విధంగా ఆదాయ పన్ను పరిమితిని ప్రస్తుతమున్న రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచాలని పరిశ్రమవర్గాలు కోరుతున్నాయి. అలాగే, డిడక్షన్ పరిమితులను కూడా ప్రస్తుత రూ. 1.5 లక్షల నుంచి రూ. 3 లక్షలకు పెంచిన పక్షంలో.. పెట్టుబడులకు ఊతం లభించగలదని ఆశిస్తున్నాయి.

**స్టాక్స్ వ్యూ**

### టాటా మోటార్స్ | బ్రోకరేజ్ సంస్థ: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర: రూ.177** **టార్గెట్ ధర: రూ.195**

**ఎందుకంటే:** టాటా మోటార్స్ లగ్జరీ కార్ల విభాగం, జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్‌ఆర్) అమ్మకాలు మెల్లమెల్లగా పుంజుకుంటున్నాయి. వరుసగా ఐదో నెలలోనూ(ఈ ఏడాది నవంబర్‌లో) చైనాలో రెండంకెల వృద్ధిని సాధించాయి. జేఎల్‌ఆర్ వాహన విక్రయాలు బ్రిటన్‌లో 11 శాతం తగ్గినా, చైనాలో 29 శాతం, అమెరికాలో 5 శాతం మేర పెరిగాయి. ల్యాండ్ రోవర్ కొత్త మోడళ్లు–ఆర్‌ఆర్ ఇవోక్, ఎల్‌ఆర్ డిస్కవరీ స్పోర్ట్స్, ఎల్‌ఆర్ డిస్కవరీ, ఆర్‌ఆర్ స్పోర్ట్ మంచి అమ్మకాలు సాధించాయి. మందగమనం ఉన్నా, అమెరికా, చైనా దేశాల్లో అమ్మకాలు పెరగడం సానుకూలాంశం. చైనా వాహన మార్కెట్లో సమస్యలున్నా, అమ్మకాల రికవరీ కొనసాగుతోంది. కొత్త మోడళ్లను అందుబాటులోకి తేవడం, రిటైలర్లతో సత్సంబంధాలు కొనసాగిస్తుండటం ఫలితాలనిస్తోంది. ఈ నెలలోనే జాగ్వార్ ఎఫ్–టైప్ మోడల్‌ను అందుబాటులోకి తెస్తోంది. దీనికి వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించగలదని కంపెనీ భావిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం అంచనా ఈపీఎస్‌కు 14 రెట్ల ధరకు ప్రస్తుతం ఈ షేర్ ట్రేడవుతోంది. బ్రెగ్జిట్(యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగడం)కు గట్టి మద్దతు దారైన బోరిస్ జాన్సన్ కన్జర్వేటివ్ పార్టీకి భారీ మెజార్టీ లభించింది. దీంతో బ్రెగ్జిట్ అనిశ్చితి తొలగనున్నది. ఇది కూడా టాటా మోటార్స్‌కు సానుకూలాంశమే. ఆయా అంశాల వల్ల ఈ షేర్ కొనుగోలు చేయవచ్చన్నది సూచన.




### మారుతీ సుజుకీ | బ్రోకరేజ్ సంస్థ: షేర్‌ఖాన్ | హోల్డ్

**ప్రస్తుత ధర: రూ.7,215** **టార్గెట్ ధర: రూ.7,500**

**ఎందుకంటే:** ప్రయాణికుల వాహన సెగ్మెంట్లో 50 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఏడాది పాటు పడిపోతూ ఉన్న ఈ కంపెనీ వాహన విక్రయాలు ఈ ఏడాది అక్టోబర్‌లో పుంజుకున్నాయి. వాహన నిల్వలు బాగా తగ్గాయి. దాదాపు 9 నెలల అనంతరం గత నెలలో వాహన ఉత్పత్తి 4 శాతం పెరిగింది. రికవరీ కొనసాగడానికి మరికొంత కాలం పట్టవచ్చని భావిస్తున్నాం. భారత్‌స్టేజ్ (బీఎస్) 6 నిబంధనలు అందుకోవడానికి వివిధ మోడళ్లలో మార్పులు, చేర్పులు చేయడం వల్ల ఉత్పత్తి వ్యయాలు పెరిగాయి. దీంతో కార్ల ధరలను ఈ కంపెనీ పెంచక తప్పలేదు. ధరల పెంపునకు ఆర్థిక మందగమనం కొనసాగుతుండటం కూడా తోడవడంతో ప్రయాణికుల వాహనాలకు డిమాండ్ సమీప భవిష్యత్తులో అంతంతమాత్రంగానే ఉండొచ్చు. కియా మోటార్స్ కంపెనీలు కొత్త మోడళ్లను రంగంలోకి తెస్తుండటంతో పోటీ పెరుగుతోంది. వ్యక్తిగత ఆదాయపు పన్ను స్లాబ్‌ల్లో మార్పులు, చేర్పులు చేయాలని కేంద్రం భావిస్తోందని వార్తలు వస్తాయి. ఆదాయపు పన్ను తగ్గితే అది ఈ కంపెనీకి సానుకూలాంశమవుతుంది. ప్రయాణికుల వాహన సెగ్మెంట్లో సుదీర్ఘకాలం మందగమనం కొనసాగుతుండటం, కియా వంటి బహుళజాతి కంపెనీల నుంచి పోటీ పెరుగుతుండటం, విడిభాగాలు, రాయల్టీలకు చెల్లింపులు యెన్(జపాన్ కరెన్సీ)ల్లో ఉండటంతో కరెన్సీ మారకంలో ఒడిదుడుకులు చోటు చేసుకుంటుండటం ప్రతికూలాంశాలు. రెండేళ్ల కాలంలో నికర లాభం 4 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని భావిస్తున్నాం.




**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

## రియల్టీ రంగానికి 2019లో నిరాశే

**గతేడాదితో పోలిస్తే కేవలం 4% వృద్ధి**



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఈ ఏడాది దేశీయ రియల్టీ రంగం ఆశించినంత వృద్ధిని సాధించలేదు. వినియోగ వ్యయం తగ్గడం, పెట్టుబడులు క్షీణించడం, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం వంటి రకరకాల కారణాలతో దేశీయ రియల్టీ రంగంలో వృద్ధి అవకాశాలను నీరుగార్చాయని అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్ తెలిపింది. దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో గతేడాది నాలుగు త్రైమాసికాలు కలిపి 2,48,300 గృహాలు అమ్ముడుపోగా.. 2019లో కేవలం 4 శాతం వృద్ధితో 2,58,410 యూనిట్లకు చేరాయి. ఇందులోనూ అందుబాటు గృహాల విక్రయాలే ఎక్కువగా ఉన్నాయి. అఫడబుల్ హౌసింగ్‌లకు పలు పన్ను రాయితీలను కల్పించడమే ఇందుకు కారణం. తొలిసారి గృహ కొనుగోలుదారులకు రూ.3.5 లక్షల పన్ను రాయితీని అందిస్తుంది. ఇది 2020 ఆర్థిక సంవత్సరం ముగిసే వరకూ అందుబాటులో ఉంటుంది.

**రెడీ టు మూవ్ గృహాలకే డిమాండ్..**


రియల్ ఎస్టేట్ రంగం పనితీరు దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) ఆరేళ్ల క్రితం నాటికి క్షీణించి 4.5 శాతానికి చేరింది. ముంబై, ఎన్‌సీఆర్, బెంగళూరు, పుణే, హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా నగరాల్లో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో గృహాల విక్రయాల్లో డిమాండ్ కనిపించింది.. కానీ, మూడో త్రైమాసికం నాటికి మళ్లీ తిరోగమన బాట పట్టిందని చైర్మన్ అనూజ్ పూరీ తెలిపారు. కొనుగోలుదారులు గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు లేదా 6 నెలల్లో నిర్మాణం పూర్తయ్యే గృహాల కొనుగోళ్ల మీదే ఆసక్తి చూపిస్తున్నారు. లిస్టెడ్, బ్రాండెడ్ నిర్మాణ సంస్థలు మాత్రం గృహ విక్రయాల్లో కాసింత ఉపశమనంలో ఉన్నాయి. ఈ ఏడాది గృహ విభాగానికి కలిసొచ్చిన అంశం ఏంటంటే.. దేశవ్యాప్తంగా మధ్యలో ఆగిపోయిన నిర్మాణాలను పూర్తి చేసేందుకు రూ.25 వేల కోట్ల ఆల్టర్‌నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్)ను ఏర్పాటు చేయడమే.

## సెన్సెక్స్ 41,164 స్థాయిని అధిగమిస్తే..

**మార్కెట్ పంచాంగం**


ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ఫైనాన్షియల్ మార్కెట్లను నెలల తరబడి ఆందోళన పరుస్తున్న రెండు అంశాలు ఒక కొలిక్కి వచ్చాయి. అమెరికా–చైనాల మధ్య తొలిదశ వాణిజ్య ఒప్పందం కుదిరిందన్న ప్రకటన వెలువడటం, యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ సజావుగా వైదొలగడానికి (సాఫ్ట్ బ్రెగ్జిట్) అవసరమైన మెజారిటీని ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ, ప్రధాని బోరిస్ జాన్సన్ సాధించడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, మార్కెట్లకు పెద్ద ఊరటనిచ్చే అంశాలు. మన దేశ జీడీపి బాగా పడిపోవడం, పారిశ్రామికోత్పత్తి క్షీణించడం, ద్రవ్యోల్బణం పెరగడం వంటి ప్రతికూలాంశాల్ని సైతం తలదన్ని... ప్రపంచ సానుకూల పరిణామాల ప్రభావంతో స్టాక్ మార్కెట్ మరోదఫా రికార్డుస్థాయిని సమీపించింది. గత ఆరునెలల్లో ఎన్నోదఫాలు రికార్డుస్థాయి వద్ద జరిగిన బ్రేకవుట్లు విఫలమయ్యాయి. ట్రేడ్ డీల్, బ్రెగ్జిట్ సమస్యలకు పరిష్కారం లభించబోతున్నందున, ఈ వారం మన మార్కెట్ వ్యవహరించే శైలి... దీర్ఘ, మధ్యకాలిక ట్రెండ్‌కు కీలకం కానున్నది. ఇక సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా ఉన్నాయి...

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు...**




డిసెంబర్ 13తో ముగిసినవారంలో మూడోరోజైన బుధవారం 40,135 పాయింట్ల కనిష్టస్థాయికి తగ్గిన బీఎస్ఈ సెన్సెక్స్... అదేరోజున రికవరీ ప్రారంభించి, చివరిరోజైన శుక్రవారం 41,056 పాయింట్ల గరిష్టస్థాయికి పెరిగింది. చివరకు అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 565 పాయింట్ల లాభంతో 41,010 పాయింట్ల వద్ద ముగిసింది. నవంబర్ 28 నాటి 41,164 పాయింట్ల రికార్డుస్థాయి సెన్సెక్స్‌కు ఈ వారం కీలకం కానుంది. ఈ స్థాయిని బలంగా ఛేదిస్తే వేగంగా 41,400 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపైన ర్యాలీ కొనసాగితే 41,650 పాయింట్ల వరకూ పెరిగే అవకాశం ఉంటుంది. ఈ వారంలో రికార్డుస్థాయిపైన స్థిరపడలేకపోయినా, బలహీనంగా ప్రారంభమైనా 40,850–40,710 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ స్థాయిని కోల్పోతే 40,590 పాయింట్ల వద్దకు తగ్గవచ్చు. ఈ లోపున 40,330 పాయింట్ల వద్దకు క్షీణించవచ్చు.

**నిఫ్టీకి 12,160 కీలకస్థాయి**




నిఫ్టీ గతవారం 11,832 పాయింట్ల కనిష్టస్థాయికి తగ్గిన తర్వాత వేగంగా 12,098 పాయింట్ల గరిష్ఠ స్థాయిని చేరింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 165 పాయింట్ల లాభంతో 12,087 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీకి నవంబర్ 28 నాటి 12,158 పాయింట్ల రికార్డుస్థాయే కీలకం. ఈ స్థాయిని అధిక ట్రేడింగ్ పరిమాణంతో అధిగమిస్తే 12,220 పాయింట్ల స్థాయిని అందు కోవొచ్చు. అటుపైన క్రమేపీ 12,250–1300 పాయింట్ల శ్రేణిని చేరవచ్చు. ఈ వారం పైన ప్రస్తావించిన కీలక స్థాయిని దాటలేకపోయినా, బలహీనంగా ప్రారంభమైనా 12,035–12,005 పాయింట్ల వద్ద తక్షణ మద్దతును పొందవచ్చు. ఈ లోపున ముగిస్తే 11,950 పాయింట్ల వద్దకు తగ్గవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే 11,880 పాయింట్ల వద్దకు క్షీణించవచ్చు.

– పి. సత్యప్రసాద్

# ఫండ్స్ విలీనమైతే పన్ను పోటు ఉంటుందా?




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

**నా ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్) ఖాతా త్వరలోనే మెచ్యూర్ కానున్నది. అయితే నాకు ఈ మెచ్యూరిటీ మొత్తం మరో పదేళ్ల తర్వాతనే అవసరం. నా కూతురి పైచదువుల కోసం ఈ డబ్బును వినియోగించుకోవాలనేది నా ఆలోచన. మరో ఐదేళ్లు ఈ ఖాతాను పొడగించమంటారా ? లేక ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయమంటారా?**

– శ్రీకాంత్, విజయవాడ

దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయడానికి పీపీఎఫ్ కంటే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమం. అయితే పీపీఎఫ్‌కు ఉండే ప్రయోజనాలు పీపీఎఫ్‌కు ఉన్నాయి. పీపీఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌పై వచ్చే రాబడులపై ఎలాంటి పన్ను భారం ఉండదు. స్థిర ఆదాయ మదుపు సాధనాల్లో పీపీఎఫ్ ఉత్తమమైనదనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇన్వెస్ట్‌మెంట్స్‌కు ఎలాంటి నష్ట భయం ఉండదు. పైగా మెచ్యూరిటీ తీరిన తర్వాత వచ్చే మొత్తంపై ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన పనిలేదు. మీ పాప పైచదువుల కోసం ఇతర మార్గాల్లో మదుపు చేసే డబ్బులు కూడా అందుబాటులో ఉంటే పీపీఎఫ్‌ను కొనసాగించండి. స్థిరఆదాయ మదుపు సాధనాల్లో పీపీఎఫ్ ఉత్తమమైనది కాబట్టి మీ మదుపులో కొంత భాగం పీపీఎఫ్‌లో ఉండటం మంచిదే. అలా కాకుండా మీ పాప పై చదువులకు ఇదొక్కటే ఆధారమైనప్పుడు మాత్రం ఈక్విటీ ఫండ్స్‌ను ఎంచుకోవడమే ఉత్తమం. పీపీఎఫ్‌లో మీ మదుపు వార్షిక వృద్ధి ప్రస్తుతం 8 శాతమే. అదే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ల్లో అయితే అంతకు మించి రాబడులు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

**నా వయస్సు 33 సంవత్సరాలు. నా భార్య వయస్సు 30 సంవత్సరాలు. ఇద్దరమూ ఉద్యోగస్తులమే. గృహ రుణం తీసుకొని సొంత ఇల్లు కొనుక్కోవాలా ? లేక ఎంతో కొంత అద్దె కడుతూ అద్దె ఇంట్లో ఉండాలా ? అనే విషయమై తర్జనభర్జన పడుతున్నాం. నగర శివార్లలో ఒక ప్లాట్ ఉంది. ఇప్పుడు అక్కడ ఇల్లు కట్టుకునే పరిస్థితి లేదు. మాకు తగిన సలహా ఇవ్వండి.**

–సురేశ్, పల్లవి, హైదరాబాద్

మీకు నగర శివార్లలో ఒక స్థలం ఉందంటున్నారు. ప్రస్తుతం ఈ విషయాన్ని పక్కన పెట్టండి. మీరు తక్షణం నిర్ణయించుకోవలసింది. సొంత ఇల్లు సమకూర్చుకోవడమా ? లేక అద్దె ఇంట్లో ఉండటమా ? అనే విషయమే. దీంట్లో ప్రతి దానికి దేనికి ఉండే అనుకూలతలు, ప్రతికూలతలు దానికి ఉన్నాయి. సొంత ఇల్లు ఉంటే, అదో భరోసా, సంతృప్తి, ఎంత ఖరీదైన, సౌకర్యవంతమైన అద్దె ఇంట్లో ఉన్నా, ఈ సంతృప్తి, భరోసా లభించదు. అద్దె ఇంట్లో ఉంటే, ఇంటి యజమానికి కోపం వచ్చినా, మనకు కోపం వచ్చినా మనమే ఇల్లు ఖాళీ చేయాల్సి ఉంటుంది. మంచి ఇంటి యజమాని దొరికి సౌకర్యవంతమైన అద్దె ఇల్లు దొరికితే, అద్దె ఇంట్లో కొనసాగడం మంచి నిర్ణయమే. సొంత ఇల్లు ఉంటే మన వృద్ధి, అవసరాలు, ఎదుగుదల ఆ ఇల్లు ఉన్న ప్రాంతానికే పరిమితమయ్యే ప్రమాదమూ ఉంది. వేరే నగరాల్లో మంచి ఉద్యోగం లభించినా, సొంత ఇల్లు ఉందన్న కారణంగా ఆ ఉద్యోగాలను వదులుకున్న వాళ్లు చాలా మంది ఉన్నారు. పిల్లల చదువు, మన ఆరోగ్య అవసరాలు.. ఇలాంటి కొన్ని అంశాలపై సొంత ఇంటి ప్రభావం ఉంటుంది. అలాగే సొంత ఇంటి అవసరాలు మన జీవితం వివిధ దశల్లో వివిధ రకాలుగా ఉంటాయి. ఉదాహరణకు మీరు 30–40 ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు మీ పిల్లలు, మీ తల్లిదండ్రులు మీతో పాటు ఉంటారు. అప్పుడు మీకు త్రీ, లేదా ఫోర్ బెడ్‌రూమ్ ఇల్లు అవసరం అవుతుంది. పిల్లలు పై చదువులకు వెళ్లినప్పుడు, లేదా ఉద్యోగం నిమిత్తం వేరే నగరాలకు వెళ్లినప్పుడు మీకు టూ బెడ్రూమ్ ఇల్లు సరిపోతుంది. ఈ అంశాలన్నింటిని బేరీజు వేసుకొని నిర్ణయం తీసుకోండి. గృహ రుణం ద్వారా సొంత ఇంటిని సమకూర్చుకోవాలనుకుంటే, రెండు ముఖ్యమైన విషయాలు గుర్తుంచుకోవాలి. మొదటిది మీరు చెల్లించే ఈఎంఐ... మీ జీతంలో మూడో వంతు కంటే మించకూడదు. అంత మొత్తానికే పరిమితమయ్యేలా గృహ రుణం తీసుకోండి. రెండోది. మీరు సొంత ఇంట్లోనే ఉంటూ, అద్దె డబ్బును ఆదా చేయాలి. ఈ అద్దెనే ఈఎంఐగా భావించుకోవాలి.

**నేను కొంత మొత్తాన్ని గతంలో ఒక ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశాను. ఇప్పుడు ఈ ఫండ్ మరో ఫండ్‌లో విలీనమవుతోంది. ఈ విలీనం వల్ల ఏమైనా ప్రతికూల ప్రభావం ఉంటుందా? నేను ఇన్వెస్ట్ చేసిన మొత్తాన్నే కొత్త ఫండ్‌కు బదిలీ చేస్తారా? దానిపై వచ్చిన రాబడులను కూడా బదిలీ చేస్తారా? ఫండ్స్ విలీనమైనప్పుడు పన్ను భారం ఏమైనా ఉంటుందా?**

–ఖయ్యూమ్, విశాఖపట్టణం

మ్యూచువల్ ఫండ్స్ విలీనం విషయంలో ఇన్వెస్ట్ చేసిన మొత్తం, దానిపై వచ్చిన రాబడులు.. ఇలాంటి తేడాలు ఏమీ ఉండవు. మొత్తం ఒకటిగానే పరిగణిస్తారు. ఉదాహరణకు మీరు ఒక ఫండ్‌లో గతంలో రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేశారనుకుందాం. ఇప్పుడు దానిపై రాబడి రూ.15,000 అయిందనుకుందాం. మొత్తం రూ.1.15 లక్షలుగా పరిగణిస్తారు. ఉదాహరణకు మీరు ఇన్వెస్ట్ చేసిన ఫండ్ ఎన్ఏవీ రూ.100 ఉంది. మీ దగ్గర ఈ ఫండ్ యూనిట్లు వంద ఉన్నాయనుకుందాం. అప్పుడు దీని విలువ రూ.10,000 అవుతుంది. మీరు ఇన్వెస్ట్ చేసిన ఫండ్.. రూ. 200 ఎన్ఏవీ ఉన్న ఫండ్‌లో విలీనమవుతోంది అనుకుందాం. అప్పుడు మీకు ఈ కొత్త ఫండ్ యూనిట్లు 50 లభిస్తాయి. అంటే మీ పెట్టుబడి విలువలో మార్పు ఉండదన్న మాట. ఫండ్ యూనిట్లలోనే మార్పు ఉంటుంది. ఇంకా వివరంగా చెప్పాలంటే, మ్యూచువల్ ఫండ్స్ విలీనమంటే మీ ప్రస్తుత ఫండ్ నుంచి మీ యూనిట్లను ఉపసంహరించుకొని, కొత్త ఫండ్ యూనిట్లను కొనుగోలు చేయడం అన్నమాట. ఫండ్స్ విలీనమైనప్పుడు మీకు ఎలాంటి పన్ను పోటు ఉండదు. అయితే పన్నులు మదింపు చేసేటప్పుడు మొదటి ఫండ్(విలీనమవుతున్న ఫండ్) యూనిట్లను కొనుగోలు చేసిన తేదీనే పరిగణనలోకి తీసుకుంటారు.

# విజయ పాలు.. లీటరు రూ.44

**లీటరుపై రూ.2 పెంచిన టీఎస్‌డీడీసీఎఫ్ పెరిగిన ధరలు సోమవారం**

సాక్షి, హైదరాబాద్: విజయ పాల ధర లీటరుపై రూ.2 పెరిగింది. ప్రస్తుతం విజయ పాలు లీటరుకు రూ.42 వంతున విక్రయిస్తుండగా... ఇకపై రూ.44కు విక్రయించాలని నిర్ణయించింది. పాలసేకరణ ధరలు పెరగడంతో పాల సరఫరా ధర పెంచాలని తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య(టీఎస్‌డీడీసీఎఫ్) ఈ నిర్ణయం తీసుకుంది. పెంచిన ధర సోమవారం నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించింది. స్టాండడైజ్ పాలు, హోల్ మిల్క్ ధరల్లో మార్పు లేదని, పెరిగిన ధరల నేపథ్యంలో వెండర్ మార్జిన్‌ను లీటర్‌కు 25 పైసలు పెంచినట్లు ప్రకటించింది.

**విజయ పాలు ప్రస్తుత, పెరిగిన ధరలు రూపాయల్లో...**

| పాలరకం | పరిమాణం | ప్రస్తుత ధర | పెరిగిన ధర |
|---|---|---|---|
| డైట్‌మిల్క్ | 500మి.లీ | 18.00 | 19.00 |
| డబుల్ టోన్డ్‌మిల్క్ | 200మి.లీ | 8.00 | 8.50 |
| డబుల్‌టోన్డ్ మిల్క్ | 300మి.లీ | 11.00 | 12.00 |
| డబుల్‌టోన్డ్ మిల్క్ | 500మి.లీ | 19.00 | 20.00 |
| ఫామిలీ మిల్క్ | 500మి.లీ | 20.00 | 21.00 |
| టీ స్పెషల్ | 500మి.లీ | 20.00 | 21.00 |
| టోన్డ్ మిల్క్ | 200మి.లీ | 8.50 | 9.00 |
| టోన్డ్‌మిల్క్ | 500మి.లీ | 21.00 | 22.00 |
| టోన్డ్ మిల్క్ | 1లీటరు | 42.0 | 44.00 |
| టోన్డ్‌మిల్క్ | 6లీటర్లు | 246.00 | 258.00 |
| ఆవుపాలు | 500మి.లీ | 21.00 | 22.00 |

## మహబూబ్‌నగర్, సిద్దిపేటలో శిల్పారామాలు

- ఆలిండియా క్రాఫ్ట్ మేళాలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మాదాపూర్:** నగరంలో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటున్న శిల్పారామాలను మహబూబ్‌నగర్, సిద్దిపేటలో త్వరలో ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. అనంతరం దశల వారీగా రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతామని తెలిపారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పారామంలో ఆలిండియా క్రాఫ్ట్ మేళాను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరవాసులు సేద తీరేందుకు, ఆహ్లాదకరంగా ఉండేందుకు శిల్పారామం ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. క్రాఫ్ట్ మేళాలోని స్టాళ్లను పరిశీలించి కళాకారులతో మంత్రి ముచ్చటించారు.

# గొల్లపూడికి కన్నీటి వీడ్కోలు

**చెన్నైలో అశ్రునయనాల మధ్య ముగిసిన అంత్యక్రియలు**



గొల్లపూడి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీబాలసుబ్రమణ్యం

**తమిళసినిమా (చెన్నై):** ప్రఖ్యాత నటుడు, రచయిత, సాహితీవేత్త గొల్లపూడి మారుతీరావు భౌతికకాయానికి అంత్యక్రియలు ఆదివారం చెన్నైలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. ఉదయం పలువురు సినీప్రముఖులు, బంధువులు గొల్లపూడి పార్థివదేహానికి నివాళులర్పించారు. ప్రముఖ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం, నిర్మాత దగ్గుబాటి సురేశ్, దక్షిణ భారత సినీ వాణిజ్య మండలి అధ్యక్షుడు కాట్రగడ్డ ప్రసాద్, సినీ ప్రముఖులు మారుతీరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం ఉదయం 10 గంటలకు గొల్లపూడి భౌతికకాయానికి కుటుంబసభ్యులు శాస్త్రీయంగా అంతిమ కార్యక్రమాలను నిర్వహించారు. 11.30 గంటలకు గొల్లపూడి అంతిమయాత్ర ప్రారంభమైంది. కుటుంబ సభ్యులతో పాటు, బంధువులు, అభిమానులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు చెన్నై టీ నగర్ కన్నమ్మపేటలోని శ్మశాన వాటికలో గొల్లపూడి మారుతీరావు అంత్యక్రియలు జరిగాయి. చితికి కుమారుడు రామకృష్ణారావు నిప్పంటించారు.

## సుప్రభాతం స్థానంలో తిరుప్పావై

**శ్రీవారి ఆలయంలో 17వ తేదీనుంచి నివేదన**

**తిరుమల:** తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైందిగా భావించే ధనుర్మాసం ఈనెల 16వ తేదీన ప్రారంభం కానుంది. ఆరోజు అర్ధరాత్రి 11.47 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 17వ తేదీ నుంచి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. ధనుర్మాస ఘడియలు 2020 జనవరి 14వ తేదీన ముగుస్తా యి.

**తిరుప్పావై పారాయణం**

12 మంది ఆళ్వార్లలో శ్రీఆండాళ్ (గోదాదేవి) ఒకరు. శ్రీవారిని స్తుతిస్తూ ఆండాళ్ రచించిన 30 పాశురాలను కలిపి తిరుప్పావై అంటారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలో తిరుప్పావై ఒక భాగం. తమిళ సాహిత్యంలో దీనికి విశేష ప్రాచుర్యం ఉంది. శ్రీవారి ఆలయంలో నెల రోజులపాటు జరిగే తిరుప్పావై పారాయణంలో రోజుకు ఒకటి వంతున అర్చకులు నివేదిస్తారు. ఈ సందర్భంలో సాధారణంగా భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకష్ణస్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఈ తిరుప్పావై పఠనం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.

**వైకుంఠ ఏకాదశి:** ఈ మాసంలోనే వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలలో శ్రీవారి ఆలయంలోని వైకుంఠ ద్వారాలను తెరచి ఉంచుతారు. ఈ రెండు పర్వదినాలలో పరమ పవిత్రమైన వైకుంఠ ద్వారం ద్వారా భక్తులు శ్రీవారిని దర్శించుకుంటారు.

## దక్షిణ మధ్యరైల్వేకు జాతీయ ఇంధన పొదుపు అవార్డులు

**సాక్షి, హైదరాబాద్:** ఇంధన పొదుపు విషయంలో దక్షిణ మధ్య రైల్వేకు నాలుగు జాతీయ అవార్డులు దక్కాయి. సౌర విద్యుత్ వినియోగం, ఆక్యుపెన్సీ, సెన్సార్ల వినియోగం, ఎల్‌ఈడీ బల్బుల వినియోగం, ఇంధన సామర్థ్యాన్ని పెంచే పంపుల వినియోగం వంటి అంశాల్లో చేపట్టిన చర్యలకుగాను ఈ అవార్డులు లభించాయి. ఈ నెల 14న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ నుంచి దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఎ.ఎ.ఫడ్కే, హైదరాబాద్ డివిజన్ ఇంజనీర్ డీఆర్‌ఎం ఎస్ఎస్ఆర్ ప్రసాద్‌లు అందుకున్నారు.

**పలు రైళ్ల రద్దు**

ఖరగ్‌పూర్ డివిజన్‌లో నిరసనల నేపథ్యంలో రైల్వే శాఖ పలురైళ్లను రద్దు చేసింది. హౌరా–సికింద్రాబాద్, హౌరా–కన్యాకుమారి, సంత్రాగచ్చి–పాండిచ్చేరి, అగర్తల–బెంగళూరు, గువాహటి–బెంగళూరు, గువాహటి–సికింద్రాబాద్, యశ్వంత్‌పూర్–హౌరా, మైసూరు–హౌరా, పూరి–చెన్నై రైళ్లను రద్దు చేసింది.

## పెంచిన పాల ధరలను తగ్గించాలి

**బాలల హక్కుల సంఘం డిమాండ్**

**సాక్షి, హైదరాబాద్:** పెంచిన విజయ పాల ధరను వెంటనే తగ్గించాలని రాష్ట్ర బాలల హక్కుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం సంఘం గౌరవ అధ్యక్షుడు అచ్యుత రావు ప్రకటన విడుదల చేశారు. పిల్లలకు దొరికే ఏకైక పౌష్టికాహారాన్ని, అలాగే తల్లి పాలకు దూరమైన పిల్లలు ఆధారపడే పాల ధరను పెంచితే పేద, మధ్యతరగతి పిల్లలు పాలకు దూరమవుతారని, ప్రభుత్వ రంగ విజయా డెయిరీ పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## సినీనటి రేవతికి మహానటి సావిత్రి అవార్డు ప్రదానం

**పాతగుంటూరు:** ప్రముఖ సినీనటి రేవతికి మహానటి సావిత్రి అవార్డుని, సినీ నేపథ్య గాయకుడు కృష్ణ చైతన్యకు ఘంటసాల మెలోడీ అవార్డుని గుంటూరు కళాదర్బార్ అమరా వతి సంస్థ అందజేసింది. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆది వారం జరిగిన కార్య క్రమంలో ఇరువురిని ఘనం గా సత్కరించింది.




అవార్డుతో సినీనటి రేవతి










Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com